ప్రభాతనవ

SINGIDI
తెలుగు దినపత్రిక

# సింగిడి

ప్రతి రంగూ ఓ నిజం

గురువారం 23 జులై 2026 | సంపుటి: 1 సంచిక: 36 పేజీలు 12 వెల: 6.50

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar


### ఇరాన్ చూసింది ట్రైలర్ మాత్రమే..

## సినిమా ముందుంది



అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో వార్నింగ్ ఇచ్చారు. ఇప్పట్లో ఆ దేశాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. నతాంజ్ అణు కేంద్రానికి సమీపంలో ఉన్న పికాక్స్ పర్వతంపై భీకర దాడులు చేస్తామని హెచ్చరించారు.

- న్యూయార్క్ (సింగిడి)

2



## మోదీతో శరద్ పవార్ భేటీ

2

నీట్ పేపర్ లీక్‌పై ప్రతిపక్షాల ఆందోళనల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ బుధవారం ప్రధానితో భేటీ అయ్యారు.

- న్యూఢిల్లీ, జులై 22 (సింగిడి)

## పవర్ కట్ లేనేలేదు

### 'ఎల్ నినో' షాక్‌ను తట్టుకున్న విద్యుత్ వ్యవస్థ

- వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన 16,500 మెగావాట్ల పీక్ డిమాండ్
- 2 వేల మెగావాట్ల నిరంతరాయంగా విద్యుత్ సరఫరా
- దేశంలోనే తొలిసారిగా 'ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్'
- ఎన్పీడీసీఎల్ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష



2

### అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ

## దరఖాస్తు చేసుకోవాల్సిందే

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- గాంధీభవన్ ప్రజలతో పొంగులేటి ముఖాముఖి
- సమస్యలను నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చిన బాధితులు
- ఇందిరమ్మ ఇండ్ల కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం



2



### కాంగ్రెస్ అగ్రనేతల

## అరెస్ట్‌కు నిరసన

2

- కొడంగల్ లో రేవంత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సిఎం డిమాండ్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ తదితరుల అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో భారీ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. కొడంగల్ ర్యాలీలో సిఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.

వికారాబాద్, జూలై 22 (సింగిడి)

### కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు

## బిజెపి ఎత్తులు

- కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు
- ఓట్లు పోకుండా జాగ్రత్తలు తీసుకోండి
- సర్‌పై బూత్‌లెవల్ కార్యకర్తలతో సిఎం రేవంత్

2



ప్రధాని మోడీ

## క్షమాపణలు చెప్పాలి

### మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

- 10 ఏళ్లలో 152 పేపర్ లీకేజీలు.. ఒక్కరికీ శిక్ష లేదు
- విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు చేపట్టాలి
- విపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్

2



2

### ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే

## నీట్‌పై చర్చ

### రాజ్యసభలో తేల్చి చెప్పిన కాంగ్రెస్ నేత ఖర్గే

నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే తేల్చి చెప్పారు. బుధవారం రాజ్యసభలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడివేడి చర్చ జరిగింది.

న్యూఢిల్లీ,జూలై22 (సింగిడి)

NEET PAPER LEAK PROTEST

# నీట్ వివాదం... అసలు రంగు రాజకీయం!

## పరీక్షా లోపాలే దేశవ్యాప్త ఆందోళనలకు కారణం

- విద్యార్థుల న్యాయం పేరిట విస్తరిస్తున్న ఉద్యమాలు
- అసలు అంశం దాటి రాజకీయ చర్చలు
- బాధ్యత, పరిష్కారం మధ్యన పొలిటికల్ పోరు







తప్పు ఒకరిది... తగవు అందరిది అన్నట్లు దేశంలో నీట్ పరీక్ష వివాదం ఇప్పుడు రాజకీయాల కేంద్రబిందువైంది. పరీక్ష నిర్వహణలో లోపాలు వెలుగులోకి వచ్చాయి. ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. దర్యాప్తు సంస్థలు పలువురిని అరెస్టు చేశాయి. అంటే వ్యవస్థలో తప్పు జరిగిందని ప్రభుత్వ చర్యలే చెబుతున్నాయి. కానీ ప్రజలు అడుగుతున్న ప్రశ్న మాత్రం మరోటి... తప్పు చేసిన వారిని పట్టుకోవడం సరిపోతుందా? ఆ తప్పుకు పరిపాలనా బాధ్యత ఎవరు తీసుకుంటారు అనే మొదలగునవి.

కరస్పాండెంట్ - సింగిడి

### కేంద్రం బాధ్యతపై పెరుగుతున్న చర్చ

విద్యాశాఖ పరిధిలో జరిగిన నీట్ పరీక్షా లోపాలపై రాజకీయ, ప్రజా వర్గాల్లో కేంద్ర ప్రభుత్వ బాధ్యతపై చర్చ కొనసాగుతోంది. దర్యాప్తు, అరెస్టులతో పాటు పరిపాలనా బాధ్యతపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

### విద్యా వ్యవస్థ సంస్కరణలపై వాంగ్‌చుక్ ఉద్యమం

సోనం వాంగ్‌చుక్ సహా పలువురు కార్యకర్తలు పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, విద్యార్థులకు న్యాయం, బాధ్యులపై కఠిన చర్యల కోసం ఉద్యమాలు కొనసాగిస్తున్నారు. మద్దతుదారులు దీనిని విద్యా సంస్కరణల ఉద్యమంగా అభివర్ణిస్తున్నారు.

### ఉద్యమాల చుట్టూ పెరుగుతున్న రాజకీయ, సిద్ధాంత చర్చలు

విద్యార్థుల సమస్యతో ప్రారంభమైన ఉద్యమాల చుట్టూ ఇప్పుడు రాజకీయ, సిద్ధాంతపరమైన చర్చలు కూడా చోటుచేసుకుంటున్నాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అసలు సమస్యపై దృష్టి నిలవాలనే అభిప్రాయం వినిపిస్తోంది.

### సోషల్ మీడియాలో భిన్న ప్రచారాలు

నీట్ అంశంపై సోషల్ మీడియాలో విభిన్న వర్గాలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. కొందరు విద్యార్థుల న్యాయానికే ప్రాధాన్యం ఇస్తుండగా, మరికొందరు చర్చలు అసలు అంశం నుంచి మళ్లుతున్నాయని పేర్కొంటున్నారు.

### రాహుల్ స్పందనతో రాజకీయ వేడి

నీట్ అంశంపై రాహుల్ గాంధీ స్పందనతో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు మరింత ముదిరాయి. ప్రజా సమస్యపై పోరాటమా, రాజకీయ అవకాశమా అన్న చర్చ కొనసాగుతోంది.

### పరిష్కారమే ప్రజల ప్రధాన ఆకాంక్ష

ప్రజా ప్రతినిధుల నుంచి ప్రజలు ఆశించేది పరస్పర విమర్శలు కాదు, సమస్యలకు శాశ్వత పరిష్కారాలు. నీట్ వివాదంలోనూ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించే సంస్కరణలపైనే ప్రజల దృష్టి నిలిచింది.





## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

### లోకభేవన్ ముట్టడికి కాంగ్రెస్ యత్నం

- గాంధీభవన్ ముట్టడికి బిజెపి నేతల దూకుడు
- ఇరువర్గాల పరస్పరం దాడులతో ఉద్రిక్తత
- రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు చేసిన పోలీసులు

2

## రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

- హన్మకొండలో ఆందోళనలో పాల్గొన్న భట్టి, కొండా సురేఖ
- కేంద్రం తీరుపై మండిపడ్డ డిప్యూటి సిఎం భట్టి

2



### రామగుండంలో

## విభేదాలకు ఫుల్‌స్టాప్

### పార్టీ బలోపేతంపై కేటీఆర్ దిశానిర్దేశం

2

కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని నేతలకు సూచన

**హైదరాబాద్, జూలై 22 (సింగిడి):**
*తెలంగాణలో బీఆర్ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చి పార్టీ అధినేత కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా ప్రతి నాయకుడు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు (కేటీఆర్) పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని కేసీఆర్ నివాసంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇన్‌చార్జి కోరుకంటి చందర్, సీనియర్ నాయకులు కౌశిక హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డితో కేటీఆర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు.*

### భోగాపురం ఎయిర్‌పోర్టు

## ప్రారంభోత్సవానికి రండి

### ప్రధాని మోదీకి సీఎం చంద్రబాబు ఆహ్వానం

భారతీయ విమానయాన రంగంలో మరో అద్భుతమైన చరిత్రను ఆవిష్కరించేందుకు రంగం సిద్ధమైంది. ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం నెరవేరుస్తూ, భోగాపురం వద్ద అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' ఆగస్టు 1 న జాతికి అంకితం కానుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఈ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నారు. ఈ విమానాశ్రయం కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు; ఇది ఉత్తరాంధ్ర ప్రాంత ఆర్థిక వృద్ధికి, పారిశ్రామికాభివృద్ధికి, ఉపాధి అవకాశాల సృష్టికి ఒక తిరుగులేని వారధిగా నిలవనుంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు.

- న్యూఢిల్లీ, జులై 22 (సింగిడి)



2

### ఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజీబిజీ

ఆరుగురు కేంద్ర మంత్రులతో కీలక భేటీ..!



### బాబు వల్లే పొగాకు రైతులకు

## కష్టాలు

2

232 మిలియన్ కిలోల పంటకు 16.5 శాతమే కొనుగోలు

- దళారులు దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర
- నిబంధనలు పాటించని సంస్థలపై చర్యలేవీ
- పొగాకు రైతులతో మాజీ సీఎం జగన్

## సీదిరి అప్పలరాజు అరెస్టు

- కాశీబుగ్గ నివాసంలో అదుపులోకి
- పోలీసులను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు
- రోడ్డు ప్రమాదంలో సాక్ష్యాలు తారుమారు కేసు
- ఇప్పటికే రిమాండ్ కుమారుడు అరవ్

2

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 23 జులై 2026

# కాంగ్రెస్ అగ్రనేతల అరెస్ట్‌కు నిరసన

ఈ సందర్భంగా మాట్లాడుతూ..భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రశ్న పత్రాలను అమ్ముకుంటున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. దిల్లీలో నిన్న రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును వ్యతిరేకిస్తూ కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలిలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈసందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ... నీట్ ప్రశ్నపత్రాలను పల్లీబఠా నీల్లా కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ధ్వజమెత్తారు. రాజకీయ పార్టీల కతీతంగా దేశవ్యాప్తంగా నిరసనలు జరుగుతున్నాయని, ప్రజా ఆందోళనలు పరిగణనలోకి తీసుకుని ధర్మేంద్ర ప్రదాన్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రాలు అమ్ముకున్న వారిని అరెస్టు చేసి జైల్లో పెట్టాలన్నారు. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో ధర్మేందప్రదాన్ చెలగాటం ఆడారు. ఆయన రాజీనామా చేయాలని దిల్లీలో యువత ఆందోళన చేపట్టింది. పార్లమెంటరీ వ్యవస్థలో ప్రజా సమస్యల్ని ప్రస్తావించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. 20వ తేదీ నుంచి ప్రారంభమైన పార్లమెంట్ ఉభయసభల్లో.. ప్రశ్నపత్రాల లీకేజీ అంశంపై చర్చించాలని కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి అడిగినా ప్రభుత్వం అనుమతించడం లేదు. లోకసేభ స్పీకర్ అంగీకరించడం లేదు. ప్రజాస్వామ్యానికి ఇది దురదృష్టకరమైన పరిస్థితి. దిల్లీ పోలీసులు రాహుల్‌గాంధీని కొడితే ఆయన ముక్కులో నుంచి రక్తం కారింది. ఈ దేశం కోసం రక్తం చిందించడంలో రాహుల్ గాంధీ మొదటివారు కాదు.. చివరివారూ కాదు. ఆనాడు మహాత్మాగాంధీ తెల్లదొరలతో కొట్లాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారు. గాంధీజీని పొట్టన పెట్టుకున్న గాడ్సే వారసులు మీరు అంటూ భాజపాపై తీవ్ర విమర్శలు చేశారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగం సాక్షిగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీపై కేంద్ర ప్రభుత్వ, పోలీసుల పాశవిక దాడికి ఖండిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడారని మండిపడ్డారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను అరెస్టు చేసి, పేపర్ లీక చేసిన వాళ్లను జైల్లో పెట్టాల్సింది పోయి.. విద్యార్థులపై పాశవిక దాడి జరిపారని ఫైర్ అయ్యారు. ఆడపిల్లలపై దాడి చేశారని.. విద్యార్థుల తలలు పగలగొట్టారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కనిపించడంలేదని, వారిని ఎక్కడికైనా తీసుకెళ్లారా లేక కిడ్నాప్ చేశారో తెలియదన్నారు. విద్యార్థులకు మద్దతుగా రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ.. ప్రధాని ఇంటి ముందు నిరసన చేపట్టారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం అంబేద్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కు అని చెప్పుకొచ్చారు. పేపర్ లీకపై పార్లమెంటులో చర్చ జరగకుండా అడ్డుకున్నారని.. రాహుల్ గాంధీపై పాశవిక దాడితో ఆయన రక్తం నేలకు చిందిందన్నారు. దేశం కోసం రక్తం చిందించడం గాంధీ కుటుంబానికి కొత్త కాదని తెలిపారు. పదేళ్లు అధికారంలో ఉన్నా సోనియా గాంధీ ప్రధాని పదవి తీసుకోలేదని.. మంత్రి పదవి కూడా చేపట్టలేదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా ప్రతిపక్ష నాయకుడిగా ఖర్గేను నియమించారు తప్ప పదవులు తీసుకోలేదని చెప్పుకొచ్చారు. 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామీ సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడి విద్యార్థుల ప్రాణాలు బలిగొందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలంగాణలో పప్పులు ఉడకవని పేరు మార్చుకుని గ్లోబరీనా సంస్థ కేంద్రం వద్దకు వెళ్లిందని.. అప్పుడే ఆ సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టి ఉంటే ఇప్పుడు ఇలా జరిగి ఉండేది కాదన్నారు. నీట్ పరీక్ష నిర్వహించడంతో దొంగతనం చేయొచ్చన్న ధైర్యం వాళ్లకు వచ్చిందని విమర్శించారు. అక్రమాలు, నీట్ పరీక్ష పేపర్ లీకేజ్‌పై విద్యార్థులు నిరసన తెలిపారని అన్నారు. లాఠీలు కాంగ్రెస్‌కు కొత్త కాదని.. ఆంగ్లేయులతో పోరాడి తరిమికొట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. దేశాన్ని దోచుకుంటుంటే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. యువత పక్షాన నిలిచి మోదీపై పోరాటానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసే వరకు ఈ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అందరం కలిసి పోరాటం చేసి మోదీని గద్దె దించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుందామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలుత రేవంత్‌రెడ్డి నివాసం నుంచి కొడంగల్‌లోని అంబేడ్కర్ కూడలి వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో స్థానిక నేతలు భారీ ఎత్తున పాల్గొన్నారు.




## రామగుండంలో విభేదాలకు ఫుల్‌స్టాప్

ఈ సందర్భంగా రామగుండం నియోజకవర్గంలో నెలకొన్న అంతర్గత విభేదాలు, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించినట్లు సమాచారం. సమావేశంలో గ్రూపు రాజకీయాలకు పూర్తిగా స్వస్తి పలికి, పార్టీ బలోపేతమే ప్రధాన లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని కేటీఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రామగుండం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌కు తెలియకుండా ఎలాంటి పార్టీ కార్యక్రమాలు నిర్వహించవద్దని నాయకులకు సూచించినట్లు తెలిసింది. అలాగే మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంపొందించి పార్టీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కేటీఆర్ ఆదేశించారు. రానున్న రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని రామగుండం నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు నాయకులందరూ ఒకే వేదికపై పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్లు వెల్లడైంది.

ఈ సమావేశం అనంతరం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఇన్‌చార్జి కోరుకంటి చందర్ మాట్లాడుతూ, పార్టీ అధిష్ఠానం ఇచ్చిన సూచనల మేరకు నియోజకవర్గంలో సమన్వయంతో ముందుకు సాగుతూ కేడర్‌లో నూతన ఉత్సాహం నింపేందుకు కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పార్టీ శ్రేణుల్లో సానుకూల సంకేతాలను పంపనున్నాయని ఆయన పేర్కొన్నారు.

## పవర్ కట్ లేనేలేదు

**హన్మకొండ,జూలై22 (సింగిడి):**

ఎల్ నినో ప్రతికూల వాతావరణ ప్రభావంతో వర్షాకాలంలోనూ వేసవిని తలపించిన విద్యుత్ డిమాండ్, పడిపోయిన జల విద్యుత్ ఉత్పత్తితో ఒకేసారి పడిన 7,000 మెగావాట్ల అదనపు భారాన్ని తెలంగాణ విద్యుత్ వ్యవస్థ అత్యంత సమర్థవంతంగా తట్టుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. సాధారణంగా వర్షాకాలంలో 11,000 మెగావాట్లుగా ఉండే పీక డిమాండ్ అనూహ్యంగా 16,500 మెగావాట్లకు చేరడం, మరోవైపు సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేక 2,000 మెగావాట్ల జల విద్యుత్ (హైడల్ పవర్) నిలిచిపోవడం డిస్ట్రిబ్యూషన్ వ్యవస్థపై తీవ్రమైన షాక లాంటి ఒత్తిడిని తెచ్చిందన్నారు. అయినప్పటికీ, విద్యుత్ సిబ్బంది అహర్నిశలు శ్రమించి, ముందు చూపుతో పక్కా ప్రణాళికలను అమలు చేయడం వల్లే ఈ సంక్లిష్ట పరిస్థితులను దాటుకొని ప్రజలకు ఎక్కడా ఇబ్బంది లేకుండా నిరంతరాయంగా ఉచిత, నాణ్యమైన విద్యుత్‌ను అందించగలుగు తున్నామన్నారు. హనుమకొండలోని ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ రంగ ప్రగతిపై ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రులు కొండ సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజు సీఎండీ వరుణ్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ కాళేశ్వరం, దేవాదుల, సీతారామ వంటి బృహత్తర ఎత్తిపోతల పథకాలతో పాటు వర్షాభావంతో రైతులు బోర్ వెల్స్ ఎక్కువగా వాడటం వల్ల పెరిగిన విద్యుత్ అవసరాలను ప్రభుత్వం విజయవంతంగా మేనేజ్ చేసిందన్నారు. రాష్ట్రంలో 'పవర్ కట్' అనేదే లేదని, వర్షాలు, ఈదురుగాలుల వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల స్తంభాలు, లైన్లపై చెట్లు కూలినప్పుడు మాత్రమే తాత్కాలికంగా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీనిని ప్రజలు పవర్ కట్‌గా భావించవద్దని స్పష్టం చేశారు. 'ప్రజా బాట', 'పొలం బాట' వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా అధికారులు స్వయంగా ప్రజల వద్దకే వెళ్తూ సమస్యలను పరిష్కరిస్తున్నారని అభినందించారు. గతంలో ఎక్కువ వడ్డీలతో తెచ్చిన పాత రుణాలను 'రీస్ట్రక్చరింగ్' చేయడం ద్వారా సంస్థల రుణభారం తగ్గించి, డిస్కంలను దేశంలోనే నంబర్-1 స్థానంలో నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. విద్యుత్ సేవా ప్రమాణాలను అత్యున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు దేశంలోనే ప్రథమంగా తెలంగాణలో ఎలక్ట్రిసిటీ అంబ్యులెన్స్ సేవలను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించారు. గతంలో వైద్యారోగ్య శాఖలో 108 అంబ్యులెన్స్ సేవలు తీసుకొచ్చిన తరహాలోనే, ఇప్పుడు విద్యుత్ అత్యవసర సమస్యల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు, నిచ్చెనలు, వైర్లతో పాటు నిపుణులైన ఇంజనీర్లు నిరంతరం అందుబాటులో ఉండేలా ఈ వాహనాలను రంగంలోకి దించామన్నారు. వినియోగదారులు ఉచిత టోల్ ఫ్రీ నంబర్1912 కు ఫోన్ చేయగానే, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాంకేతికత ద్వారా సమాచారాన్ని స్వీకరించి, ఆటోమేటిక్‌గా క్షణాల్లో సమాచారాన్ని అంబ్యులెన్స్ సిబ్బందికి చేరవేస్తుందని, ఈ వాహనాల ద్వారా అంబ్యులెన్స్ నిమిషాల వ్యవధిలోనే ఘటనా స్థలానికి చేరుకుని సమస్యను తక్షణమే పరిష్కరించడం వీలవుతుందని వివరించారు. విద్యుత్ వ్యవస్థకు మూలస్తంభాలైన లైన్‌మెన్లు, ఉద్యోగుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందని ఉద్ఘాటిస్తూ... విధి నిర్వహణలో అనుకోకుండా ప్రమాదం జరిగి సిబ్బంది మరణిస్తే ఆ కుటుంబానికి ఆసరాగా ఉండేందుకు రూ. 1.20 కోట్ల బీమా సౌకర్యాన్ని కల్పించామని తెలిపారు. అలాగే లైన్ క్లియరెన్స్ సమయంలో ప్రమాదాలను అరికట్టేందుకు అవసరమైన సేఫ్టీ కిట్లు, యూనిఫారాలు అందించినట్లు పేర్కొన్నారు. మరోవైపు 'గృహజ్యోతి' పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పొందుతున్న 53 లక్షల కుటుంబాల బిల్లుల మొత్తాన్ని ఆర్థిక శాఖ డిస్కం కంపెనీలకు చెల్లిస్తోందని తెలిపారు. దీంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 30 లక్షల వ్యవసాయ పంప్‌సెట్లకు ఏటా అయ్యే రూ. 14,000 కోట్ల సబ్సిడీ నిధులను కూడా ఆర్థిక శాఖ నేరుగా డిస్కంలకు విడుదల చేస్తోందని వెల్లడించారు.

## కాంగ్రెస్, బిజెపి పోటాపోటీ ఆందోళనలు

**హైదరాబాద్,జూలై22 (సింగిడి):**

కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలతో బుధవారం హైదరాబాద్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నీట్ ప్రశ్నపత్రం లీక వ్యవహారం, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లోకభేవన్ ముట్టడికి పిలుపునివ్వగా, మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ నివాసం ఎదుట కాంగ్రెస్ చేపట్టిన నిరసనను ఖండిస్తూ బీజేపీ నాయకులు గాంధీభవన్ ముట్టడికి పిలుపునిచ్చారు. దీంతో ఇరువర్గాలు ముట్టడికి బలయుదేరడంతో పాటు పరస్పర దాడులకు తెగించారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ కాంగ్రెస్ శ్రేణులు చేస్తున్న నిరసనలతో నాంపల్లి బీజేపీ కార్యాలయం దగ్గర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బీజేపీ ఆఫీస్ ముట్టడికి కాంగ్రెస్ నేతలు యత్నించారు. కాంగ్రెస్ నేతలు రాకుండా బీజేపీ నేతలు కర్రలతో అడ్డుకున్నారు.

## రాహుల్ అరెస్ట్‌కు నిరసనలు

**హన్మకొండ,జూలై22 (సింగిడి):**

కాంగ్రెస్ అగ్రనేత, లోకసేభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఎంపీ ప్రియాంక గాంధీ సహా పలువురు నేతలను కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా అరెస్ట్ చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తీవ్రంగా ఖండించారు. లోక సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టు ను నిరసిస్తూ హన్మకొండ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంత్రి కొండ సురేఖతో కలిసి భట్టి విక్రమార్క తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమానికి ముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, నాగరాజుతో పాటు పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రతిపక్ష నేతలను కర్కశంగా అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని మండిపడ్డారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీతో దేశంలోని కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైందని, ఈ అక్రమాలపై ప్రశ్నిస్తూ ఆందోళన చేస్తున్న అమాయక విద్యార్థులు, ఆడపిల్లల పట్ల పోలీసులు విచక్షణారహితంగా వ్యవహరించి లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో అరాచక పాలన సాగుతోందని, ప్రజల సమస్యలు వినడం మానేసి ప్రశ్నించిన వారిపై దాడులు, అరెస్టులు చేయడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. విద్యా వ్యవస్థను రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ చేపడుతున్న ఈ పోరాటానికి దేశంలోని ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు.

## ధర్మేంద్ర రాజీనామా చేస్తేనే నీట్‌పై చర్చ

ఈ సందర్భంగా మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. 'నీట్ అంశంపై నిష్పక్షపాతంగా చర్చ జరగాలంటే.. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా చేసేంతవరకు ఎలాంటి చర్చా ఉండదు' అని అన్నారు. దీనిపై లీడర్ ఆఫ్ ది హౌస్, కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. 'ప్రభుత్వం చర్చకు వెనకడుగు వేయడం లేదు. అన్ని అంశాలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఇప్పుడే చాలా స్పష్టంగా చెప్పారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించిన అన్ని విషయాలపై కూడా చర్చించడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మాది పారదర్శకమైన ప్రభుత్వం' అని అన్నారు.

## అర్బన్ ఇందిరమ్మ ఇళ్లకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిందే

**హైదరాబాద్, జులై 22 (సింగిడి)**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం 16 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించిన మంత్రి గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారు కూడా మరోసారి దరఖాస్తు చేసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు.

ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం : మీ సేవ కేంద్రాలు, వాట్సాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సూచించారు. కొత్త దరఖాస్తులతోపాటు పాత దరఖాస్తులను కూడా సమగ్రంగా పరిశీలించి అర్హులందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. యాప్‌లో వస్తున్న చిన్న, చిన్న సమస్యలను సరిదిద్దుతామని ప్రకటించారు. గాంధీభవన్‌లో నిర్వహించిన ప్రజలతో ముఖాముఖి కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తమ సమస్యలు చెప్పుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని, ఇప్పుడు ప్రతి వారం గాంధీభవన్‌లో మంత్రులు నేరుగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం : భూములు, ఇండ్లు, రెవెన్యూ, సంక్షేమ పథకాలకు సంబంధించిన సమస్యలను బాధితులు నేరుగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొన్ని సమస్యలపై అక్కడికక్కడే జిల్లా కలెక్టర్లకు ఫోన్ చేసి వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వంలో మంత్రులు ప్రజలకు అందుబాటులో ఉండేవారు కాదని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం ఉండేది కాదని ఎద్దేవా చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వారం ఒక మంత్రి గాంధీభవన్‌లో ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తూ నేరుగా సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఇంటి స్థలంలో వాటా హక్కు : గత ప్రభుత్వ నగరాలకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇండ్లు నిర్మించడం వల్ల ఉపాధి అవకాశాలు దూరమవుతాయనే కారణంతో చాలా మంది పేదలు ఆ ఇళ్లలో నివసించలేదని పొంగులేటి ఆరోపించారు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకుండా పేదలు పుట్టి పెరిగిన ప్రాంతంలోనే నివాసం కల్పించాలనే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ టవర్లలో నిర్మించే ఫ్లాట్ల విలువ రూ.40 లక్షల నుంచి కోటి రూపాయల వరకు ఉంటుందని, లబ్ధిదారులకు ఇంటి స్థలంలో వాటా హక్కు కూడా కల్పిస్తామని వివరించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రండి

ఈ సందర్భంగా ఆగస్టు 1న భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి రావాల్సిందిగా ప్రధానిని ఆహ్వానించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి వచ్చేందుకు ప్రధాని మోదీ అంగీకరించినట్లు తెలుస్తోంది. సుమారు 30 నిమిషాలకు పైగా చంద్రబాబు, మోదీ ముఖాముఖీ భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై ఇరువురి మధ్య సుదీర్ఘ చర్చలు జరిగినట్లు సమాచారం. బుధవారం చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాసవర్మ, ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, కలిశెట్టి అప్పలనాయుడు కూడా ప్రధానిని కలిశారు. ప్రధానితో చంద్రబాబు భేటీ సందర్భంగా ఆసక్తికర సన్నివేశం జరిగింది. టీడీపీ ఎంపీ అప్పలనాయుడిని భోగాపురం విమానాశ్రయం ఉన్న స్థానిక ఎంపీ అంటూ ప్రధాని మోదీకి ఆత్మీయంగా పరిచయం చేశారు. 'అప్పలనాయుడు నాకు తెలుసు… ఆయన ప్రతిరోజూ సైకిల్‌పై పార్లమెంటుకు వస్తున్నారు' అంటూ ఎంపీని ప్రధాని అభినందించారు. ప్రధానితో భేటీ అనంతరం కేంద్ర మంత్రి పీయుష్ గోయల్‌తో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. సుమారు 50 నిమిషాలు పాటు జరిగిన సమావేశంలో ఏపీకి కొత్త పారిశ్రామిక ప్రాజెక్టులు, పొగాకు, ఆక్వా రైతుల సమస్యలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఆపై కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశమయ్యారు.

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు బిజీబిజీ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన అత్యంత బిజీగా సాగింది. రాష్ట్ర అభివృద్ధి, పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రాజెక్టులు, నిధుల విడుదల, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం తదితర కీలక అంశాలపై ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశాలు నిర్వహించారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి మరింత సహకారం అందేలా వివిధ మంత్రిత్వ శాఖలకు సంబంధించిన అంశాలపై విజ్ఞాపనలు చేశారు. పార్లమెంట్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని చంద్రబాబు నాయుడు సుమారు 55 నిమిషాల పాటు కలిశారు. తొలుత కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, భూపతిరాజు శ్రీనివాస వర్మ, లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎంపీ అప్పలనాయుడుతో కలిసి ప్రధాని మోదీని ఆయన ఛాంబర్‌లో కలిసి, ఆగస్టు 1న జరగనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని అధికారికంగా ఆహ్వానించారు. అనంతరం ప్రధాని, ముఖ్యమంత్రి మధ్య సుమారు అరగంట పాటు ఏకాంతంగా చర్చలు జరగడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి, కేంద్ర-రాష్ట్ర సమన్వయం, కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, దేశ రాజకీయాలపై చర్చ జరిగినట్లు సమాచారం.

ప్రధాని మోదీతో భేటీ అనంతరం చంద్రబాబు పార్లమెంట్‌లోనే పలువురు కేంద్ర మంత్రులతో వరుస సమావేశాలు నిర్వహించారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఆక్వా రైతులు, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సి.ఆర్. పాటిల్‌తో పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతి, పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు, రాష్ట్రంలో నదుల అనుసంధానం, జల్ జీవన్ మిషన్ నిధుల విడుదల, ఇతర సాగునీటి ప్రాజెక్టులపై సమీక్షించారు. అనంతరం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిసి విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు, రాష్ట్రంలోని పట్టణాభివృద్ధి కార్యక్రమాలు, కేంద్ర సహకారంతో చేపట్టాల్సిన మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు. అలాగే పార్లమెంట్ లాబీలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, అశ్విని వైష్ణవ్, ప్రహ్లాద్ జోషిలను కూడా చంద్రబాబు కలిశారు. ఆయా శాఖలకు సంబంధించిన పెండింగ్ అంశాలు, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, కేంద్ర సహకారం అవసరమైన ప్రాజెక్టులపై విజ్ఞాపనలు అందజేసినట్లు తెలుస్తోంది. ఈ భేటీల్లో రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహకారం అందించేందుకు సానుకూల చర్చలు జరిగినట్లు సమాచారం. ఢిల్లీ పర్యటనలో కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కూడా కలవాలని ముఖ్యమంత్రి భావించినప్పటికీ, పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళనలు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన అపాయింట్‌మెంట్ ఖరారు కాకపోవడంతో భేటీ జరగలేదు.

## సీదిరి అప్పలరాజు అరెస్టు

**పలాస, జూలై22 (సింగిడి)**

వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు అరెస్టు చేశారు. శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని తన నివాసంలో పోలీసులు అప్పలరాజును అరెస్టు చేశారు. అరెస్ట్‌తో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆయనను అరెస్టు చేయకుండా వైసీపీ కార్యకర్తలు పోలీసులను అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. అప్పలరాజును అరెస్ట్ చేయవద్దంటూ వైసీపీ నేతలు భారీగా తరలివచ్చారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయగా, ఆ ప్రాంతంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. చివరకు పోలీసులు అప్పలరాజును బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లారు. రోడ్డు ప్రమాదం కేసు నుంచి కుమారుడిని తప్పించే ప్రయత్నం చేశారని అప్పలరాజుపై కేసు నమోదైంది. సాక్ష్యాలు తారుమారు చేశారని సీదిరిపై ఆరోపణలు ఉన్నాయి. విచారణ నిమిత్తం కాశీబుగ్గ పీఎస్‌కు తరలించారు పోలీసులు. ఇప్పటికే ఆయన కుమారుడు ఆరవ్ రిమాండ్‌లో ఉన్నారు. ఇప్పటికే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం అప్లై సీదిరి చేశారు.

## బాబు వల్లే పొగాకు రైతులకు కష్టాలు

**తాడేపల్లి, జూలై22 (సింగిడి):**

పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ధరల సంక్షోభంపై వైయస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పొగాకు రైతు ప్రతినిధులు, నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలం ప్రారంభమై దాదాపు 94 రోజులు గడిచినా, పండిన 232 మిలియన్ కిలోల పొగాకులో కేవలం 16.5 శాతం మాత్రమే కొనుగోలు చేయడం ప్రభుత్వ ఘోర వైఫల్యానికి నిదర్శనమని మండిపడ్డారు. సెప్టెంబరులో కర్ణాటకలో వేలం మొదలైతే ఇక్కడి రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు మద్దతుగా వచ్చే వారం పది రోజుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గోపాలపురం, జంగారెడ్డిగూడెంలో పర్యటించి ఆందోళనలు చేపడతానని, ప్రభుత్వం స్పందించకపోతే కందుకూరులోనూ పర్యటిస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించి పొగాకు ధర రూ.200కు తగ్గకూడదని హెచ్చరించిన మరుసటి రోజే మార్కెట్లో ధరలు దారుణంగా పడిపోయాయని జగన్ ఆరోపించారు. పొదిలి, టంగుటూరు, కనిగిరి, కందుకూరు, గోపాలపురం తదితర ప్రాంతాల్లో రూ.130 నుంచి రూ.186 మధ్యలోనే కొనుగోలు చేయడం వ్యాపారుల సిండికేట్ ఎంత బలంగా ఉందో తెలియజేస్తోందన్నారు. వ్యాపారులు నో బిడ్లు పెడుతూ, బేళ్లను తిరస్కరిస్తూ రైతులను నిలువునా దోచుకుంటున్నా ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. నిబంధనలు పాటించని కంపెనీలపై ఒక్క కేసు నమోదు చేయలేదని, లైసెన్సులను సస్పెండ్ చేయకపోవడం వల్లనే వ్యాపారులకు భయం లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. తన హయాంలో రైతుల రక్షణ కోసం అమలు చేసిన విప్లవాత్మక చర్యలను ఈ సందర్భంగా జగన్ గుర్తుచేశారు. వైయస్సార్‌సీపీ ప్రభుత్వంలో దేశంలోనే తొలిసారిగా మార్క్‌ఫెడ్ ను పొగాకు వేలం ప్లాట్‌ఫారమ్‌పైకి తీసుకొచ్చి కొనుగోళ్ళు చేపట్టామని, దీనివల్ల వ్యాపారుల సిండికేట్ విచ్ఛిన్నమై పోటీ పెరిగి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కాయని పేర్కొన్నారు. అలాగే రూ.3,000 కోట్లతో మార్కెట్ ఇంటర్వెన్షన్ ఫండ్ ఏర్పాటు చేసి, ఐదేళ్లలో పంటల కొనుగోళ్ల కోసం రూ.7,800 కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

## ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలి

దేశంలో వరుసగా జరుగుతున్న క్వశ్చన్ పేపర్ లీకేజీలు, పరీక్షల కుంభకోణాలు, విద్యార్థుల ఆందోళనలపై లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రస్తుత మోదీ ప్రభుత్వ హయాంలో భారత విద్యా వ్యవస్థ పూర్తిగా ధ్వంసమై, అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. గడచిన 10 ఏళ్లలో ఏకంగా 152 పేపర్ లీకేజీలు జరిగాయని, సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా ఇప్పటివరకు ఒక్కరిపై కూడా శిక్ష పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఈ సందర్భంగా దేశంలో దాదాపు 7.5 కోట్ల మంది విద్యార్థులు, వారి కుటుంబాల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చారని అన్నారు. విద్యా వ్యవస్థను సంస్కరించడానికి , నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయడానికి మూడు స్పష్టమైన, ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచారు. విద్యావ్యవస్థలోని అస్తవ్యస్తతకు, వరుస పేపర్ లీకేజీలకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధానే ప్రధాన బాధ్యుడని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆయనను అత్యంత అసమర్థుడు , అవినీతిపరుడు గా అభివర్ణిస్తూ, ఈ సంక్షోభానికి కారణం అయిన ఆయనను కేంద్ర కేబినెట్ నుంచి తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు. శాంతియుతంగా తమ భవిష్యత్తు కోసం నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు విచక్షణారహితంగా విరుచుకుపడటాన్ని రాహుల్ తీవ్రంగా ఖండించారు. ఆందోళనకారులపై దాడికి పాల్పడిన పోలీసు అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని, విద్యార్థులను అణచివేసే చర్యలకు నిరసనగా ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా విద్యార్థి లోకానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో కేవలం ధనవంతులకే చదువు దక్కేలా విద్యా వ్యవస్థ వ్యాపారీకరణ చెందిందని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ కోచింగ్ కోసమే దేశంలో ఏటా రూ. 1.32 లక్షల కోట్లు ఖర్చవుతోందని, ఇది దేశ మొత్తం విద్యా బడ్జెట్ కు దాదాపు సమానంగా ఉందని గణాంకాలతో సహా వివరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులను దూరం చేసేలా మారిన ఈ మాఫియా ఆధారిత కొనుగోలు వ్యవస్థను రద్దు చేసి, సమగ్ర సంస్కరణలు చేపట్టాలని కోరారు. ప్రధాని నివాసం ఎదుట జరిగిన ధర్నాలో పోలీసులు తనను నెట్టివేయడం లేదా లాఠీలతో లాగడంపై విలేకరులు ప్రశ్నించగా, రాహుల్ గాంధీ హుందాగా స్పందించారు. నన్ను ప్రభుత్వం ఎలా చూస్తుందనేది, కొన్ని దెబ్బలు తిన్నానా లేదా అనేది నాకు ముఖ్యం కాదు. విద్యార్థుల గొంతుకగా నిలవడం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను. నా వ్యక్తిగత విషయం కంటే కోట్ల మంది విద్యార్థుల భవిష్యత్తు, వారి నిరసనే నేడు దేశానికి అత్యంత ప్రాధాన్యమైన అంశం అని స్పష్టం చేశారు.

## కాంగ్రెస్ ఓట్లు తొలగించేందుకు బిజెపి ఎత్తులు

**వికారాబాద్,జూలై22 (సింగిడి):**

కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతోనే కాంగ్రెస్‌కు రాష్ట్రానికి నాయకత్వం వహించే అవకాశం వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం కొడంగల్‌లో పర్యటించిన సీఎం.. స్థానిక నాయకులు, బీఎల్ఏలతో సర్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 'కొడంగల్‌లో నన్ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో దెబ్బతీయాలంటే పునాదులు దెబ్బతీయాలని చూస్తున్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే. కొడంగల్‌లో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారు. ఇంట్లో పొగ పెడితే రేవంత్ రెడ్డి బయటకు రాకుండా ఉంటారని కుట్రలు చేస్తున్నారు. ఎదురు నిలబడలేక దొంగదెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారు. కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందని సిఎం అన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పనిచేసినా సమయం సరిపోవడంలేదని సీఎం తెలిపారు. ఆగస్టు 3 వరకు సర్ గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో మొత్తం 2,51,255 ఓట్లున్నాయని.. కానీ 1,96,626 ఓట్లు మాత్రమే సర్‌లో నమోదు చేసుకున్నారని.. మిగిలిన 54,635 నమోదు చేసుకోలేదని సీఎం తెలిపారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు జరగలేదని చెప్పారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు. వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత బీఎల్ఏలపై ఉందన్నారు. ఓటు పోగొట్టుకుంటే గుర్తింపు ఉండదని సీఎం తెలిపారు. ఓటు లేకుంటే చనిపోయిన వారితో సమానమన్నారు. కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలని నేతలకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటై కాంగ్రెస్‌ను దొంగదెబ్బ తీయాలని గూడుపుఠాణి చేస్తున్నాయని మండిపడ్డారు. ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపైనే ఉందన్నారు. ఈనెల 30లోగా నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటు కోల్పోవడానికి వీల్లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఎన్డీఏకు మద్దతు వార్తల వేళ.. మోదీతో శరద్ పవార్ భేటీ

ఉదయం ప్రధానమంత్రి కార్యాలయానికి విచ్చేసిన పవార్ ను మోదీ ఆత్మీయంగా ఆహ్వానించారు. స్వయంగా గుమ్మం వద్దకు ఎదురెళ్లి స్వాగతించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను పీఎంఓ ఎక్స్ ఖాతాలో షేర్ చేసింది. ఈ సమావేశంలో పవార్ కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే కూడా పాల్గొన్నారు. భేటీ సందర్భంగా పలు అంశాలపై నేతలు చర్చలు జరిపారు. రైతుల సమస్యలు, సాగు సంబంధిత ఇబ్బందులకు సంబంధించి ఓ మెమొరండమ్‌ను మోదీకి పవార్ అందించారు. ఎన్డీఏ కూటమికి శరద్ పవార్ పార్టీ మద్దతివ్వనుందని గత కొంతకాలంగా ప్రచారం జరుగుతోన్న వేళ.. వీరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ సమావేశం అనంతరం సుప్రియా సూలే ప్రతిపక్షాల భేటీలోనూ పాల్గొనడం గమనార్హం.

### ఇరాన్ చూసింది ట్రైలర్ మాత్రమే.. సినిమా ముందుంది: ట్రంప్

వాటి కింద ఉన్న రహస్య భూగర్భం లో ఆ దేశం అణు కార్యక్రమాలు తిరిగి ప్రారంభిస్తోందని పేర్కొన్నారు. మళ్లీ అణ్వాయుధాలను తయారు చేయకుండా ఆపడానికి దానిని పూర్తిగా నాశనం చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇరాన్‌పై జరిగిన దాడులు కేవలం ట్రైలర్ మాత్రమే అని.. త్వరలో సినిమా చూపిస్తామంటూ వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఇరాన్ వద్ద దాదాపు 1,000 పౌండ్ల శుద్ధి చేసిన యురేనియం ఉందని ట్రంప్ పేర్కొన్నారు. దానితో పికాక్స్ పర్వతం కింద తన అణు కార్యక్రమాన్ని చేపట్టడానికి ఆ దేశం చర్యలు తీసుకుంటున్నట్లు తమవద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. దానిని ధ్వంసం చేసి.. యురేనియం మొత్తాన్ని స్వాధీనం చేసుకోవడానికి త్వరలో సైనిక చర్య చేపడతామన్నారు. ఈ యుద్ధం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో తీవ్ర విధ్వంసం తప్పదని హెచ్చరించారు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం

Singidi
గురువారం
23-7-2026




# ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు..
# కేంద్రం కుట్ర

### నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ
## కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలి
### మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు

**పటాన్చెరు, జూలై 23 (సింగిడి):** దేశంలో ప్రజాస్వామ్యాన్ని పూడ్చిపెట్టి, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర కుట్రలు చేస్తోందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ నీలం మధు ముదిరాజ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల తరపున నిలబడి కేంద్రాన్ని నిలదీస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజాదరణను చూసి కేంద్ర ప్రభుత్వం భయపడుతోందని, అందులో భాగంగానే ఆయనతో పాటు ప్రతిపక్ష నేతలను అక్రమంగా అరెస్ట్ చేయిస్తోందని మండిపడ్డారు. రాహుల్ గాంధీ తో పాటు ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ, నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన 'చలో లోక్ భవన్' నిరసన కార్యక్రమంలో నీలం మధు ముదిరాజ్ పాల్గొని మాట్లాడారు. నెక్లెస్ రోడ్‌లోని ఇందిరమ్మ విగ్రహం వద్దకు వేలాదిగా తరలివచ్చిన కాంగ్రెస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యువతతో కలిసి ఆయన రాజ్ భవన్ వైపు భారీ ర్యాలీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ.. రాత్రింబవళ్లు కష్టపడి చదివిన లక్షలాది మంది నిరుపేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో బీజేపీ ప్రభుత్వం దారుణంగా చెలగాటమాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణంతో విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. ఈ దారుణమైన వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కక్షసాధింపు చర్యలతో ప్రతిపక్ష నాయకులను జైలుకు పంపినంత మాత్రాన కాంగ్రెస్ పోరాటాలను ఆపలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో దేశ ప్రజలు, యువత తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, అంబర్ పేట్ ఇంచార్జ్ డాక్టర్ సి రోహిన్ రెడ్డి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, డీసీసీ అధ్యక్షులు మోత రోహిత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ శ్రేణులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జి అప్రజాస్వామికం
### మాజీఎమ్మెల్యేమైనంపల్లి హనుమంతరావు



**అల్వాల్, జూలై 22(సింగిడి):** ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులు. యువతపై పోలీసులు లాటి చార్జి చేయడం. భాషవాయువు ప్రయోగించడం అప్రజస్వామికమని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పేర్కొన్నారు. ఆందోళన కార్యక్రమంలో లాటి చార్జిని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం పిలుపుమేరకు గోల్నాక మీసేవ నుండి ఓల్డ్ ఆల్వాల్ ఇందిరా గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగాఆందోళన చేపట్టినమల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు. నీట్ ప్రశ్న పత్రంలీకేజీ,విద్యార్థులపై లాటి చార్జికిబాధ్యతవహిస్తూకేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ విద్యార్థులపై జరిగిన దాడిని ప్రజాస్వామ్యం పై దాడిగా అభివర్ణించారు. నీట్ పేపర్ లీకేజీ ఘటన పై బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరినియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు అల్వాల్ సర్కిల్ ఆరు డివిజన్ల ప్రెసిడెంట్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. మోడీ దిష్టిబొమ్మ తగలబెట్టే ప్రయత్నంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి, వెంకటేష్ యాదవ్, నిమ్మ అశోక్ రెడ్డి, కేబుల్ శేఖర్, కృష్ణ గౌడ్ సూర్య కిరణ్,మల్లె శివ, సూర్య కిరణ్, దేవేందర్, కృష్ణ గౌడ్ భాస్కర్, భబిత, వీనస్ మేరీ, లావణ్య పాల్గొన్నారు.

## మాజీ కార్పొరేటర్ పాదయాత్ర



**అల్వాల్, జూలై 22(సింగిడి):** అల్వాల్ డివిజన్ బండ బస్తీ. రామాలయంలోమాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాసరెడ్డి కార్యకర్తలతో కలిసి పరిసర ప్రాంతాలు ఇంటింటికి తిరుగుతూ సమస్యలు. సర్ ప్రక్రియను అవగాహన కల్పిస్తూపాదయాత్ర నిర్వహిం చారు. ప్రతి ఒక్కరూ సర్ ప్రక్రియలో ప్రతి ఒక్కరు ఓటరు నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ప్రేమ్ కుమార్, రాజేందర్, లింగారెడ్డి, సాజిద్, గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పార్కుస్థలాన్ని కాపాడాలి



**అల్వాల్, జూలై 22 (సింగిడి):** అల్వాల్ సర్కిల్ జిహెచ్ఎంసి పరిధిలోనిఓల్డ్ ఆల్వాల్ లోని భీమ్ రావు కాలనీలో కాలనీకి సంబంధించినబావినీ నకిలీ పత్రాలను సృష్టించి భవన నిర్మాణ పనులు చేపడుతున్న సందర్భంగా మైనంపల్లి ఆదేశానుసారం మల్కాజ్గిరి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి కార్యకర్తలతో కలిసి స్థలము పరిశీలించారు. ఈ స్థలము భూమినీ బస్తీవాసులకు చెందేవిధంగా పనులను ఆపేశారు. కాలనీవారికి అండగాఉంటాననివారికికావలసిన పార్కు కోసం ప్రయత్నాలు చేస్తానని తోట లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. అధికారులు ఈ స్థలము కాలనీ వాసులకు పార్కు స్థలము కేటాయించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాయకులు పాల్గొన్నారు.

## ఎక్వాయిపల్లిలో భూసేకరణ
### పరిశీలించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జూలై 22(సింగిడి):** కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం కోసం భూ సేకరణ సమస్యపై భూస్వాములు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ భూములు, జీవనాధారంపై ప్రభావం పడకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లికి స్వయంగా వెళ్లి ప్రతిపాదిత ప్రాంతాన్ని పరిశీలించారు. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడారు. భూస్వాములకు న్యాయం జరిగేలా



ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అభివృద్ధి పనులతో పాటు రైతుల ప్రయోజనాలను కూడా పరిరక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహా, సర్పంచ్ కరుణాకర్, నాయకులు రవికాంత్, సుమన్, యాదయ్య,తదితరులు పాల్గొన్నారు,

## దరఖాస్తుల ఆహ్వానం

**వికారాబాద్, జూలై 22(సింగిడి):** తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, హైదరాబాద్, 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను కుట్టు మిషన్, చిరు వ్యాపారం, ఇ – బైక్, ఇ – స్కూటీ, మోటార్ బైక్ రంగాల కోసం అర్హులైన క్రైస్తవ మైనారిటీల నుండి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి ఎమ్. సుధీర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుట్టు మిషన్, చిరు వ్యాపార యూనిట్లకు 21 నుండి 55 సంవత్సరాల వయస్సు, ఇ – బైక్, ఇ – స్కూటీ, మోటార్ బైక్ యూనిట్లకు 21 నుండి 50 సంవత్సరాల వయస్సు ఉండాలి. కుటుంబ వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతాలలో రూ. 2 లక్షల లోపు, గ్రామీణ ప్రాంతాలలో రూ. 1,5 లోపు ఉండాలి. ఆసక్తి గల అర్హులైన అభ్యర్థులు పొడిగించబడిన గడువు తేదీ అయిన 19 జూలై 26 నుండి 31 జూలై 2026 సాయంత్రం



5 గంటల వరకు ఉన్నట్లు చెప్పారు. https://tgobmms.cgg.gov.in / వెబ్సైట్ ద్వారా ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం దరఖాస్తుదారులు 04023391067 నంబరును సంప్రదించవచ్చని లేదా https://t-gcmfc.in/ వెబ్ సైట్ ను సందర్శించాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసిన నిజప్రతులను సంబంధిత జిల్లా. మైనారిటీస్ సంక్షేమ శాఖ వికారాబాద్ ఎస్ – 16లో గల కార్యాలయంలో అందజేయగలరని తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు కృత్రిమమేధను ఉపయోగించుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ కలెక్టరేట్, జూలై 22 (సింగిడి):** ప్రభుత్వ ఉద్యోగులు రోజువారి విధులలో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) ను ఉపయోగించి ప్రభుత్వ పాలనలో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం, పనిని సులభ తరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ పని చేయడం, పనిలో తప్పులు దొర్లకుండా చూడ డం, పనిని సులభతరం చేయడానికి ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులకు, కలెక్టరేట్ సిబ్బందికి ఏర్పాటు చేసిన ఏఐ శిక్షణ కార్యకమానికి డిఆర్ఓ మాలతితో కలిసి అదనపు కలెక్టర్ హాజరై నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ టి ఫైబర్ వారి ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న ఈ ఏఐ శిక్షణ కార్యక్రమం అందరికి ఎంతగానో ఉపయోగపడుతుందనే అభిప్రాయంతో జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయించడం చాలా






సంతోష కరమన్నారు. మారుతున్న సాంకేతికతకనుగుణంగా అధికారులు సిబ్బంది అందరు తమ తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతోగానో తోడ్పడుతాయన్నారు. మొదటి పారిశ్రామిక విప్లవం స్టీమ్ ఇంజన్, రెండవ పారిశ్రామిక విప్లవం విద్యుత్ ఆవిష్కరణ, మూడవది డిజిటలైజేషన్---అంటే కంప్యూటర్ ఆవిష్కరణ, ఇక నాలుగవది ప్రస్తుత యుగం ఏఐ విప్లవం--- ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు), అందులో భాగంగా చాట్‌జీపీటీ (చాట్ జిపిటి) వంటి అల ఏఐ టూల్స్ అన్ని రంగాల్లోనూ విస్తరిస్తున్నాయన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా గతంలో పనులు ఎలా జరిగాయో అధ్యయనం చేసి, తదుపరి చర్యలను ముందుగానే ఊహించి, తదనుగుణంగా ఆఫీస్ ఫైళ్ల నిర్వహణ, ఆఫీసుల్లో ప్రతిరోజూ డ్రాఫ్టింగ్, నోటింగ్ వంటి పనులు, ఫైల్ మూవ్‌మెంట్ వంటి పనులను సులభతరం చేస్తుందన్నారు. డ్రాఫ్టింగ్ లలో జరిగే వ్యాకరణ దోషాల లేదా స్పెల్లింగ్ తప్పులనుఈ ఏఐ ద్వారా సరిచేసుకోవచ్చాన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్లు, పాంప్లెట్లు, లేదా ఫ్లెక్సీ బ్యానర్లు డిజైన్ చేయడానికి ఈ టూల్స్ అద్భుతంగా పనిచేస్తాయన్నారు. ఇౕ ఒక సహాయకారి మాత్రమే కాని ప్రత్యామ్నాయం కాదని ఏఐ టూల్స్ ఎంతో ఉపయోగపడినప్పటికీ, వాటిని 100% గుడ్డిగా నమ్మకూడదని తెలిపారు. ఏఐ ఇచ్చిన సమాచారాన్ని మీరు తప్పనిసరిగా ఒకసారి సరిచూసుకోవాలని ఏఐ టూల్స్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలోనే ఉన్నాయన్నారు. మానవ మేధస్సును మించిన ఆర్టిఫిషియల్ టూల్ కానీ, యంత్రం కానీ ప్రపంచంలో ఏదీ లేదని స్పష్టం చేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది పనిని సులభతరం చేసే ఒక సహాయకారి మాత్రమే, ప్రభుత్వంలో తుది నిర్ణయం ఎప్పుడూ ఒక అధికారి లేదా ఉద్యోగి మాత్రమే తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలనలో ఏఐ సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం, పనిని సులభతరం చేయడం, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం వంటి అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడం జరిగింది. డేటా విశ్లేషణ, నివేదికల తయారీ, లేఖల ముసాయిదా, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం మరియు రోజువారీ కార్యాలయ పనుల్లో ఏఐని ఎలా ఉపయోగించాలో శిక్షకులు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. అధికారులు మరియు సిబ్బంది అనేక సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన 'సూపర్ టీచర్' బృందానికి, వాసుదేవ్, రాజుకు అదనపు కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలి
### జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**సంగారెడ్డి బ్యూరో, జూలై 22 (సింగిడి):** పీసీఆర్, పీఓఏ చట్టాలను జిల్లాలో మరింత సమర్థవంతంగా అమలు చేసి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం, పీసీఆర్, పీఓఏ చట్టాల అమలుపై సమీక్షా సమావేశం బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో చోటుచేసుకునే ఎస్సీ, ఎస్టీలపై వివక్ష, అట్రాసిటీ ఘటనలను అత్యంత బాధ్యతాయుతంగా పరిగణించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెలుగులోకి రాని వాస్తవ ఘటనలను రెవెన్యూ, పోలీసు అధికారులు గుర్తించి, వాస్తవమైన ప్రతి కేసును నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. బాధితులకు చట్టప్రకారం అందాల్సిన రక్షణ, సహాయం, ఆర్థిక ఉపశమనం, న్యాయం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించాలని, ప్రతి రెవెన్యూ డివిజన్‌లో సబ్ డివిజనల్ స్థాయి విజిలెన్స్ అండ్




మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు ఆదేశించారు. 2022 నుండి ఇప్పటివరకు జిల్లాలో నమోదైన 144 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు ఆర్థిక ఉపశమనం కింద సుమారు రూ. 2.58 కోట్ల నిధులు అవసరమవగా, ఇప్పటివరకు రూ. 1.74 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో 37 మంది బాధితులకు రూ. 68,87,500/– విడుదల చేసినట్లు, మిగిలిన అర్హులైన బాధితులకు ఆర్థిక ఉపశమనం అందజేసే ప్రక్రియ కొనసాగుతున్నట్లు వివరించారు. సమావేశంలో పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిపై జిల్లా కలెక్టర్ డీఎస్పీలను కేసుల వారీగా వివరాలు అడిగి తెలుసుకుని, దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా అధికారులు పనిచేయాలని సూచించారు. దర్యాప్తును నిర్ణీత గడువులో పూర్తి చేసి చార్జిషీట్లు దాఖలు చేయాలని, గ్రామ, మండల స్థాయి కమిటీల ద్వారా అర్హులైన వారికి కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని అన్నారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 2026 జూన్ నెలాఖరు వరకు జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 31 కేసులు నమోదయ్యాయని తెలిపారు. అందులో 12 కేసులు దర్యాప్తు దశలో ఉండగా, 19 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు. ప్రతి కేసులో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తూ, చట్టప్రకారం సత్వర న్యాయం అందేలా పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పాండు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జగదీష్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారం నింపిన సీఎం రేవంత్ రెడ్డి

**కొడంగల్, జూలై 22(సింగిడి):** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పట్టణంలోని తన నివాసంలో ఎస్ ఐ ఆర్ ఫారం పై తన ఓటు వివరాలు నమోదు చేసి, బిఎల్ ఓ కు అందజేశారు. ఈకార్యక్రమంలో ముఖ్యమంత్రి తో మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, పాటు పార్టీ సీనియర్ నాయకులు



యూసుఫ్,జగదీశ్వర్ రెడ్డి, ముద్దప్ప,ప్రభుత్వ అధికారులు ఉన్నారు.

### ఆర్టీసీ అధికారుల పని తీరుపై
## మండిపడుతున్న ప్రయాణికులు




**సిద్ధిపేట బ్యూరో, జూలై 22 (సింగిడి):** ప్రజా సౌకర్యమే ఆర్టీసీ లక్ష్యం అంటూ ఆర్భాటాలు తప్ప అమలుకు నోచుకోవడం లేదంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వివరాలలోకి వెళితే సిద్ధిపేట, దుబ్బాక డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులు వర్గల్ మండలం గౌరారం స్టేజి వద్ద నిలుపకుండా వెళ్ళడం తో ప్రయాణీకులు నానా అవస్థలు పడవలసిన దుస్థితి నెలకొందంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గౌరారం స్టేజి వద్ద ఎక్స్ప్రెస్ బస్ స్టాప్ ఉన్నప్పటికీ ఆర్టీసీ సిబ్బంది ఆపకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రజా రవాణా ప్రజా సేవయే లక్ష్యం అనే నినాదంతో సేవలు అందిస్తున్న తెలంగాణ ఆర్టీసీ, ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవహరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. గౌరారం స్టేజ్ వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ప్రజ్ఞాపూర్ వద్ద దిగి, అక్కడి నుంచి మరో బస్సు లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ దీంతో అదనపు ఖర్చుతో పాటు విలువైన సమయం వృధా అవుతుందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు ప్రయాణించేందుకు సౌకర్యం కల్పించడమే ఆర్టీసీ ప్రధాన బాధ్యత అని అధికారికంగా ఉన్న స్టేజ్ వద్ద బస్సులు ఆగకుండా ముందుకు వెళ్లడం వల్ల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారని , ఒకవైపు ప్రజలకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా, మరోవైపు ఆర్టీసీకి కూడా ఆదాయ నష్టాన్ని తెచ్చిపెడుతోందని అభిప్రాయపడుతున్నారు. ప్రజా అవసరాలే ప్రాధాన్యంగా భావించి, దుబ్బాక , సిద్ధిపేట డిపో అధికారులు వెంటనే స్పందించి గౌరారం స్టేజ్ వద్ద అన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులు తప్పనిసరిగా ఆగేలా డ్రైవర్లు, కండక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి గౌరారం స్టేజ్ సమస్యను వెంటనే పరిష్కరిస్తే ప్రజల్లో ఆర్టీసీపై మరింత విశ్వాసం పెరుగుతుందని, ప్రజా సౌకర్యమే నిజమైన ప్రజాసేవ అనే సందేశాన్ని తెలంగాణ ఆర్టీసీ ఆచరణలో చూపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

**డిపో మేనేజర్ వివరణ..**

ప్రయాణికుల నుండి వెలువడుతున్న విమర్శలు, అభిప్రాయాలపై వివరణ కోసం సిద్ధిపేట, దుబ్బాక డిపో మేనేజర్ కు నినాదం బ్యూరో ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.

# విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించేది లేదు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**ఆమనగల్లు, జూలై 22(సింగిడి):** ఢిల్లీలో నిట్ పరీక్ష వివాదం, విద్యార్థులపై జరిగిన పోలీసుల లాఠీచార్జికి వ్యతిరేకంగా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టును నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం భారీ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా చేపట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేసి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కడ్తాల్ నిరసనలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించలేని కేంద్ర ప్రభుత్వం తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆందోళన చేస్తున్న విద్యార్థులపై అమానుషంగా వ్యవహరించిందని విమర్శించారు. విద్యార్థినులను రోడ్లపై పరుగెత్తించి రక్తం వచ్చేలా కొట్టడం అత్యంత దారుణమని, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా చెప్పుకునే భారతదేశానికి ఇది తలవంపులు తెచ్చే ఘటన అని అన్నారు. నీట్ పేపర్ లీక్ కారణంగా సుమారు 25 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, ఈ ఘటనల నేపథ్యంలో 21 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ



సంఘటనలకు బాధ్యులు ఎవరో గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, మృతుల కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై విరిగిన ప్రతి లాఠీకి, చిందిన ప్రతి రక్తపు చుక్కకు దేశ ప్రజలు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు రూపంలో సమాధానం చెబుతారని ఎమ్మెల్యే హెచ్చరించారు. విద్యార్థులపై జరిగిన పోలీసుల దాష్టీకం దేశ ప్రజలను తీవ్రంగా కలచివేసిందని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన నీట్ పరీక్షలో అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం ఎంతో కష్టపడి పరీక్షలు రాస్తున్నారని, అలాంటి పరీక్షల్లో అక్రమాలు చోటుచేసుకుంటే వారి జీవితాలు తీవ్రంగా ప్రభావితమవుతాయని అన్నారు. విద్యార్థులు తమ న్యాయమైన సమస్యలపై ప్రశాంతంగా నిరసన వ్యక్తం చేస్తే వారిపై లాఠీఛార్జ్ చేయడం, పోలీసుల బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఎమ్మెల్యే అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై అణచివేత చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్షల నిర్వహణలో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన నిలబడి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిందని, ఆ హక్కును కాలరాయడానికి ఎవరూ ప్రయత్నించకూడదని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు, పరీక్షా వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. నీట్ పరీక్షపై విద్యార్థుల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం అవసరమైతే మరిన్ని ప్రజా ఉద్యమాలు చేపడతామని ఆయన తెలిపారు.. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## ఎజెండాలో నీట్‌పై చర్చ ఎందుకు లేదు !

తప్పు జరిగినప్పుడు ప్రభుత్వంలో ఎవరు ఉంటే వారినే నిందిస్తారు. వారిమీదే విమర్శలు గుప్పిస్తారు. పాలన బ్రహ్మాండంగా చేస్తుంటే.. పకడ్బందీగా చర్యలు తీసుకుని ఉంటే నీట్ పేపర్ ఎందుకు లీక్ అవుతుంది. ఎందుకు దుర్మార్గులు పేపర్ అమ్ముకునేందుకు సాహసిస్తారు. ఇలా చేయడం వల్ల ఎందరో విద్యార్థుల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. కొందరు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇదంతా కూడా ప్రభుత్వ వైఫల్యంగానే చూడాలి. అన్ని రాష్ట్రాలు తమంత తాముగా ఎంసెట్ నిర్వహించుకుని, పక్కాగా ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే, దానిని కాదని నీట్‌ను ప్రవేశ పెట్టారు. కేంద్రం ఆంధీనంలోని ఎన్‌టిఎ నీట్ నిర్వహణలో ఎందుకు తప్పుచేసింది. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరించింది. నిజానికి పేపర్లు లీక్ చేసిన వారిని, అమ్ముకున్న వారిని బహిరంగంగా ఉరితీయాలి. ఇకపోతే ప్రస్తుతానికి వస్తే... పేపర్ లీక్‌లో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని సోనమ్ వాంగ్‌చుక్ డిమాండ్ చేస్తూ వచ్చారు. దీక్షకు దిగారు, కాక్రోచ్ పార్టీ మొదటి డిమాండ్ ఇదే తమ డిమాండ్ అని ప్రకటించింది. ఢిల్లీలో ఆందోళనకు పిలుపును ఇచ్చింది. అయినా ప్రభుత్వం మొద్దునిద్ర వీడలేదు. దీనిపై ప్రధాని స్పందించలేదు. నిరంతరం విదీశీ పర్యటనలతో గడుపుతున్న ప్రధాని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడడం లేదు. పార్లమెంట్ సమావేశాలకు ముందే ప్రధాని స్పందించి, సిజెపి నేతలను పిలిచి మాట్లాడడం, నీట్‌పై తీసుకుంటున్న చర్యలను వివరించడం జరిగివుంటే బాగుండేది. నిజానికి సమస్యలను పరిష్కరించడం అన్నది ప్రజల కోసమే కదా. మరి ఎందుకు పెద్దగా స్పందించలేదన్నదే సమస్య. ఇకపోతే కాక్రోచ్ పార్టీ చేస్తున్న ఆందోళనలను హైజాక్ చేసేందుకు కాంగ్రెస్ , రాహుల్ గాంధీ యత్నించారనే చెప్పాలి. విద్యార్థుల ఆందోళనలో దూరడం ద్వారా సమస్యకు రాజకీయం పులిమారు. రాహుల్‌కు సమస్యల పట్ల చిత్తశుద్ధి కనిపించడం లేదు. పార్లమెంటులో చర్చించి, ప్రభుత్వాన్ని నిలదీయాల్సిన పెద్దమనిషి రాజకీయ డ్రామాకు తెరతీసారు. ఇకపోతే అధికార పార్టీ నేతలు చేస్తున్న వాదనలో పసలేదు. నీట్ పేపర్ లీక్ అంశంపై కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల భవిష్య త్తుతో రాజకీయాలు చేస్తోందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీవ్ర విమర్శలు చేశారు. ప్రభుత్వం పార్లమెంట్‌లో చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంగ్రెస్ రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన నిరసనపై స్పందించిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇది భారత రాజకీయ చరిత్రలో ఒక చీకటి రోజని పేర్కొంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాంగ్రెస్ ఉల్లంఘించిందని విమర్శించారు. విమర్శించ డానికి ఎన్నయినా చెప్పవచ్చు. నిజానికి నీట్ అంశంపై చర్చను ఎజెండాలో పెట్టివుంటే సమస్య వచ్చి ఉండేది కాదు. ఎందుకు అజెండాలో పెట్టలేదో ముందుగా కేంద్రం వివరణ ఇవ్వాలి. మొత్తంగా ఇప్పుడు తప్పెవరిదంటే.. అధికార పార్టీదే అని చెప్పాలి. సమస్యపై చిత్తశుద్ధి లేకపోవడం వల్లనే దేశ రాజధాని ఢిల్లీ ఆందోళనలతో అట్టుడుకుతోంది. సీజేపీ, కాంగ్రెస్ ధర్నాలతో హైటెన్షన్ నెలకొంది. విద్యార్థులపై లాఠీచార్జ్‌కు నిరసనగా.. ప్రధాని నివాసం దగ్గర 3 గంటలపాటు కాంగ్రెస్ మెరుపుధర్నా నిర్వహించింది. పార్లమెంటు వాయిదా తర్వాత పాదయాత్ర చేసిన కాంగ్రెస్ ఎంపీలు.. నేరుగా ప్రధాని నివాస దగ్గరకు వెళ్లి ధర్నా నిర్వహిచారు. నీట్ పేపర్ లీక్‌పై ప్రధాని, హోంమంత్రి, విద్యాశాఖ మంత్రి రాజీనామాకు రాహుల్ డిమాండ్ చేశారు. కాగా.. రాహుల్, ప్రియాంక సహా.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఆ తర్వాత రాత్రి విడుదల చేశారు. 'చలో సంసద్' మార్చ్ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ నిరసనకారులపై పోలీసుల చర్యలు, కాంగ్రెస్ ధర్నా.. తర్వాత కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ విద్యార్థులను రాజకీయ సాధనంగా వాడుకుంటున్నాయని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ వివాదానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయకుండా, పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్ గందరగోళం సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని ప్రధాన్ ఆరోపించారు. పార్లమెంటులో నీట్ అంశంపై సవివరంగా చర్చించడానికి ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం వెలుపల నిరసన చేపట్టారని కేంద్ర మంత్రి ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సమగ్ర చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రభుత్వం తెలియజేసినప్పటికీ, కాంగ్రెస్ ప్రజాస్వామ్య చర్చ కన్నా రాజకీయ ప్రదర్శనకే ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రాహుల్ గాంధీకి విద్యార్థులు అవసరం లేదు.. గొడవలు సృష్టించడమే లక్ష్యమంటూ పేర్కొన్నారు.. విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ రాజకీయం చేస్తుందని ఆరోపించారు. విద్యార్థులకు సమాధానాలు, సంస్కరణలు, జవాబుదారీతనం అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటున్న ధర్మేంద్ర ప్రధాన్ ఇంతకాలం ఎందుకు స్పందించ లేదో చెప్పాలి. విపక్షంలో ఉన్నవారు ఎవ్వరైనా రాజకీయం చేస్తారు. బిజెపి కూడా అదే చేసేది. ప్రజాస్వామ్య నియమాలను, పార్లమెంటరీ సంప్రదాయాలను పాటిస్తే మంచిది. సమస్య ఏదైనా చర్చకు అవకావం రావాలి. ఎందుకంటే ఈ మధ్య కాలంలో పార్లమెంటులో సమర్థవం తంగా చర్చలు సాగడం లేదు. సమస్యలపై ప్రస్తావన జరగడం లేదు. ఇందుకు అధికార పక్షానిదే ప్రధాన బాధ్యత. విద్యార్థులు లేవనెత్తు తున్న సమస్యలపై ప్రభుత్వం చర్చించాలనుకుంటే ఎందుకు ఎజెండాలో పెట్టలేదో చెప్పాలి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష పార్టీకి నిరసన తెలిపే హక్కు ఉంటుంది. పార్లమెంటులో చర్చలకు అవకాశం రానప్పుడు ఎవ్వరైనా వీధుల్లోనే నిరసనలు తెలుపుతారు. తాము అనుకున్నట్లుగానే పార్లమెంట్ నడవాలని పాలకపక్షం కోరుకోవడం సరికాదు. ప్రజలకు ఏది అవసరమో అది గుర్తించి, చర్చించి, పరిష్కరిస్తే మంచిది.

భారత జాతీయోద్యమ పిత

# బాలగంగాధర తిలక్

జూలై 23 తిలక్ జయంతి సందర్భంగా...

బాలగంగాధర తిలక్ (జూలై 23, 1856 – ఆగష్టు 1, 1920) స్వరాజ్య పోరాటంలో పాల్గొన్న తొలితరం త్యాగమూర్తులలో బాలగంగాధర తిలక్ అగ్రగణ్యులు. ఆయనను భారత జాతీయోద్యమ పితగా పేర్కొంటారు. తిలక్ జాతీయోద్యమాన్ని కొత్తపుంతలు తొక్కించాడు. దేశవ్యాప్తంగా సామాన్య ప్రజలను ఉద్యమంలో పాల్గొనేట్లు చేయడంలో ఆయన పాత్ర మరిచి పోలేనిది. భరత జాతిని స్వాతంత్ర్య సమరోత్సాహంతో జాగృత మొనర్చిన మహానేత లోకమాన్య తిలక్. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేగిన అశాంతికి మూల కారకుడుగా భావిస్తారు.




బాలగంగాధర తిలక్ 1856 జూలై 23వ తేదీన మహారాష్ట్ర రాష్ట్రంలోని రత్నగిరిలో మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు, ఉపాధ్యాయుడు. బాల్యంలో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో విశేష ప్రతిభ కనబరచేవారు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీతో బాటు ముక్కుసూటి తనం ఆయన సహజ గుణం. కళాశాలకు వెళ్లి ఆధునిక విద్య నభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకరు. ఆంగ్ల విద్యను అందుకున్న తొలి తరం భారతీయులలో అగ్రగణ్యులు. ఆంగ్ల విద్య ప్రభావంతో భారతీయులు అనుభవిస్తున్న బానిసత్వం గురించి తెలుసుకున్న వర్గంలో కూడా తిలక్ అగ్రగణ్యులే. తిలక్ కు పదేళ్ళ వయసున్నప్పుడు అతను తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకు వచ్చింది. ఆయన అక్కడ ఆంగ్లో-వెర్నాక్యులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్య సించారు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే అతను తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయారు. మెట్రిక్యు లేషన్ చదువు తున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక అతను దక్కన్ కళాశాలలో చేరారు. 1877లో అతను గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రు డయ్యారు. ఆ తర్వాత తన చదువును కొనసాగించి ఎల్ ఎల్ బి పట్టా కూడా పొందారు. తిలక్ 1890లో కాంగ్రెస్ లో చేరారు. కానీ త్వరలోనే కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని అతను నమ్మారు. అప్పటి వరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరి వారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాల గురించి మెతక వైఖరి తో చర్చించడానికే పరిమితం అయ్యేది. మితవాదుల ధోరణి సమ్మతంగా ఉండేది కాదు. విన్నపాలు, వినతులు వలస ప్రభుత్వాన్ని లొంగదీయ లేవని తిలక్ సిద్ధాంతం. దాదాభాయ్ నౌరోజీ అంటే ఎంతో గౌరవం. భారత పేదరికం బ్రిటిష్ పుణ్యమేనన్న నౌరోజీ సిద్ధాంతాన్ని సమర్థించడమే కాకుండా, తన పత్రికలో ఎంతో ప్రాచుర్యం కల్పించారు. అలాగే గోఖలే చాలా అంశాలలో తిలక్ కు విభేదాలు ఉండేవి. కాంగ్రెస్ నేతల విధానాలపై తిలక్ ఘాటైన విమర్శలు చేశారు: "మీరు సంవత్సరాని కొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్‌స్టిట్యూషన్)" అన్నారు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించారు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని తీర్మానించారు. 1889లో బొంబాయి కాంగ్రెస్ మహాసభకు ప్రతినిధిగా హాజరైన తిలక్ అక్కడనే లాలాలజ్‌పత్ రాయ్, బిపిన్‌చంద్ర పాల్‌ను కలుసు కున్నారు. ఆ ముగ్గురు మహా నేతలు భారతదేశ చరిత్రలో లాల్-బాల్-పాల్‌గా ప్రసిద్ధులైనారు. వారితోనే కాంగ్రెస్‌లో అతివాదుల శకం ప్రారంభమైంది. 1907లో మహారాష్ట్ర లోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోగా, మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టు కున్నారు. అతివాదులుగా పిలవబడే తిలక్, ఆయన మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటైనారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్య విద్యా విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అది భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని అగౌరవ పరచి భారతీయ విద్యార్థులను చిన్న బుచ్చే విధంగా ఉందని, ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం ఆయనది. ప్రతి భారతీయునికి భారతీయ సంస్కృతి గురించి, భారత దేశపు ఔన్నత్యాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అదే ఆశయంతో అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి "దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ"ని స్థాపించారు. తర్వాత తాను నడిపిన పత్రికలు "మరాఠా (ఆంగ్ల పత్రిక)", "కేసరి (మరాఠీ పత్రిక)" లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశారు. బాల్య వివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించారు. జాతీయ స్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలి పెట్టలేదు. మొట్టమొదటి సారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం మొదలు పెట్టారు. తన పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో ఆయనకు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదల య్యాక అతను స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారు. బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని ఆపేయగా, ఆ ప్రకటన స్పష్టంగా లేక పోవడంతో, తిలక్ విభేదించగా, ఇద్దరు నాయకులదీ చెరొక దారి కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడి పోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. అందుకే 1920లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మరణం తో జాతీయోద్యమం చుక్కాని లేని నావ అవుతుందని చాలా మంది భయపడ్డారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
9440595494

# శిక్షించడం కాదు... సంస్కరించడమే జైలు లక్ష్యం కావాలి...

నేరం చేసిన వ్యక్తికి శిక్ష విధించడం న్యాయవ్యవస్థ బాధ్యత. కానీ ఆ శిక్ష లక్ష్యం ప్రతీకారమా? లేక ఆ వ్యక్తిని మళ్లీ సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమా? ఆధునిక న్యాయసూత్రాలు రెండో లక్ష్యానికే ప్రాధాన్యం ఇస్తాయి. శిక్షతో పాటు సంస్కరణకు అవకాశం కల్పించినప్పుడే న్యాయం సంపూర్ణమవుతుంది.

భారత రాజ్యాంగం మానవ గౌరవాన్ని అత్యున్నత విలువగా గుర్తించింది. అయితే దేశంలోని అనేక జైళ్ల పరిస్థితి ఇప్పటికీ ఆ లక్ష్యానికి దూరంగానే ఉంది. రద్దీ, పరిశు భ్రత లోపం, విద్యా--నైపుణ్య శిక్షణ కొరత, మానసిక ఆరోగ్య సేవల లేమి వంటి సమస్యలు ఖైదీల జీవితాలను మరింత క్లిష్టం చేస్తున్నాయి. ఫలితంగా, జైలు నుంచి బయటకు వచ్చే కొందరు వ్యక్తులు సంస్కరించబడకుండా, మరింత నేరప్రవృత్తితో సమాజంలోకి అడుగు పెడుతున్నారు.



జాతీయ నేర గణాంకాల బ్యూరో (చీజ=దీ) గణాంకాల ప్రకారం భారత జైళ్లలో ఉన్న ఖైదీలలో అధిక శాతం మంది విచారణ ఖైదీలే. అంటే వారిపై ఇంకా నేరం రుజువు కాలేదు. అయినప్పటికీ, వారు శిక్ష ఖరారైన ఖైదీలతోనే కలిసి ఉండాల్సి వస్తోంది. ఇది న్యాయసూత్రాల ఆత్మకు విరుద్ధమనే అభిప్రాయం న్యాయ నిపుణుల్లో ఉంది.

**ప్రస్తుత వ్యవస్థలోని ప్రధాన సమస్యలు**

అధిక రద్దీ: చాలా జైళ్లు తమ సామర్థ్యానికి మించి ఖైదీలతో నిండిపోతున్నాయి. దీనివల్ల పరిశుభ్రత, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలు దెబ్బతింటున్నాయి.

చిన్న నేరాలకు జైలు శిక్ష: స్వల్ప నేరాలకు కూడా జైలు శిక్ష విధించడం వల్ల వ్యక్తిపై శాశ్వత సామాజిక ముద్ర పడుతుంది. చిన్న తప్పిదం చేసిన వ్యక్తి కూడా కఠిన నేరస్థుల మధ్య జీవించాల్సి రావడం మరింత ప్రమాదకరం.

నైపుణ్యాల కొరత: జైలు నుంచి విడుదలైన తర్వాత ఉపాధి అవకాశాలు లేక చాలామంది తిరిగి నేరాల వైపు మళ్లే పరిస్థితి ఏర్పడుతోంది.

విచారణలో జాప్యం: తీర్పు వెలువడకముందే సంవత్సరాల తరబడి జైలులో ఉండాల్సి రావడం న్యాయవ్యవస్థలోని అత్యంత బాధాకరమైన అంశాల్లో ఒకటి.

అమలు చేయాల్సిన సంస్కరణలు

కమ్యూనిటీ సర్వీస్‌కు ప్రాధాన్యం: చిన్న నేరాలు, మొదటిసారి నేరం చేసిన వారికి జైలు శిక్షకు బదులుగా సమాజ సేవ విధించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులు, పారిశుద్ధ్య కార్యక్రమాల్లో సేవలందించే అవకాశం కల్పించాలి.

ప్రతి జైలును నైపుణ్య కేంద్రంగా మార్చాలి: ఐటీఐ, కంప్యూటర్ శిక్షణ, టైలరింగ్, వ్యవసాయం, హస్తకళలు, చిన్న పరిశ్రమలపై శిక్షణ అందించి, విడుదల అనంతరం స్వయం ఉపాధికి అవకాశం కల్పించాలి. జైళ్లలో తయారయ్యే ఉత్పత్తులకు మార్కెట్ కల్పించడం ద్వారా ఖైదీల ఆత్మవిశ్వాసాన్ని పెంచవచ్చు.

ప్రత్యేక వసతి సదుపాయాలు: విచారణ ఖైదీలు, మహిళలు, వృద్ధులు, మొదటిసారి నేరం చేసిన వారికి ప్రత్యేక బ్యారక్‌లు ఏర్పాటు చేసి, వారి అవసరాలకు అనుగుణంగా సంరక్షణ కల్పించాలి.

విడుదల తర్వాత పునరావాసం: జైలు నుంచి విడుదలైన తర్వాత కనీసం ఆరు నెలలపాటు ఉపాధి మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్, ఆర్థిక పునరావాస పథకాలు అందుబాటులో ఉండాలి. సమాజం వారిని తిరస్కరించకుండా స్వీకరించే వాతావరణం కల్పించాలి.

ప్రపంచంలోని కొన్ని దేశాలు జైళ్లను సంస్కరణ కేంద్రాలుగా మార్చి మంచి ఫలితాలు సాధించాయి. నార్వే, జర్మనీ వంటి దేశాల్లో ఖైదీల పునరావాసానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం వల్ల తిరిగి నేరాలకు పాల్పడే వారి సంఖ్య గణనీయంగా తగ్గింది. మన దేశంలో కూడా కొన్ని జైళ్లలో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నప్పటికీ, వాటిని దేశవ్యాప్తంగా విస్తరించాల్సిన అవసరం ఉంది.

జైలు అనేది కేవలం శిక్ష అమలు చేసే స్థలం కాకూడదు. అది ఒక వ్యక్తి తన తప్పును గ్రహించి, కొత్త జీవితాన్ని ప్రారంభించే అవకాశం కల్పించే సంస్కరణ కేంద్రంగా మారాలి. నేరాన్ని ద్వేషించాలి కానీ మనిషిని కాదు. ఒక వ్యక్తిని శాశ్వతంగా నాశనం చేయడం కంటే, అతడిని సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దడమే నిజమైన న్యాయం. "జైలు గోడలు కాదు... మనిషి ఆలోచన మారితేనే సమాజం మారుతుంది."



**ఉక్కల్కర్ రాజేందర్ నాథ్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**
**9440287170**

## 'జీవ'నది

జన జీవన ప్రయాణం..
నదీ జలాల ప్రవాహమే
నది సకల జలచరాల నెలవు
సమాజం జన సమ్మిళిత ఆదరువు !

జీవకోటి గొంతు తడిపేది జీవనది..
పర హితమైనదే అసలైన జీవన నిధి
సత్యధర్మాల పల్లాల వైపు కదలాలి..
జ(ల)న ప్రవాహం పరుగులెత్తాలి !

నదిలోని సుడిగుండాలు..
భవసాగరంలో కష్టనష్టాల లోతులు
నదీ ప్రవాహ పరుగు వేగవంతం
ఎత్తుపల్లాల మయం జీవన ప్రయాణం !

నదీ జలాలు బిందు రాసులు..
ప్రాణికోటికి అవే ఆదరువులు
జీవనదులు ఎండిపోతే..
జీవకోటి కడుపులు మాడు !

నదీ స్వచ్ఛ జలాల పరుగులే..
మానవ జీవన విలువల ప్రస్థానాలు
నది లక్ష్యం సముద్రం చేరడమే..
మనిషి గమ్యం ముక్తిని కోరడమే !

**మధుపాలీ**
**9949700037**

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్



**జమ్మికుంట, జూలై 22 (సింగిడి) :** జమ్మికుంట పట్టణానికి చెందిన పాత్రికేయులు కండెం పూజిత వంశీకృష్ణ దంపతుల కవల పిల్లలు కృషిక సాయి, కృషిక రాజ్ ల మొదటి పుట్టినరోజు వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీం-ర్వదించిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్. పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్ లో జరిగిన మొదటి జన్మదిన వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీం-ర్వదించి వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ చందా రాజు ఆర్యవైశ్య సంఘం జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు లెంకలపల్లి శరత్ కుమార్ ఆంధ్రప్రభ దినపత్రిక రిపోర్టర్ గుండా రాజేంద్రప్రసాద్ నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ నాయకులు చంచు శివ కండెం వేణు తదితరులు పాల్గొన్నారు.

**చిన్నారులను ఆశీర్వదించిన కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్**

జమ్మికుంట పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లో పాత్రికేయుడు కండెం పూజిత వంశీకృష్ణల కవల పిల్లల మొదటి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి హాజరై చిన్నారులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్. అనంతరం పిల్లలకు కేకు తినిపించి వారికి తమ ఆశీస్సులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారులు బచ్చు భాస్కర్ బచ్చు వీర లింగం నినాదం దినపత్రిక హుజురాబాద్ ఆర్సి ఇంచార్జ్ అయిత రాధాకృష్ణ పాల్గొన్నారు.

## అమృత ఆసుపత్రిలో అవగాహన సదస్సు




**జమ్మికుంట, జూలై 22 (సింగిడి):** ప్రపంచ మెదడు దినోత్సవాన్ని పురస్కరించుకుని జమ్మికుంట పట్టణంలోని అమృత న్యూరో హాస్పిటల్,జమ్మికుంటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ ఏడాది ప్రపంచ మెదడు దినోత్సవం థీమ్ గా ప్రపంచ న్యూరాలజీ సమాఖ్య ప్రకటించింది. ఈ సందర్భంగా డా. భరత్ ఆర్ ఎంబిబిఎస్, ఎండి న్యూరో ఫిజీషియన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా సుమారు 3. 4 బిలియన్ మంది ఏదో ఒక నాడీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారని తెలిపారు. (స్ట్రోక్, మూర్ఛ (ఎపిలెప్సీ), మైగ్రేన్ వంటి వ్యాధులను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స పొందితే ప్రాణాలను కాపాడటంతో పాటు శాశ్వత వైకల్యాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం, రక్తపోటు మధుమేహాన్ని నియంత్రణలో ఉంచుకోవడం, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. "మెదడు ఆరోగ్యం ప్రతి ఒక్కరి హక్కు. మెదడు ఆరోగ్య సేవలు అందరికీ అందుబాటులో ఉండేలా అవగాహన పెంపొందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత" అని డా. భరత్ ఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అమృత న్యూరో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎలుక దేవేందర్ రెడ్డి, ఎన్సిఎస్ టెక్నీషియన్ ప్రశాంత్, ల్యాబ్ టెక్నీషియన్లు అఖిల్, శ్రావణి, పిఆర్వోలు శ్రీకాంత్, రంజిత్, నర్సింగ్ సిబ్బంది, రిసెప్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రధాని.. కేంద్రమంత్రుల దిష్టిబొమ్మల దగ్ధం



**జమ్మికుంట, జూలై 22 (సింగిడి):** నీట్ పరీక్ష పత్రాలు పరీక్ష సమయానికి ముందే విడుదలై లక్షలాది మంది విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడుతున్న భారతీయ జనతా పార్టీ,కేంద్ర ప్రభుత్వం నిరసనగా ఢిల్లీ లోని జంతర్ మంతర్ రోడ్ లో ప్రజాస్వామిక బద్ధంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీస్ బలగాలను ఉపయోగించి విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేసి వారిపై బాష్ప వాయువు విడుదలచేసి వారిపై విచక్షణా రహితంగా దాడి చేసినందుకు నిరసనగా హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ వారి సహోదరి ప్రియాంక గాంధీ ల అక్రమ అరెస్టుకు నిరసిస్తూ హుజరాబాద్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేసి ప్రధాని మోడీ హోం శాఖ మంత్రి అమిత్ షా విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్ ఎస్ యు ఐ నాయకులు ఉమ్మడి సందీప్, ప్రశాంత్ యాదవ్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను అరెస్ట్ చేయడం సరి కాదు అన్నారు నీట్ పరీక్ష పత్రాల లీక్ కి బాధ్యత వహించాల్సిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ని బర్తరఫ్ చేయకుండా పార్టీ నుండి సస్పెండ్ చేయకుండా నిరసన తెలిపే వారిని అరెస్ట్ చేయడం వారిపై పోలీస్ బలగాలని ఉపయోగించి లాఠీ ఛార్జ్ చేయడం సిగ్గు చేటు అని మండిపడ్డారు. ఈ కార్యక్రమలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సజ్జు, ఎన్ ఎస్ యు ఐ జిల్లా నాయకులు పసునూటి అన్వేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మేకల రాజ్ కుమార్, చల్లూరి విష్ణువర్ధన్, బాలసాని సుమన్, సందీప్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శులు బండ నవీన్ , శనిగరపు తరుణ్ , నాయకులు గుండేటి మహేష్ బాబర్ అభిలాష్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దాశరథి కృష్ణమాచార్య జయంతి వేడుకలు



**జమ్మికుంట జూలై 22 (సింగిడి):** జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో బుధవారం మహాకవి దాశరథి కృష్ణమాచార్య 101వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహాకవి దాశరథి కృష్ణమాచార్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ , అధ్యాపకులు మహాకవి దాశరథి చేసిన ప్రజా చైతన్య రచనలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బీ. రమేష్ , వైస్ – ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ ఓదెలు కుమార్ , తెలుగు విభాగాధిపతి డాక్టర్ శ్యామల, డాక్టర్ పీ. స్వప్న, డాక్టర్ గణేష్ , డాక్టర్ రాజేంద్రం, డాక్టర్ రాజకుమార్ , ఉమాకిరణ్ , కిరణ్ కుమార్ , డాక్టర్ ఎంబాడి రవి, మమత, డాక్టర్ సుష్మ, రమేష్ , ప్రశాంత్ , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్‌గాంధీ అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ భారీ ఆందోళన

- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం



**కరీంనగర్, జూలై 22(సింగిడి):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకుల అరెస్టును ఖండిస్తూ, నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద శాంతియుత నిరసన చేపట్టారు. చొప్పదండి ఎమ్మెల్యే, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ మేడిపల్లి సత్యం మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితెల ప్రణవ్ బాబు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్యతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసిన నీట్ ప్రశ్నాపత్రం లీకేజీకి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఈ ఘటనపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చ నిర్వహించి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు న్యాయం కోరుతూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులు చేపట్టిన నిరసనను అణచివేస్తూ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో రాజీ పడే చర్యలను కాంగ్రెస్ సహించదని, వారికి న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ గొంతు నొక్కినా కాంగ్రెస్ వెనక్కి తగ్గదని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. నీట్ లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్, ఎండి తాజ్, ముత్యం శంకర్ గౌడ్, గడ్డం విలాస్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పులి ఆంజనేయులు గౌడ్, కొరివి అరుణ్ కుమార్, మడుపు మోహన్, వెన్నం రజిత రెడ్డి,కల్లపల్లి బాలరాజు, గంట శ్రీనివాస్ కళ్యాణి, చాడ గొంద బుచ్చిరెడ్డి, సునావత్ భాస్కర్ నాయక్, పర్వత మల్లేశం, ఇప్ప శ్రీనివాస్ రెడ్డి, వరాల నర్సింగం, కాంతల జగన్ రెడ్డి, పడాల అజయ్ గౌడ్,బండారు రమేష్ గౌడ్, ముస్తాక్ హైమద్, కామ్ రెడ్డి రామ్ రెడ్డి, కిమ్ ఫహాద్, మూల రవీందర్ రెడ్డి, ఇమ్రాన్, మాదాసు శ్రీనివాస్, కిరణ్ రెడ్డి, నిహాల్, సామ్రాట్, కుంభాల రాజు కుమార్, మంద మహేష్, గడప శ్రీనివాస్, మామిడి సత్యనారాయణ రెడ్డి, ముక్క భాస్కర్, మార్కరాజు, పొన్నం మధు, వేముల శ్రీనివాస్, హర్ష మల్లేశం, మూల కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, కోడూరి రవీందర్ గౌడ్, జువ్వాడి అమరేందర్ రావు, ఉప్పరి రవి, జల్లోజు శ్రీనివాస్, సత్తినేని శ్రీకాంత్, కర్రె పావని, గడ్డం శ్రీరామ్, జువ్వాడి అమరేంద్రరావు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి కార్యాలయంపై దాడి యత్నం

**కాంగ్రెస్ నాయకులపై పోలీసు కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు**



**కరీంనగర్, జూలై22(సింగిడి):** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ స్థానిక కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించారని ఆరోపిస్తూ, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కరీంనగర్ పోలీసు కమిషనర్‌కు రాతపూర్వక ఫిర్యాదు చేశారు. కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, ఎన్నం ప్రకాశ్, సహనియమిత సభ్యులు, ఇతర బీజేపీ నాయకులు ఈ ఫిర్యాదును సమర్పించారు. ఫిర్యాదు ప్రకారం, మధ్యాహ్నం సుమారు 12:15 గంటలకు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో 50 మందికి పైగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించి, కార్యాలయ సిబ్బందిని బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషించారని పేర్కొన్నారు. సిబ్బందిపై దాడికి యత్నించడంతో పాటు, అక్కడికి చేరుకున్న పోలీసుల విధులకు కూడా ఆటంకం కలిగించారని ఆరోపించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన ఈ ఘటనపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో పాటు సంబంధిత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు పోలీసు కమిషనర్ కార్యాలయం ఫిర్యాదును స్వీకరించింది. ఈ కార్యక్రమం లో ఎన్నం ప్రకాష్ ప్రవీణ్ రావు, పుప్పాల రఘు, బల్ భీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించడమే మెడికవర్ లక్ష్యం

**ట్రామా, క్రిటికల్ కేర్ కేసులపై ప్రత్యేకశ్రద్ధ**
**అత్యవసర కేసులకు అందుబాటులో వైద్యులు**
**మీడియా సమావేశంలో మెడికవర్ డాక్టర్ల బృందం**



**జమ్మికుంట, జూలై 22 (సింగిడి):** మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు ప్రమాదంలో ఉన్నవారికి అత్యవసర సేవలు అందించడమే మెడికవర్ ఆసుపత్రుల యొక్కలక్ష్యమని న్యూరో సర్జన్ రాజీవ్ రెడ్డి, గ్యాస్ట్రో సర్జికల్ వైద్యులు దిలీప్ రెడ్డి, ఆర్థోపెడిక్ వైద్యులు వేణుగోపాల్ తెలిపారు. బుధవారం జమ్మికుంట పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడికోవర్ వైద్యులు మాట్లాడుతూ ప్రమాదాల బారిన పడిన వారికి అత్యవసర చికిత్సలు అందించడం తోపాటు హైదరాబాద్ స్థాయి వైద్యాన్ని కరీంనగర్ మేడికోవర్ లోనే అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ప్రమాదం జరిగిన సమయంలో గాయపడ్డ బాధితున్ని గాబరా పెట్టకుండా సురక్షితమైన ప్రదేశానికి తీసుకుని వచ్చి గాలి తగిలేలా చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణ ప్రథమ చికిత్స అందించి ఆసుపత్రులకు తీసుకొని రావాలని పేర్కొన్నారు. కరీంనగర్ లోని మేడికోవర్ ఆసుపత్రిలో అన్ని విభాగాలకు సంబంధించిన వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని, ప్రభుత్వానికి సంబంధించిన ఈ హెచ్ ఎస్ కార్డులు, జర్నలిస్ట్ కార్డులు, ఆరోగ్య శ్రీ లపై కూడా వైద్యం అందించడం జరుగుతుందన్నారు.

# సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠినచర్యలు

**మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి**



**జమ్మికుంట, జూలై 22 (సింగిడి):** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, బజ్జీ బండ్లు, తోపుడు బండ్ల నిర్వాహకులతో పాత మున్సిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ శ్రీ జి. మల్లికార్జున స్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సింగిల్-యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లాస్టిక్ కవర్లలో టిఫిన్లు ఇవ్వకూడదని, ఆకులు లేదా పర్యావరణహిత పాత్రల్లో మాత్రమే ఆహారాన్ని అందించాలని సూచించారు. టీ స్టాళ్లలో టీని గాజు లేదా స్టీల్ గ్లాసుల్లో మాత్రమే అందించాలని తెలిపారు. ప్లాస్టిక్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసులు లేదా ఇతర నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే రూ. 1,000 నుంచి రూ. 2,000 వరకు జరిమానా విధించడంతో పాటు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బజ్జీ బండ్ల నిర్వాహకులు మెయిన్ రోడ్డుపై ఉన్న వైట్ లైన్ దాటకుండా, తమకు కేటాయించిన ప్రదేశాల్లోనే వ్యాపారం నిర్వహించాలని సూచించారు. దుకాణాల ఎదురుగా బండ్లు నిర్వహించుకున్నప్పుడు సంబంధిత యజమానులకు ఎలాంటి కిరాయి చెల్లించవద్దని తెలిపారు. హోటల్ యజమానులు, బజ్జీ బండ్లు తోపుడు బండ్ల నిర్వాహకులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ, వినియోగదారులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఐ. రమేష్, జవాన్లు, హోటల్ యజమానులు, బజ్జీ బండ్ల నిర్వాహకులు, తోపుడు బండ్ల వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రతకు సమన్వయంతో పనిచేయాలి

**ప్రమాదాల నివారణకు 60 రోజుల్లో శాశ్వత చర్యలు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం**
**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, జూలై22(సింగిడి):** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, రవాణా, పోలీస్, రహదారులు, భవనాల శాఖ, ఆర్టీసీ, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు పాల్గొన్నారు. వర్షాకాలంలో రహదారులపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, గుంతలను వెంటనే పూడ్చి దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వేగనిరోధకాలు, ప్రతిఫలకాలు, హెచ్చరిక బోర్డులు, రహదారి గుర్తులు ఏర్పాటు చేయాలని సూచించారు. మలుపులు, వంతెనల వద్ద స్పష్టమైన హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేయాలని తెలిపారు. నగరంలోని ప్రధాన రహదారులపై వీధి దీపాల నిర్వహణను మెరుగుపరచాలని, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు జాతీయ రహదారులపై ఆక్రమణల తొలగింపు, నిఘా, గస్తీ, వేగ నిర్ధారణ పరికరాలు, నిఘా కెమెరాలు, సూచిక బోర్డులు, అత్యవసర కాల్ బాక్సులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రమాదకర ప్రాంతాల్లో ఎత్తైన విద్యుత్ దీపాలు, నిఘా కెమెరాలు ఏర్పాటు చేసి, ఈ పనులను 60 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీస్ శాఖ, భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించి ప్రమాదాల నివారణ చర్యలను పరిశీలించాలని సూచించారు. జాతీయ రహదారుల టోల్‌ఫ్రీ సహాయ సంఖ్య 1033పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గత నెలతో పోలిస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వాహనదారులకు సూచించారు. సమావేశంలో ఎన్టీఆర్ విగ్రహం, పద్మానగర్ జంక్షన్‌తో పాటు నీరు నిలిచే, ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై సమీక్ష నిర్వహించారు. అలాగే కరీంనగర్--వరంగల్ జాతీయ రహదారి పనులు సుమారు 95 శాతం పూర్తయ్యాయని భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు వివరించారు.

# చారిత్రక కోటగుళ్ల క్షేత్రం పునరుద్ధరణ చేపట్టాలి

- ప్రభుత్వానికి జయశంకర్ సారస్వత సమితి విజ్ఞప్తి



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** కాకతీయుల కాలం నాటి గొప్ప చారిత్రక, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచిన కోటగుళ్ల క్షేత్రాన్ని పునరుద్ధరించి, భావితరాలకు చారిత్రక సంపదగా అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జయశంకర్ సారస్వత సమితి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సమితికి చెందిన సాహితీవేత్తల బృందం కోటగుళ్ల క్షేత్రాన్ని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించింది. అనంతరం వారు మాట్లాడుతూ, తెలంగాణలోని ఎన్నో చారిత్రక కట్టడాలు, దేవాలయాలు కాలగర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయుల శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలిచిన కోటగుళ్ల క్షేత్రాన్ని జీర్ణోద్ధరణ చేసి, పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి ఆలయ పునరుద్ధరణతో పాటు మౌలిక వసతులు కల్పిస్తే దేశ, విదేశాల నుంచి పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో సందర్శించే అవకాశం ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జయశంకర్ సారస్వత సమితి వ్యవస్థాపకులు గడ్డం లక్ష్మయ్య, వీరశర్మ, నల్లగొండ సురేష్, పూర్ణశర్మ, శ్రీధర్, యాదగిరి, పొన్నాల సంజీవ్, స్థానిక ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థుల జీవితాలతో ఆటలాడుతున్న కేంద్ర ప్రభుత్వం

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు**



**పెద్దపల్లి, జూలై 22(సింగిడి):** వరుస ప్రశ్నపత్రాల లీకేజీలతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలతో ఆటలాడుతోందని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు ఆరోపించారు. నీట్ పరీక్షల పేపర్ లీకేజీ, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టులను నిరసిస్తూ బుధవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కమాన్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ చైర్మన్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సింగిల్ విండో చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్ ధర్నా



**గోదావరిఖని, జూలై 22(సింగిడి):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అరెస్టును ఖండిస్తూ గోదావరిఖని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎన్. ఎస్. యు. ఐ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బుధవారం ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామగుండం ఎమ్మెల్యే ఎం. ఎస్. రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యాన్ని అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికీ సహించదని అన్నారు. రాజ్యాంగం కల్పించిన శాంతియుత నిరసన హక్కును కాలరాయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. ప్రజల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

## జాతీయ పతాకానికి ఘన వందనం

**దేశభక్తి ర్యాలీ నిర్వహించిన లయన్స్ క్లబ్**



**గోదావరిఖని , జూలై 22(సింగిడి):** భారత జాతీయ పతాక ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం రీజియన్ ఆధ్వర్యంలో బుధవారం దేశభక్తి, జాతీయ ఐక్యతను చాటిచెప్పే అవగాహన ర్యాలీ ఘనంగా నిర్వహించారు. రీజినల్ చైర్‌పర్సన్ సోమారపు లావణ్య నాయకత్వంలో జరిగిన ఈ ర్యాలీలో లయన్స్ క్లబ్‌ల సభ్యులు, విద్యార్థులు, మహిళలు, యువత జాతీయ జెండాలతో పాల్గొని "భారత్ మాతాకీ జై", "వందే మాతరం", "జై హింద్" నినాదాలతో దేశభక్తిని చాటారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్స్ ఫోరం అధ్యక్షులు బంక రామస్వామి, మాజీ రీజిన్ చైర్‌పర్సన్ రాజేందర్, మెంటర్ గంగాధర్, నార్ల ప్రసాద్, అంజనేయులు, జోన్ చైర్‌పర్సన్స్ సుధాకర్, లక్ష్మీవాణి, గాలి సునీత, ఈలేశ్వరం చంద్రమౌళి, వివిధ లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు, సభ్యులతో పాటు ఆపిల్ కిడ్స్ స్కూల్, శ్రీరామ విద్యానికేతన్, స్పెక్ట్రమ్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 23-7-2026

# వయోవృద్ధుల సంక్షేమ చట్టాల అమలుకు కట్టుదిట్టమైన చర్యలు

**మెయింటెనెన్స్ చెల్లింపులపై పక్షం రోజులకు ఒకసారి సమీక్ష**

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, జులై22(సింగిడి):** కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వయోవృద్ధుల సంక్షేమ చట్టాలు, తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ చట్టం అమలును పకడ్బందీగా పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. వయోవృద్ధులు తమ పిల్లల నుంచి పోషణ భృతి కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించాలని సూచించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల మేరకు తల్లిదండ్రులకు ప్రతినెలా పోషణ భృతి అందుతున్నదా లేదా అనే అంశాన్ని నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. వయోవృద్ధుల సంక్షేమానికి సంబంధించిన అంశాల పర్యవేక్షణ కోసం మండల స్థాయిలో శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి, తహసీల్దార్, మండల అభివృద్ధి అధికారి, పోలీసు అధికారులు సభ్యులుగా కమిటీలను ఏర్పాటు చేయాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ కమిటీలు ప్రతి 15 రోజులకు ఒకసారి కేసుల పురోగతిని పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. పోషణ భృతి చెల్లించని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖకు ఆదేశించిన కలెక్టర్, కౌన్సెలింగ్, పోషణ ఉత్తర్వుల అమలు తర్వాత కూడా సమస్యలు పరిష్కారం కాకపోతే జిల్లా న్యాయ సేవల అధికార సంస్థకు సిఫారసు చేయాలని పేర్కొన్నారు. అలాగే, పోలీసు శాఖ ప్రతి 15 రోజులకు ఒకసారి తీసుకున్న చర్యల నివేదికను సమర్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులు తమ తల్లిదండ్రులకు పోషణ భృతి చెల్లించే విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, శిక్షణ కలెక్టర్ హరిప్రసాద్, రెవెన్యూ డివిజనల్ అధికారులు షర్మిల, జలకుమారి, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా న్యాయ సేవల అధికార సంస్థ ప్రతినిధి మహేష్, శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ కార్మికుల హామీలు అమలు చేయాలి

- ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకుడు జంపన్న ఫైర్




**ములుగు (ప్రతినిధి, జులై 22 (సింగిడి):** విద్యుత్ ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లకు ఏప్రిల్ 8 సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్య జంపన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, సమ్మె విరమింపజేసే సమయంలో ప్రభుత్వం పలు హామీలు ఇచ్చి ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఇది ఉద్యోగులను మోసం చేసినట్లేనని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్పీడీసీఎల్ హైదరాబాద్ కార్యాలయాల వద్ద నిరసనలు చేపడుతున్న ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్లను పోలీసులు అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధ చర్య అని ఆయన అన్నారు. సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు చెల్లించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన గానీ, సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ గానీ ఇవ్వలేదని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఏర్పాటు చేస్తున్న టాడా వ్యవస్థల వల్ల క్షేత్రస్థాయిలో ఎలాంటి ఉపయోగం లేదని, ఈ పనుల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని ఆరోపణలు వస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లాల్లో జేపీఎం పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యుత్ సిబ్బందిపై పనిభారం పెరిగి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను విడుదల చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఆర్టిజన్లు, అన్‌మ్యాన్ వర్కర్ల ఆగ్రహాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కోవాల్సి వస్తుందని భూక్య జంపన్న హెచ్చరించారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్‌పై భగ్గుమన్న కాంగ్రెస్ నేతలు

**ప్రధాని నరేంద్ర మోడీ, ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలు దగ్ధం**



**జమ్మికుంట, జులై 22 (సింగిడి):** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జరిగిన దాడిని నిరసిస్తూ టీపీసీసీ ప్రచార కమిటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సాయిని రవి ఆధ్వర్యంలో దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను జమ్మికుంట పట్టణంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుల గొంతును అణిచివేయడం, ప్రశ్నించే స్వరాలపై దాడులు చేయడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకరి రమేష్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పొనగంటి మల్లయ్య, జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు ఒగ్గు రమేష్, శ్రీపతి నర్సింగ్ నరేష్, పోతకాల మౌనిక అనిల్, చంద రాజు, ఎగిలా సుజాత అశోక్, మాచర్ల రాజు, యుట్ల సునీత అశోక్, కుతాడి లిరుపతి, ముద్దాముల్లరవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజేశ్వర్ రావు, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి దొడ్డే శ్రీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడెపు సారంగపాణి, రింగ రావు, పూదరి శివ కుమార్ గౌడ్, సదిల, మండ అశోక్ ఆడెపు కిరణ్ దొగ్గల భాస్కర్ శ్రీనివాస్ పాత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నగరం నడిబొడ్డున భారీ దోపిడీ

**భగత్‌నగర్‌లో వృద్ధుడి ఇంట్లో రూ.21 లక్షల నగదు, 66 తులాల బంగారం అపహరణ**

**ప్రత్యేక బృందాలతో దర్యాప్తు ముమ్మరం**

**పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్, జులై22(సింగిడి):** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి జరిగిన భారీ దోపిడీ కలకలం రేపింది. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న అజ్మత్ అలీ ఇంట్లోకి సుమారు ఎనిమిది మంది ఆగంతకులు మాస్కులు ధరించి చొరబడి, కుటుంబ సభ్యులను మారణాయుధాలతో బెదిరించి రూ. 21 లక్షల నగదు, 66 తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. రాత్రి సుమారు 12.30 గంటల సమయంలో ఇంటి సందులోని విద్యుత్ దీపాన్ని ఆర్పివేసి లోపలికి ప్రవేశించిన దుండగులు అజ్మత్ అలీ నోటిని మూసివేసి, ఇంట్లో ఉన్న ముగ్గురు మహిళల గొంతుల కుక్కి తుపాకులతో బెదిరించారు. ఈ ఘటనలో అజ్మత్ అలీపై దాడి కూడా చేసినట్లు బాధితులు తెలిపారు. సంఘటనా స్థలంలో వదిలివెళ్లిన తుపాకిని పరిశీలించగా అది బొమ్మ తుపాకి (టాయ్ పిస్టల్)గా పోలీసులు గుర్తించినట్లు సమాచారం. దోపిడీ అనంతరం అదే ఇంట్లో అద్దెకు ఉంటున్న వారి రెండు ద్విచక్ర వాహనాలను అపహరించి బైపాస్ రహదారి వైపు పారిపోయినట్లు సీసీ కెమెరా దృశ్యాల ఆధారంగా పోలీసులు గుర్తించారు. ఈ ఘటనను బుధవారం రోజున పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, వన్ టౌన్ తో కలిసి పరిశీలించిన పోలీసులు, ఇంటి వారి తో మాట్లాడి పలు వివరాలు సేకరించారు. ఆ నిందితులు ఇంటి నిర్మాణం, కుటుంబ సభ్యుల దినచర్యపై ముందస్తు సమాచారం ఉన్నట్లు అనుమానిస్తున్నారు. అజ్మత్ అలీ ప్రతిరోజూ ఇంటి సందులోని దీపాన్ని ఆర్పి లోపలికి వెళ్లే అలవాటు ఉండటాన్ని ఆసరాగా చేసుకుని ఈ దోపిడీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. దుండగులు హిందీలో మాట్లాడినట్లు బాధితులు వెల్లడించడంతో ఆ కోణంలోనూ విచారణ కొనసాగుతోంది. అజ్మత్ అలీ కుటుంబ సభ్యులు, బంధువులు, ఇటీవల కుటుంబానికి దూరమైన అల్లుడు, అలాగే ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ ప్రాంతానికి చెందిన కొందరితో ఉన్న సంబంధాలపై కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన వెనుక స్థానికంగా సమాచారం అందించిన వ్యక్తుల ప్రమేయం ఉందా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

# బోనమెత్తిన జమ్మికుంట



- భక్తి శ్రద్ధలతో ఘనంగా బీరన్న ఉత్సవాలు
- భారీగా తరలివచ్చిన కురుమ కులస్తులు

**జమ్మికుంట, జులై 22 (సింగిడి):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో బుధవారం కురుమ కులస్తుల ఘనంగా బీరన్న ఉత్సవాలు నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని కురుమ కులస్తులు ఉదయం నుండి బీరన్న ఉత్సవాలకు సకల ఏర్పాట్లు చేసుకొని భక్తిశ్రద్ధలతో బోనాలు వండుకొని మహిళలు ఆ బోనాలను నెత్తిన పెట్టుకొని డప్పు చప్పుళ్ల మధ్య స్వామివారికి బోనాలను సమర్పించారు. మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ గ్రామ సమీపంలో గల బీరన్న ఆలయ నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన స్థలంలో స్వామివారి విగ్రహాలను తీసుకొచ్చి శుభకరమైన బోనాలను సమర్పించారు. అనంతరం స్వామివారికి గొర్రె పొట్టేళ్లను బలిచ్చి నైవేద్యం అందించారు. ఈ సందర్భంగా పెరిక కుల నాయకులు జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్ ఒగ్గు రమేష్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం శ్రావణమాసం ముందు వచ్చే ఏకాదశి పండగ రోజు బీరన్న ఉత్సవాలను కురుమ గొల్ల కులస్తులు అందరూ కలిసి అత్యంత ఘనంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కురుమ కులస్తుల ఆరాధ్య దైవమైన బీరన్న ఉత్సవాలకు భారీగా ఏర్పాటు చేయడం జరిగిందని రాబోయే రోజుల్లో ఆ స్వామి వారి ఆశీస్సులతో దాతల సహకారం తోపాటు ప్రభుత్వ నిధులతో బీరన్న ఆలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వందలాదిమంది మహిళలు బోనాలు ఎత్తుకొని స్వామివారికి సమర్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్ల శ్రీనివాస్ దయ్యాల సుధాకర్ నీల కుమార్ గౌడ కుమారస్వామి నరేశ్ సమ్మయ్య తో పాటు ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగిళి రమేష్ జమ్మికుంట మున్సిపల్ వైస్ చైర్మన్ జావీద్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకరి రమేష్ పీఏసీఎస్ చైర్మన్ సంపత్ కొలకాని రాజు మాజీ కౌన్సిలర్లు పాతకాల రమేష్ గాజుల భాస్కర్ గడ్డి సాంబయ్య ఏ గిల అశోక్ నగేశ్ సదయ్య అఫ్జల్ శ్రీనివాస్ కంచె అనిల్ ఎల్లవేణి బాలరాజు రాజేందర్ పరుశురాం శంకర్ కొరియా రవి ఎగ్గుల మహేష్ పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం యువత భవిష్యత్‌ను అంధకారం చేస్తోంది

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**రాహుల్‌గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటు**

**నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే దిగిపోవాలని డిమాండ్**



**హనుమకొండ, జులై 22 (సింగిడి):** ఏఐసీసీ, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపులో భాగంగా మేరకు బుధవారం హనుమకొండ డీసీసీ భవన్ వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ నిరసన, ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మ దహన కార్యక్రమం జరిగింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తూ, దేశవ్యాప్తంగా కొట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసిన 'నీట్ పేపర్ లీకేజీ'కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ భారీ నిరసన చేపట్టారు. డీసీసీ భవన్ వద్ద దిష్టిబొమ్మ దహనం అనంతరం, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా తరలివచ్చి అంబేద్కర్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖ పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితో పాటు ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె. ఆర్. నాగరాజు, టీపీసీసీ సభ్యులు కూచన రవలి, ఇవి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమాముల మార్కెట్ చైర్మన్ పులి ప్రియాంక, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలివెంకట్రామ్మర్సింహ రెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌ఛార్జ్ నాసిర్ అహ్మద్, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్, మండలాధ్యక్షులు, హనుమకొండ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, అధ్యక్షురాండ్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపైతీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో సామాన్యులు, విద్యార్థుల తరఫున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టులు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అణిచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరఫున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా కొట్లాది మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న 'నీట్' పరీక్ష పేపర్ లీకేజ్ కావడం ఈ కేంద్ర ప్రభుత్వచేతగానితనానికి నిదర్శనమని, ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ పేపర్లు అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆయన విమర్శించారు. విద్యావ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిలో కొనసాగే అర్హత కోల్పోయారని, నీట్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ ఆయన తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. నిలకడలేని, అవినీతిమయమైన నేషనల్... టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టీ ఏ) ని కేంద్రం తక్షణమే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా విధానాన్ని తీసుకురావాలని, నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని భట్టి విక్రమార్క హెచ్చరించారు.

### డిప్యూటీ సీఎం, మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు..



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలకు ఎమ్మెల్యే బస్వరాజ్ సారయ్య, వరంగల్ పశ్చిమ, పరకాల, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కెఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎస్. శ్వేత, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, తదితరులు పుష్ప గుచ్ఛాలు, పూలమొక్కలను అందించి ఘన స్వాగతం పలికారు. అక్కడ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. కొద్దిసేపు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి కొండా సురేఖలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, జిల్లా అదనపు కలెక్టర్ రవి, డీఆర్వో శ్రీనివాస్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఢిల్లీలో నిరాహార దీక్ష చేపట్టిన సోనం వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడాన్ని, 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నీట్ పరీక్షలు నిర్వహించిన నాటి నుంచి వరుసగా పేపర్ లీకేజీ కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిణామాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి రాజీనామా కోరుతూ దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద నిరాహార దీక్ష చేస్తున్న సోనం వాంగ్‌చుక్ దీక్షను భగ్నం చేయడం, 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులపై లాఠీచార్జి చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ భాగస్వామ్య సంఘాల నాయకులు ఎ. తిరుపతి, ఎస్. తిరుపతి, బి. సేనాపాయక్, కుమారస్వామి, ప్రవీణ్, సుదర్శన, రామయ్య, ప్రభాకర్, భద్రయ్య, మోహన్, మోహన్, నరేష్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఇది కేవలం ఆరంభం మాత్రమే, ఇకపై ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని తెలిపారు. ప్రధాన అంశాలను ముందుకు తెచ్చేలా రూపొందించారు.

## ఎస్ఐఆర్ పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు చొరవ తీసుకోవాలి

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి**



**వనపర్తి ప్రతినిధి, జులై 22 (సింగిడి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవల్ ఏజెంట్లు ఎన్నికల అధికారులతో సమన్వయంతో పని చేసేలా చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్ఐఆర్ పురోగతిపై జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు ఎస్ఐఆర్ ప్రక్రియ డిజిటైజేషన్ 77.49% పూర్తయిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో వరుసగా కొనసాగుతున్నప్పటికీ, వనపర్తి, పెబ్బేరు వంటి పట్టణ ప్రాంతాల్లో కొంత నెమ్మదిగా కొనసాగుతోందని చెప్పారు. కాబట్టి పట్టణ ప్రాంతాల్లో ఆయా రాజకీయ పార్టీల బీఎల్ఏలు స్థానికంగా పని చేస్తున్న బూత్ లెవల్ అధికారులతో నిరంతరం సమన్వయం కొనసాగించాలని కోరారు. బీఎల్ఓలకు సహకరిస్తూ ఓటర్లందరూ ఎన్యూమరేషన్ ఫారంలను సమర్పించే విధంగా బీఎల్ఏలు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే సరైన సమయమని, ఇందుకు సంబంధించి రాజకీయ పార్టీలు ఏవైనా సూచనలు చేయదలచుకుంటే అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు, ఎన్నికల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు పాఠశాల నుంచే పునాది

- స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో ప్లాస్టిక్‌కు దూరంగా జీవశాస్త్ర ఉపాధ్యాయుల వినూత్న సందేశం
- ఏఎంఓ పింగళి విజయపాల్ రెడ్డి




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** పర్యావరణ పరిరక్షణపై సమాజంలో చైతన్యం తీసుకురావడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) పింగళి విజయపాల్ రెడ్డి అన్నారు. ఘనపూర్ మండల కేంద్రంలోని తెలంగాణ స్టేట్ మోడల్ స్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేసి విద్యార్థుల్లో ఆరోగ్యం, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించాలని సూచించారు. సైన్స్ ల్యాబ్‌ల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. విద్యార్థుల అభ్యసనాభివృద్ధి కోసం ప్రభుత్వం అందు బాటులోకి తీసుకురానున్న వర్క్‌బుక్కులను సక్రమంగా వినియోగించాలని, ఏఐ కోచింగ్ వంటి ఆధునిక సాంకేతిక సాధనాలు, దీక్ష కోర్సులను ఉపయోగించుకుని బోధనకు అవసరమైన విద్యా సామగ్రిని రూపొందించుకోవాలని తెలిపారు. 'ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు' అనే సందేశాన్ని చాటుతూ తెలంగాణ బయాలజికల్ సైన్స్ ఫోరం ఆధ్వర్యంలో శిక్షణలో వినూత్న కార్యక్రమం చేపట్టడాన్ని ఏఎంఓ అభినందించారు. మధ్యాహ్న భోజనానికి స్టీల్ ప్లేట్లు, టీకి పేపర్ గ్లాసులకు బదులుగా స్టీల్ గ్లాసులు వినియోగించారు. ఇళ్లలో పేరుకుపోయిన ప్లాస్టిక్ కవర్లను ప్లాస్టిక్ బాటిళ్లలో నింపి సీల్ చేసి ఎకోబ్రిక్స్‌గా మార్చే విధానంపై కూడా అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టడం ద్వారా భూతాపాన్ని, పర్యావరణ సమస్యలను తగ్గించవచ్చని వివరించారు. ఆగస్టులో పదవీ విరమణ చేయనున్న సీనియర్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు హట్కర్ సమ్మయ్యను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్‌గా తిరుపతి వ్యవహరించగా, జిల్లా రిసోర్స్ పర్సన్లుగా బి. ప్రభాకర్ రెడ్డి, కె. శ్రీనివాస్, వి. సునీల్, ఎస్. శ్రీధర్ సేవలందించారు. రెండో విడత శిక్షణలో కాటారం సబ్‌డివిజన్‌కు చెందిన 40 మంది జీవశాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఘనంగా దాశరథి జయంతి వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (సింగిడి):** తెలంగాణ ఆత్మగౌరవాన్ని "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అనే అమర వాక్యంతో ప్రపంచానికి చాటిచెప్పిన మహాకవి, అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతిని ఘనపూర్ మోడల్ స్కూల్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు జరుగుతున్న తెలుగు, బయాలజీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ వేడుకలో దాశరథి చిత్రపటానికి ప్రిన్సిపాల్ ఈ. తిరుపతి, తెలుగు, బయాలజీ ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఈ. తిరుపతి మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం జూలై 22న దాశరథి జయంతిని ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఆయన సాహిత్య స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. జయశంకర్ సాహిత్య సమితి అధ్యక్షుడు గడ్డం లక్ష్మయ్య మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా అక్షరాయుధంతో పోరాడిన గొప్ప సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్య అని కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన చూపిన మార్గంలో నేటి తరం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీష్ రెడ్డి మాట్లాడుతూ, దాశరథి రచించిన 'అగ్నిధార', 'రుద్రవీణ', 'తిమిరంతో సమరం' వంటి కావ్యాలు తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచాయని పేర్కొన్నారు. 'తిమిరంతో సమరం' గ్రంథానికి 1974లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని గుర్తుచేస్తూ, మహబూబాబాద్ జిల్లాకు దాశరథి పేరు పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఆయన దాశరథి కవితలను చదివి వినిపించారు. బయాలజీ డీఆర్పీ బొక్క ప్రభాకర్ రెడ్డి మాతృభాష గొప్పదనాన్ని చాటిచెప్పే కవితను వినిపిస్తూ, దాశరథి పీడిత ప్రజల గొంతుకగా నిలిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత పాకాల శ్రీనివాస్ రెడ్డి, సంగోజు సతీష్, తెలుగు జిల్లా రిసోర్స్ పర్సన్లు జైని నరసింహస్వామి, కట్ల సుధాకర్, చంద్రమౌళి, రాజు నాయక్, సంగోజు సురేష్, రాజయ్య, రాజబాబు, భాస్కర్, వీరన్న, పూర్ణచంద్ర, కుసుమ కుమార్, సంజీవ్, వరంగంటి, జ్యోతి, కవిత, కుర్ర శ్రీనివాస్, శ్రీధర్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ శంకుస్థాపన





**పటాన్చెరు, జులై 22 (సింగిడి):** నియోజకవర్గంలోని బీరంగూడ, అమీన్‌పూర్ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 16.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు తెలంగాణ రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాలు, గనులు & భూగర్భ శాస్త్ర శాఖల మంత్రి శ్రీ గడ్డం వివేక్ వెంకటస్వామి శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో బీరంగూడ (వార్డు--270), అమీన్‌పూర్ (వార్డు--271) ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ), వర్షపు నీటి కాలువలు, స్మశానవాటిక అభివృద్ధి, సెంట్రల్ మీడియన్ నిర్మాణం తదితర మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలోని అమీన్‌పూర్ సర్కిల్--47లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీజేఐ బిఐ సి. ఎస్ చైర్మన్ టీపీసీసీ ప్రెసిడెంట్ నిర్మల జగ్గారెడ్డి, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ మంత్రి గారితో కలిసి పాల్గొన్నారు.

# బొప్పాయి గింజలను పడేస్తున్నారా..?



బొప్పాయి పండ్ల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అందరికీ తెలిసిందే.. ఎన్నో పోషకాలున్న బొప్పాయి.. జీర్ణవ్యవస్థకు, దంత సమస్యలకు, రక్త సరఫరాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే, చాలామంది పడేసే బొప్పాయి విత్తనాలలోనూ అద్భుతమైన ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. వీటిని నిర్భయంగా తినవచ్చని, ముఖ్యంగా పరగడుపున తీసుకోవడం వల్ల ఎన్నో లాభాలు కలుగుతాయని నిపుణులు సూచిస్తున్నారు. ఆయుర్వేద నిపుణుల ప్రకారం.. బొప్పాయి గింజలు పోషకాల నిధి. వీటిలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, పాలీఫెనాల్స్ ఉంటాయి. ఇవి శరీరంలో వాపులను తగ్గించడంతోపాటు.. పేగుల్లోని క్రిములను నాశనం చేయడంలో సహాయపడతాయని పేర్కొంటున్నారు.



**బొప్పాయి విత్తనాల అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు:**
వ్యాధి నిరోధక శక్తి: బొప్పాయి విత్తనాలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర రోగ నిరోధక శక్తిని పెంపొందించి, జ్వరం, జలుబు, దగ్గు వంటి ఇన్‌ఫెక్షన్లు దరిచేరకుండా కాపాడతాయి.

**జీర్ణక్రియ మెరుగుదల:**
బొప్పాయి విత్తనాలు జీర్ణవ్యవస్థకు అత్యంత ప్రయోజనకరం. ఇవి జీర్ణాశయంలో ఉండే క్రిములను నాశనం చేసి, ఇన్‌ఫెక్షన్లు రాకుండా అడ్డుకుంటాయి. కడుపులో ఉండే పలు రకాల పురుగులను నశింపజేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి.

**విష పదార్థాల నిర్మూలన**
: ప్రతిరోజూ ఉదయాన్నే పరగడుపున బొప్పాయి విత్తనాలను తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకుపోయిన విష పదార్థాలు బయటకు వెళ్లిపోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రపడి, అవయవాల్లోని వ్యర్థాలు తొలగింపబడతాయి.

**బరువు నియంత్రణ:**
బొప్పాయి విత్తనాలలో ఉండే ఔషధ గుణాలు శరీర బరువును తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి శరీర మెటబాలిజం రేటును పెంచి, త్వరగా బరువు తగ్గేందుకు దోహదపడతాయి.

**క్యాన్సర్ నివారణ**
: ఓ యూనివర్సిటీ పరిశోధనల ప్రకారం.. బొప్పాయి విత్తనాలు క్యాన్సర్ కణాలు, ట్యూమర్ల వృద్ధిని అడ్డుకుంటాయి. పలు క్యాన్సర్లను నివారించే శక్తి వీటికి



ఉంది. కడుపు, పేగుల్లో వృద్ధి చెందే హానికర బ్యాక్టీరియాలను ఇవి నిర్మూలిస్తాయి. మధుమేహం, గుండె జబ్బుల నియంత్రణ: బొప్పాయి విత్తనాలు మధుమేహం, గుండె జబ్బుల వంటి ప్రమాదకర వ్యాధులను నివారించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలోని ఔషధ గుణాలు ఈ వ్యాధుల తీవ్రతను తగ్గిస్తాయి.

**కాలేయం, కిడ్నీ ఆరోగ్యం:**
రోజు ఓ స్పూన్ బొప్పాయి విత్తనాలను తీసుకోవడం వల్ల కాలేయం, కిడ్నీ సంబంధిత వ్యాధులు దరిచేరవని హామీ ఇస్తున్నారు. నెల రోజుల పాటు 5 లేదా 6 విత్తనాలను పండ్ల రసం లేదా నిమ్మరసంతో కలిపి తీసుకోవడం వల్ల కాలేయం శుభ్రపడుతుంది.

**కండరాల దృఢత్వం:**
బొప్పాయి విత్తనాలు కండరాలను దృఢంగా మార్చడంలో సహాయపడతాయి. మనం తినే ప్రోటీన్లు సక్రమంగా వినియోగపడి, కండరాల సమస్యలు తొలగిపోయి, కండరాలు చక్కగా నిర్మాణం అవుతాయి.

**నొప్పి నివారణ, వాపుల తగ్గింపు:**
బొప్పాయి విత్తనాలలో యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి నొప్పులు, వాపులను తగ్గిస్తాయి. ముఖ్యంగా కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి ఇవి ఎంతగానో మేలు చేస్తాయి.

**యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు:** బొప్పాయి విత్తనాలకు యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ ధర్మాలు ఉన్నాయి. ఇవి ఇ. ఎశీశ్రీఱ వంటి బ్యాక్టీరియాలను నిర్మూలించడంలో సమర్థవంతంగా పనిచేస్తాయి. డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకుంటాయి.

**పురుషుల సంతానోత్పత్తి:**
బొప్పాయి విత్తనాలు పురుషులలో వీర్య నాణ్యతను పెంచి, శృంగార సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తాయి.

**ఎలా తీసుకోవాలి?**
ఎవరైనా రోజుకు రెండు టేబుల్ స్పూన్ల మోతాదులో బొప్పాయి విత్తనాలను తీసు కోవచ్చు. నేరుగా తినలేని వారు వాటిని పొడి చేసుకొని మజ్జిగ లేదా సలాడ్లలో కలుపుకొని తినవచ్చు. 5 లేదా 6 బొప్పాయి విత్తనాలను నలిపి ఏదైనా పండ్ల రసం లేదా నిమ్మరసంతో కలిపి తీసుకోవడం కూడా ప్రయోజనకరమే..

## కేబుల్, డీటీహెచ్ ఛార్జీలు
# 6 రెట్లు పెరగనున్నాయా?

ఈ రోజుల్లో టీవీల నిలిపివేత సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. మోదీ ప్రభుత్వం నిర్ణయంతో త్వరలో 11 కోట్ల టీవీలు మూగబోనున్నాయని, దీనివల్ల టీవీ ప్రసారాలు గణనీయంగా ఖరీదైనవిగా మారతాయని ఒక వైరల్ పోస్ట్ పేర్కొంటోంది.




**దీని వెనుక అసలు నిజాలు ఏంటో తెలుసుకుందాం..**

వైరల్ అవుతున్న ఆ పోస్ట్‌లో ఇలా ఉంది. "మోదీ ప్రభుత్వం తీసుకునే మరో నిర్ణయంతో 11 కోట్ల టీవీలు మూతపడతాయి. ఇప్పటికే మొబైల్ ఫోన్ల కారణంగా కోట్ల టీవీలు మూతపడ్డాయి. టీవీ పరిశ్రమ తీవ్ర ప్రమాదంలో ఉంది. ప్రభుత్వం దానికి ఘోరమైన దెబ్బ కొట్టింది." సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ జూన్ 12న కొత్త నిబంధనల ముసాయిదాను సమర్పించింది. టీవీ ప్రసార, టెలికాం కంపెనీలకు ఏకరూప నిబంధనలు ఉంటాయి. ఈ ఏకరూప నిబంధనల ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన లైసెన్స్ ఫీజులు సమకూరుతాయి.

దీని కారణంగా టీవీ ప్రసారాలు చాలా ఖరీదైనవిగా మారతాయని కూడా ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. సర్వీస్ ప్రొవైడర్లు, కేబుల్ ఆపరేటర్లు తమ ఛార్జీలను నాలుగు నుంచి ఆరు రెట్లు పెంచుతారు. డిటిహెచ్, కేబుల్ టీవీలు కనుమరుగవుతాయి. ఒక్క దెబ్బతో టీవీ సేవలు నిలిచిపోవడమే కాకుండా, లక్షలాది మంది ప్రజలు తమ ఉద్యోగాలను కోల్పోతారంటూ ఓ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**అసలు నిజం ఏంటంటే..**

కేబుల్, డీటీహెచ్ఛార్జీలు 4 నుంచి 6 రెట్లు పెరగనున్నాయనే వార్తల్లో ఎలాంటి నిజం లేదు. కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ప్రకటన ఏదీ చేయలేదు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న ఈ వార్తలను కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ




ఆధ్వర్యంలోని (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) పూర్తిగా ఖండించింది. దేశంలో టీవీ సేవలను మూసివేసేలా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిబంధనలను అమలు చేయలేదని పీఐబీ తన సోషల్ మీడియా హ్యాండిల్‌లో స్పష్టంగా పేర్కొంది.

టెలికమ్యూనికేషన్స్ (టెలివిజన్, రేడియో, సంబంధిత సేవలు) నియమాలు, 2026 ముసాయిదాను ఎంఐబి విడుదల చేసిందని, దీనిపై 2026 జూలై 27 వరకు ప్రజలు, భాగస్వాముల నుండి అభిప్రాయాలను కోరుతున్నారని పిఐబి కూడా రాసింది. ఈ ముసాయిదా నియమాలలో ఎలాంటి రుసుము పెంపునకు సంబంధించిన నిబంధన లేదు. టీవీ, రేడియో సేవల కోసం జారీ చేసిన వివిధ మార్గదర్శకాలను ఏకీకృతం చేయడమే ఈ నియమాల లక్ష్యం. ప్రస్తుత వ్యవస్థను సరళీకరించి, సమన్వయం చేయడం ద్వారా టీవీ, రేడియో ప్రసార రంగం సజావుగా పనిచేయడానికి వీలు కల్పించడం వీటి ఉద్దేశ్యం.

## బ్యాంకింగ్ స్టాక్స్‌లో అమ్మకాలు..
### సెన్సెక్స్ 443 పాయింట్లు డౌన్



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా మళ్లీ క్రూడాయిల్ ధరలు పెరగడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి తదితర కారణాలు సూచీలపై ప్రభావం చూపాయి. సెన్సెక్స్ ఓ దశలో 700 పాయింట్లు కోల్పోగా.. ఆఖర్లో కోలుకుంది. నిఫ్టీ ఫార్మా, మెటల్ స్టాక్స్ రాణించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 88 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4021 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

సెన్సెక్స్ ఉదయం 78,151.45 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆపై నష్టాల్లోకి జారుకున్న సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా నష్టంతో 77,368.29 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి 442.93 పాయింట్ల నష్టంతో 77,708.52 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95.80 పాయింట్ల నష్టంతో 24,238.50 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 96.44గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. ట్రెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎన్టీపీసీ, ఎస్‌బీఐ, అల్ట్రాటెక్ సిమెంట్ లాభపడ్డాయి.

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో క్రూడాయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ ఇంట్రాడేలో 4 శాతం పెరిగి 91 డాలర్ల స్థాయికి చేరింది. దీంతో ద్రవ్యోల్బణ భయాలు నెలకొన్నాయి.

ఆసియా మార్కెట్లు కూడా బలహీనంగా ప్రారంభం కావడం మన మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం చొప్పున నష్టపోయాయి.

దేశీయంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి. శనివారం త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన ఈ బ్యాంకుల మార్జిన్లు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5 శాతం, యాక్సిస్ బ్యాంక్ 6 శాతం మేర పతనమయ్యాయి

## ఈక్విటీలపై LTCG రద్దు
# ప్రతిపాదన లేదు: కేంద్రం

ఈక్విటీల్లో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచడంలో భాగంగా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును (LTCG Tax) పూర్తిగా తొలగించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ.. కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎల్‌టీసీజీ ట్యాక్స్ రద్దు చేసే అంశంపై ప్రస్తుతం ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టంచేసింది. బడ్జెట్ ప్రక్రియలో భాగంగా మూలధన లాభాల రేట్లు సహా పన్ను విధానాలను క్రమానుగతంగా సమీక్షిస్తామని పేర్కొంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరీ పార్లమెంట్‌లో వెల్లడించారు.

2024-25 మదింపు సంవత్సరంలో రూ. 72,249 కోట్లు ఎల్‌టీపీజీ ట్యాక్స్‌ను వసూలు చేసినట్లు పంకజ్ చౌదరి వెల్లడించారు. 2025-26 మదింపు సంవత్సరంలో ఈ పన్ను వసూళ్లు 78 శాతం పెరిగి రూ. 1,29,158 కోట్లకు చేరినట్లు తెలిపారు. రెండేళ్లలో మూలధన లాభాలపై పన్ను రూపేణా రూ. 2.01 లక్షల కోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు.

సాధారణంగా షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్స్‌ను దేశీయ, రిటైల్ ఇన్వెస్టర్లు 12 నెలల కంటే ఎక్కువకాలం పాటు హోల్డ్ చేస్తే వాటిని లాంగ్ టర్మ్ అసెట్స్‌గా పరిగణిస్తారు. వీటిపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్నును వసూలు చేస్తారు. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ. 1.25 లక్షల కంటే ఎక్కువ ఆర్జించిన మొత్తానికే ఈ పన్ను వర్తిస్తుంది.

అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్లు పెట్టుబడులను పెద్దమొత్తంలో తరలించుకుపోయిన నేపథ్యంలో లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ విషయంలో కేంద్రం కీలక మార్పు చేసింది. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఎఫ్‌పీఐల పెట్టుబడులపై పన్నును పూర్తిగా మినహాయింపు ఇస్తూ కేంద్రం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. ఈక్విటీ పెట్టుబడులపై మాత్రం దేశీయ పెట్టుబడిదారులతో సమానంగా విదేశీ మదుపర్లు కూడా 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది.



## చంద్రుడిపై కాలు మోపిన తొలి వ్యక్తి 'నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్'

**అమెరికాకు చెందిన నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్) సాధించిన అద్భుత విజయ చరిత్రగా 20 జూలై 1969 నిలుస్తున్నది. ఇదే రోజు నాసా ప్రయోగించిన "అపోలో 11" అంతరిక్ష నౌకలో "నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్" చందమామ ఉపరితలంపై తొలి మానవ కాలు మోపడం జరిగింది. ఈ అపూర్వ ఘటనకు గుర్తుగా ప్రతి ఏట 20 జూలై రోజున "అంతర్జాతీయ చందమామ దినోత్సవం" లేదా "ఇంటర్నేషనల్ మూన్ డే" నిర్వహించాలని నాటి అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ చేసిన ప్రతిపాదనతో 1975 నుంచి పాటించడం కొనసాగుతున్నది.**

అపోలో 11 చంద్రుడి ఉపరితలంపై దిగిన ఆరు గంటల తర్వాత బయటకు వచ్చి చంద్రుడి ఉపరితలంపై కాలు మోపి రెండున్నర గంటల పాటు తిరుగుతూ అధ్యయనం చేయడం విశేషం. అదే అంతరిక్ష నౌకలో ఉన్న బజ్ ఆల్డ్రిన్ అనే వ్యోమగామి చందమామపై కాలు మోపిన రెండవ వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారు. వీరిరువురు కలిసి చంద్ర మండలంపై కలియ తిరుగుతూ, 47.5 పౌండ్ల పదార్థాలను పరిశోధనల నిమిత్తం సేకరించడం జరిగింది. అపోలో 11లో ప్రయాణించిన మూడో వ్యక్తి పైలెట్ మైఖేల్ కోలిన్స్ చంద్రమండలంపైకి దిగకుండా ఆ ఇరువురు వచ్చేంతవరకు నౌకలోనే వేచి ఉన్నారు. ఈ అంతరిక్ష అద్భుత ఘటనను అమెరికన్లు, ప్రపంచ మానవాళి తమ తమ టీవీల్లో చూసి ఆశ్చర్యచకితులు కావడం జరిగింది.

**నాటి ఓ చిన్న అడుగు, నేటి ఓ భారీ ముందడుగు:**
చందమామ ఉపరితలంపై ప్రథమ అడుగు వేసిన నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ వెంటనే మాట్లాడుతూ "నేడు మనిషి వేసిన ఓ చిన్న అడుగు, రేపటి తరం మానవాళికి భారీ ముందడుగు" అంటూ అభివర్ణించడం సముచితంగా ఉన్నది. 1969-72 మధ్య ఆరు అంతరిక్ష వ్యోమనౌకలు అపోలో 11తో పాటు అపోలో-12, 14, 15, 16, 17ల ద్వారా 12 మంది వ్యోమగాములు చంద్రమండల ఉపరితలంపై కాలు మోపడం జరిగింది. అంతర్జాతీయ చందమామ దినం-2026 ఇతివృత్తంగా "వన్ మూన్, వన్ విజన్, వన్ ఫ్యూచర్ (ఒకే చంద్రుడు, ఒకే లక్ష్యం, ఒకే భవిష్యత్తు)" అనబడే అంశాన్ని తీసుకొని




ప్రచారం నిర్వహించడం జరుగుతున్నది.

**చందమామ పుట్టుక, మనుగడ:**
స్వయం ప్రకాశిత అతి భారీ అంతరిక్ష గోళాలను నక్షత్రాలు అని, సూర్యుడి లాంటి నక్షత్రం చుట్టు తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను గ్రహాలు అని, గ్రహాల చుట్టూ తిరిగే స్వయం ప్రకాశితం కాని అంతరిక్ష గోళాలను ఉప గ్రహాలు అని పిలుస్తున్నాం. శాస్త్రీయ పరికల్పన ప్రకారం, 4.6 బిలియన్ సంవత్సరాల క్రితం భూమి, అంగారక గ్రహం ఢీకోనడం ఫలితంగా చంద్రుడు అనే శాశ్వత ఉపగ్రహం ఏర్పడింది. భూమితో పోల్చితే నాలుగు రెట్లు చిన్నదైన చందమామ వ్యాసార్థం 3,479 కిమీలు, ద్రవ్యరాశి భూమి కన్న 80 రెట్లు తక్కువగా ఉంటూ, సాంద్రత ఘనపు మీటర్‌కు 3,340 కేజీలు ఉంటుంది. భూమి నుండి 2.39 లక్షల కిమీ దూరంలో ఉన్న చంద్రుడి ఉపరితలంపై సగటు ఉష్ణోగ్రత 107 డిగ్రీల సెల్సియస్, రాత్రి పూట -153 డిగ్రీలతో ఉంటూ, 27.3 రోజులకు ఒకసారి భూమి చుట్టు తిరుగుతుంది. చందమామ స్వయం ప్రకాశితం కానప్పటికీ సూర్యుడి కిరణాలు చంద్రుడిపై పడి పరావర్తనం చెందడంలో రాత్రి వేళల్లో చల్లని వెన్నెలల వర్షాలు కురిసినట్లు చక్కటి అనుభూతి పొందుతాం. సౌర మండలంలో 5వ అతి పెద్ద ఉపగ్రహమైన చందమామ, భూమి చుట్టూ తిరిగే అతి పెద్ద సహజ ఉపగ్రహంగా పేరుగాంచింది. భూకంపాలను పోలిన చంద్ర కంపనాల్లో పలు వాయువులు విడుదల అవుతాయని గమనించారు.

**ఇస్రో చంద్రయాన్ ప్రయాణ ప్రయోగాలు:**
భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ అయిన ఇస్రో తలపెట్టిన చంద్రయాన్-1 వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలో 22 అక్టోబర్ 2008 నుంచి 28 ఆగష్టు 2009 వరకు పరిశోధించడం జరిగింది. చంద్రయాన్-2 ప్రయోగంలో 20 ఆగస్టు 2019 రోజున చంద్రుడి కక్ష్యలోకి విజయవంతంగా చేరిన తర్వాత హార్డ్ ల్యాండింగ్ కారణంగా ప్రయోగం పూర్తి కానప్పటికీ 98 శాతం వరకు ప్రయోగ లక్ష్యలను చేరుకుందని ఇస్రో తెలపడం గమనార్హం. 23 ఆగష్టు 2023న చంద్రయాన్-3 వ్యోమనౌక చంద్రుడి దక్షిణ ధృవ , బైనాక్యులర్స్ లేదా టెలిస్కోప్ వంటి ఉపకరణాల సహాయంతో సూర్య, చంద్రులను గ్రహణాలను చూడడం, మానవాళి శ్రేయస్సుకు ఉపయోగపడే పరిశోధనల మాలాలను అర్థం చేసుకోవడం లాంటి అంశాలను నిర్వహించవచ్చు. ఖగోళ, అంతరిక్ష శాస్త్రాలను వృత్తిగా నేర్చుకొని అంతరిక్ష అద్భుతాలను ఆవిష్కరించే ప్రయత్నాలకు నేటి యువత పూనుకోవాలని ఆశిద్దాం, అంతరిక్ష శాస్త్రవేత్తలను అభినందిద్దాం.

**- ఆచార్య: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**


# హైదరాబాద్‌లో హామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026




**హైదరాబాద్ బ్యూరో, (సింగిడి):** హామ్‌స్టెక్ కాలేజ్ ఆఫ్ క్రియేటివ్ ఎడ్యుకేషన్ నిర్వహించిన హామ్‌స్టెక్ క్రియేటర్స్ కలెక్ట్ 2026" ఘన విజయాన్ని సాధించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సృజనాత్మక వేడుకకు 10 వేల మందికి పైగా సందర్శకులు హాజరయ్యారు. లిలి900 మందికి పైగా గ్రాడ్యుయేటింగ్ విద్యార్థులు తమ ఫ్యాషన్, ఇంటీరియర్ డిజైన్, గ్రాఫిక్ డిజైన్, ఫోటోగ్రఫీ, మేకప్, కులినరీ ఆర్ట్స్ రంగాల్లో రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. జాతీయ అవార్డు గ్రహీత ఫ్యాషన్ డిజైనర్ నీతా లుల్లా, ప్రముఖ సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్ జ్యూరీ సభ్యులుగా పాల్గొని విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు.

ఈ సందర్భంగా హామ్‌స్టెక్ ఏ ఐ ఆధారిత కొత్త పాఠ్యాంశం, లైఫ్‌టైమ్ కెరీర్ సపోర్ట్, హామ్‌స్టెక్ లాంచ్‌ప్యాడ్ పేరుతో స్టార్టప్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యక్రమాన్ని ప్రకటించింది. అలాగే సంజయ్ ఘోడావత్ యూనివర్సిటీ (కొల్హాపూర్), ఎస్ఆర్ యూనివర్సిటీ (వరంగల్)తో భాగస్వామ్యంలో రెండు కొత్త స్కూల్స్ ఆఫ్ డిజైన్ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించింది. హామ్‌స్టెక్ సీఈఓ అజితా యోగేష్ మాట్లాడుతూ, సృజనాత్మక విద్యను సాంకేతికత, పరిశ్రమ అవసరాలు, పారిశ్రామిక అవకాశాలతో అనుసంధానం చేసి విద్యార్థులను భవిష్యత్‌కు సిద్ధం చేయడమే తమ లక్ష్యమనీ తెలిపారు.









ప్రభాతనవ
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 23-7-2026

## సప్తగిరి రైస్‌మిల్లులో విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారుల సోదాలు





**జమ్మికుంట, (సింగిడి):** మిల్లులలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిల్వలు ఎక్కువగా ఉంచినట్లయితే చర్యలు తప్పవని విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి ఆర్ వి ఈ ఓ బసవ రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో రాష్ట్ర డిజిపి డిఎస్ చౌహాన్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు సోమవారం సప్తగిరి రైస్ మిల్లులో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మిల్లులలో నిల్వ ఉంచిన ధాన్యం, ప్రభుత్వానికి సప్లై చేసిన ధాన్యం నిలువలు, రికార్డులు ,ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నిల్వ ఉన్న వివరాలను గురించి పూర్తిగా వివరాలను సేకరించారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఫోర్స్మెంట్ అధికారి బస్సు రెడ్డి మాట్లాడుతూ నియమ నిబంధనలను అతిక్రమించి అక్రమ లావాదేవీలను చేసినట్లయితే చర్యలు తీసుకుంటామని తప్పకుండా నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మిల్లుల నిల్వలు ఉండాలని అక్రమ నిల్వలు నాణ్యత లోపాలు కనక ఉన్నట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన వెల్లడించారు. జమ్మికుంట పట్టణం తో పాటు మిగతా మండలాలలో ఉన్న రైస్ మిల్లులో కూడా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు.

## భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే రీ సర్వే లక్ష్యం

**నడికుడలో రీ సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**





**మల్లాపూర్, (సింగిడి):** భూముల రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని నడికుడ గ్రామంలో జరుగుతున్న నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే, ఎంజాయ్ మెంట్ రీ సర్వే పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో ఇప్పటి వరకు పూర్తయిన రీ సర్వే విస్తీర్ణం, మిగిలిన పనులు, వాటి పురోగతిపై రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సర్వే నంబర్ల వారీగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా కచ్చితత్వంతో రీ సర్వే నిర్వహించాలని సూచించారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రీ సర్వే కార్యక్రమాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ తెలిపారు. గ్రామ సరిహద్దులను నిర్ధారించి, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక సర్వే పరికరాలతో వ్యవసాయ భూములను సర్వే చేసి, అనంతరం భూ వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు. గ్రామస్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా రీ సర్వే నిర్వహించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముందుగా గ్రామ బౌండరీని లైసెన్స్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు కలిసి నిర్ధారించి, అనంతరం రైతుల వారీగా రీ సర్వే చేపడతారని వివరించారు. జగిత్యాల జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం ఏడు గ్రామాల్లో ఎంజాయ్‌మెంట్ రీ సర్వే కొనసాగుతోందని తెలిపారు. నడికుడ గ్రామంలో నాన్ కెడస్ట్రాల్ రీ సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రైతులు, గ్రామస్థులు అడిగిన సందేహాలకు కలెక్టర్ సమాధానాలు ఇచ్చి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి ఆర్డీవో నరసింహారావు, తహసీల్దార్ రాంచందర్, సర్వేయర్ కుమారస్వామి, సర్పంచ్, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

### కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లో
## అభివృద్ధి చేయడమే అంతిమ లక్ష్యం

**కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్**
**కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల, (సింగిడి):** కోరుట్ల పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడమే అంతిమ లక్ష్యంగా పెట్టుకొని పని చేస్తున్నామని కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. కోరుట్ల పట్టణ 9వ వార్డులో రూ. 3లక్షల 50 వేల నిధులతో నిర్మించనున్న మురికి కాల్వ నిర్మాణానికి సోమ వారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, స్థానిక వార్డు కౌన్సిలర్ ఎద్దు ఐలజు రమేష్ లతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులో సీసీ రోడ్లతో పాటు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్, వార్డు ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు ప్రజల సంక్షేమమే లక్ష్యం...

**20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ గుర్రం కావ్య పరశురాం**
**ప్రజల దాహార్తి తీర్చడానికి చేతి పంపు ప్రారంభం**



**జమ్మికుంట, (సింగిడి):** ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం అని 20వ వార్డు బీజేపీ కౌన్సిలర్ గుర్రం పరశురాం అన్నారు. సోమవారం వార్డులో నెలకొన్న నీటి ఎద్దడిని తీర్చడానికి చేతి పంపును ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వార్డు ప్రజలు మాపై నమ్మకంతో కౌన్సిలర్ గా గెలిపించారని వారి సమస్యలను పరిష్కరించడం మా బాధ్యత అని అన్నారు. ఇప్పటికే కాలనీలో నీటి ఎద్దడి ఉండని ప్రజలు నీటికి ఇబ్బంది పడకుండా ఉండడానికి చేతి పంపును ఏర్పాటు చేసి ప్రారంభించడం జరిగిందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

### కేసీయూబీ నిర్వహణపై
## హైకోర్టు కీలక ఆదేశాలు

**సాధారణ సర్వసభ్య సమావేశం చెల్లుబాటుపై దాఖలైన రిట్ పిటిషన్‌లో విచారణ**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ (కేసీయూబీ) మాజీ ఛైర్మన్ గడ్డం విలాస్ రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్ (నం. 19339/2026)పై తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ 2026 జూన్ 23న కీలక ఆదేశాలు జారీ చేశారు. 2026 మార్చి 29న నిర్వహించిన కేసీయూబీ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో జరగలేదని, అయినప్పటికీ ప్రస్తుత నిర్వహణ కమిటీ కొనసాగుతుండడాన్ని సవాల్ చేస్తూ గడ్డం విలాస్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. నిర్వహణ కమిటీ కొనసాగింపు చట్టబద్ధతపై స్పష్టత ఇవ్వడంతో పాటు, తెలంగాణ సహకార సంఘాల చట్టం 1964లోని సెక్షన్ 21-ఏఏ ప్రకారం బ్యాంకు వ్యవహారాల నిర్వహణకు ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్) లేదా బాధ్యతల నిర్వాహకుడిని (పర్సన్-ఇన్-చార్జ్) నియమించాలని కోరుతూ ఆయన 2026 మే 6న సహకార శాఖ కమిషనర్, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.

## పేదల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు**



**కరీంనగర్, (సింగిడి):** పేదల నమ్మకాన్ని నిలబెట్టేలా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచన కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సోమవారం కట్టరాంపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వైద్యులతో సమావేశమై రోజువారీ రోగుల సంఖ్య, ప్రధానంగా వస్తున్న ఆరోగ్య సమస్యలు, డెంగ్యూ, మలేరియా, కుక్క, కోతి కాట్లు, వైరల్ జ్వరాల పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో అప్రమత్తంగా ఉండి, ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన చికిత్స అందించాలని సూచించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులపై విశ్వాసంతో వస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టేలా సమయపాలనతో సేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి నిర్వహణలో లేదా వైద్య సేవల అందింపులో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరిగేలా సేవలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సాయిరాజ్, వైద్య సిబ్బంది సాగర్, పావని, శ్వేత, సుమతి, చల్మెడ ఆసుపత్రి శిక్షణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ అనుకూల వ్యవసాయంపై రైతులకు అవగాహన

**మాలపల్లిలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యక్రమం**



**హుస్నాబాద్ (సింగిడి):** హుస్నాబాద్ మండలం మాలపల్లి గ్రామంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రైతులకు వాతావరణ అను కూల వ్యవసాయం, స్థిరమైన సాగు పద్ధతులు, కార్బన్ క్రెడిట్ అవకాశాలపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ వెన్న స్వర్ణలత, కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు వెన్న రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెన్న రాజు మాట్లాడుతూ వాతా వరణ మార్పుల ప్రభావంతో వ్యవసాయ రంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోం దని, అలాంటి పరిస్థితుల్లో రైతులు ఆధునిక, పర్యావరణ హిత సాగు విధానాలను అవలంబించడం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవడంతో పాటు నీటి వినియో గాన్ని తగ్గించి, సాగు ఖర్చులను నియంత్రించవచ్చని అన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ వ్యవ సాయ పద్ధతులు, భవిష్యత్తులో అందుబాటు లోకి వచ్చే అవకాశాలపై అవగాహన కల్పించి ఆదాయ వృద్ధికి దోహదపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ వాతావరణ మార్పులకు అనుగుణంగా సాగు పద్ధతులు పాటించడం వల్ల నేల సారం మెరుగుపడ టంతో పాటు రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గించే అవకాశం ఉంటుందని వివరించారు. పంట అవశేషాల నిర్వహణ, సేంద్రియ పదార్థాల వినియోగం, నీటి సంరక్షణ, చెట్ల పెంపకం వంటి పర్యావరణహిత విధానాలను అనుసరించడం ద్వారా రైతులు స్థిరమైన వ్యవసాయం వైపు అడుగులు వేయవచ్చని తెలిపారు. అలాగే కార్బన్ క్రెడిట్‌కు సంబంధించిన ప్రాథమిక అవగాహన, అర్హత ప్రమాణాలు, నమోదు ప్రక్రియ, భవిష్యత్తులో అందుబాటులోకి వచ్చే అవకాశాలపై రైతులకు వివరించారు. రైతులు ఏ ప్రాజెక్టు లేదా ఒప్పందంలో చేరే ముందు నిబంధనలు పూర్తిగా చదివి, అవగా హనతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ రాష్ట్ర ఇన్‌చార్జి పల్లె వెంకటేష్ గౌడ్, దేవాన్, హుస్నాబాద్ ఫీల్డ్ కోఆర్డినేటర్ చిట్యాల ఇసాక్, వరాహ క్లైమేట్ ఎగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఢిల్లీ మేనేజర్ దేవాన్ష్, వార్డు సభ్యులు సొల్లు రజినీకాంత్, బత్తుల వీరస్వామి, బత్తుల కవితతో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకుని పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## రెండు నాలుకల ధోరణితో విద్యుత్ ఉద్యోగులకు ఇక్కట్లు...

**భద్రాచలం ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: విద్యుత్ శాఖ జేఏసీ**
**మెట్‌పల్లి డివిజన్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో నిరసన**



**మెట్ పల్లి, (సింగిడి):** విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని విద్యుత్ శాఖ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ప్రభుత్వాలను డిమాండ్ చేసింది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో విధంగా వ్యవహరించే రెండు నాలుకల ధోరణి వల్ల విద్యుత్ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ నాయకులు విమర్శించారు. ఈ విధానం విద్యుత్ రంగ భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విద్యుత్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భద్రాచలం థర్మల్ విద్యుత్ ప్లాంట్‌తో పాటు రాష్ట్రంలోని ఇతర విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించే యత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్ రంగం ప్రజల జీవితాలతో ముడిపడిన కీలకమైన సేవా రంగమని, దీనిని ప్రైవేటీకరిస్తే వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడటమే కాకుండా ఉద్యోగుల భద్రత కూడా ప్రమాదంలో పడుతుందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వాలు విద్యుత్ సంస్థలను ప్రైవేటు చేతుల్లోకి నెట్టే బదులు, వాటి నిర్వహణ బాధ్యతలను ఉద్యోగులకే అప్పగిస్తే ఏడాది వ్యవధిలోనే లాభాల బాట పట్టించి చూపిస్తామని సవాల్ విసిరారు. తెలంగాణ రాష్ట్రం నీళ్లు--నిధులు--నియామకాల లక్ష్యాలతో ఏర్పడిందని గుర్తు చేసిన వారు, రాష్ట్ర యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. స్థానిక నిరుద్యోగులకు ప్రాధాన్యం కల్పించాల్సిన చోట ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి అవకాశాలు ఎక్కువగా లభిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖలో ఆర్టిజన్, ఏఎన్ఎం, పీఏ, పీసీసీ వంటి విభాగాల్లో ఉద్యోగుల మధ్య వేతనాలు, హోదాలు, సౌకర్యాల్లో అసమానతలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పదోన్నతుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం విద్యుత్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. విద్యుత్ రంగ పరిరక్షణ ఉద్యోగులకే కాకుండా ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. నిరసనలో విద్యుత్ శాఖ జేఏసీ జిల్లా చైర్మన్ ఎండి హాజీజ్, డివిజన్ చైర్మన్ మునుగురి లక్ష్మణ్, జేఏసీ కార్యదర్శి జరుపుల హరిప్రసాద్, సామల్ల రవీందర్, బోయినపల్లి అశోక్, జిందం శంకర్, కో-కన్వీనర్ పి. రవి, బొంబాయి రఘుపతి, ఎండి కరీం, జిందం ప్రసాద్, మహేష్, గసికంటి రాము, రాజశేఖర్, జిందం శరణ్య, సాంబరి రష్మిత, లక్ష్మి తదితర విద్యుత్ శాఖ ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను 100 శాతం విజయవంతం చేయాలి

**ఆగస్టు 3లోపు లక్ష్యం పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫొటో దిగే అవకాశం**
**కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి**




**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న సమగ్ర ఓటరు సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమష్టిగా కృషిచేయాలని కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ ఆధ్వర్యంలో కార్పొరేటర్లు, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సమీక్షలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎస్ఐఆర్ పురోగతిపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. జూలై 31 నాటికి నియోజకవర్గంలో 90 శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తి చేసేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అలాగే ఆగస్టు 3లోపు లక్ష్యాన్ని పూర్తి చేసిన కార్యకర్తలకు రాహుల్ గాంధీతో ఫొటో దిగే అవకాశం కల్పిస్తామని వెల్లడించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రతి ఓటరికి ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించాలని అన్నారు. బూత్ స్థాయి ప్రతినిధులు ప్రతి ఇంటిని సందర్శించి ఒక్క ఓటు కూడా తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బూత్ స్థాయిలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసి, గణన ఫారాలు నింపడంలో ఓటర్లకు సహకరించాలని, కార్యకర్తలకు ఎలాంటి సందేహాలు ఉన్నా తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఎస్ఐఆర్ రిటర్నింగ్ అధికారి మడుపు మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య, కార్పొరేటర్లు, నగర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అహ్మద్ అలీ, ప్రధాన కార్యదర్శి కంకణాల అనిల్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఎస్ఐఆర్ సూపర్వైజర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 30 రోజులు దాటిన వినతులకు
## తక్షణ పరిష్కారం చూపాలి

**జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**



**కరీంనగర్, (సింగిడి):** ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మొత్తం 313 దరఖాస్తులు అందగా, అందులో గృహ నిర్మాణ శాఖకు అత్యధికంగా 100 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, 30 రోజులు దాటిన పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. న్యాయస్థాన కేసులు, ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులు, సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ ద్వారా అందిన ఫిర్యాదులను కూడా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను సంబంధిత నమోదులో వెంటనే నవీకరించాలని అధికారులకు సూచించారు.

## తపాల బీమా జీవితాలకు ధీమా


**చిన్న ముత్తాల పొదుపుతో కుటుంబాలకు భరోసా**
**అవగాహన సదస్సులో సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వరరావు**



**జమ్మికుంట, (సింగిడి):** తపాలా బీమా జీవితాలకు ధీమా అని కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న పోస్ట్ ఆఫీస్ లలో చిన్న మొత్తాలను పొదుపు చేస్తే భవిష్యత్తు తరాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ వెంకటేశ్వరరావు జమ్మికుంట పోస్టుమాస్టర్ యు మహేందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ, పోస్ట్ ఆఫీస్ లో కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని చిన్న మొత్తాలతో కుటుంబాలకు ఆర్థికపరచ లభిస్తుందని అంతేకాకుండా తపాలా కార్యాలయంలో యాక్సిడెంట్ పాలసీలు తీసుకుంటే భవిష్యత్తులో అన్ని రకాలుగా ఆ కుటుంబానికి అండగా ఉంటుందని వారు తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష జీవన బీమా పథకాల పైన యువ శాస్త్రవేత్తలు వ్యవసాయ క్షేత్ర సహాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారికి అవగాహన కల్పించారు. చిన్న ముత్తాల పొదుపు పథకాలు తపాల జీవిత గ్రామీణ తపాల జీవిత బీమా లాంటి పథకాలను ప్రజలకు వివరించి వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. నమ్మకానికి మారుపేరుగా పోస్ట్ ఆఫీస్ సేవలు అందిస్తుందని పోస్ట్ ఆఫీస్ లో సైతం ఆన్లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు. కార్యక్రమంలో కె వి కే సైంటిస్ట్ ప్రశాంతి పోస్టల్ సిబ్బంది ఎం వినయ్ పి వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

## ముద్దసాని దామోదర్‌రెడ్డికి ఘన నివాళి

**జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు సమర్పించిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్, (సింగిడి)::** కరీంనగర్ పరిధిలోని సదాశివ పల్లిలో మాజీ మంత్రి స్వర్గీయ ముద్ద సాని దామోదర్ రెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కరీం నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నర సన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, కార్పొరేటర్లు ఆకుల నందిని ఉదయ్, గుమ్మడి రాజ్ కుమార్, పదాల శ్రీజ అజయ్ తో పాటు పలువురు నాయకులు పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆకుల నరసన్న మాట్లాడుతూ, ముద్దసాని దామోదర్ రెడ్డి పేదల సంక్షేమానికి అంకితభావంతో పనిచేశారని, కమలాపూర్ ప్రాంత అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు. కరీంనగర్ జిల్లాలో “టైగర్”గా గుర్తింపు పొందిన ఆయన జిల్లా అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కార్యక్రమం సీనియర్ నాయకుడు కొత్తూరు జగన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ముద్దసాని కృష్ణా రెడ్డి, ఆడెపు కమలాకర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరుకు రైతుల కోసం మరో పోరాటానికి బీజేపీ సిద్ధం

**కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిర్లక్ష్యం చేస్తోందని విమర్శ.. త్వరలో భారీ రాస్తారోకో: బిజెపి మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి**



**మల్లాపూర్, (సింగిడి):** మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వద్ద భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు రైతులను మభ్యపెడుతుందని, చిత్తశుద్ధి ఉంటే చెరుకు ఫ్యాక్టరీ ని తెరిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం చక్కెర కర్మాగారం తెరిపించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తో చక్కెర కర్మాగారం తెరిపించే అంత లేకపోతే కేంద్రానికి లేఖ రాయాలని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెరిపిస్తారని తెలిపారు. బిజెపి మండల అధ్యక్షులు గోపిడి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం చెరుకు రైతుల సమస్యల పరిష్కారం కోసం మల్లాపూర్ నుంచి ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేపట్టామని గుర్తు చేశారు. ఆ పాదయాత్ర ముగిసి ఏడాది గడిచినా తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ సమక్షంలో పెద్ద ఎత్తున రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు యాదగిరి బాబు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ అనూప్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు నరేందర్ రెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మారంపల్లి తిరుపతి, వేల్పుల రాజు వివిధ బీజేపీ మోర్చా అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ కార్యవర్గం నియామకం



**కరీంనగర్, (సింగిడి):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ స్టేడియంలో ప్రకటించారు. ఈ సందర్భంగా డాక్టర్ బండారి రాజ్‌కుమార్‌ను ముఖ్య సంరక్షకుడిగా, డాక్టర్ కృష్ణప్రియను మహిళల బాక్సింగ్ విభాగం ఇన్‌చార్జిగా, ముదారి ప్రవీణ్ కుమార్‌ను ఉపాధ్యక్షుడిగా, ముదారి గణేష్, గీస పృథ్వీ రాజ్‌లను సంయుక్త కార్యదర్శులుగా, అడ్వకేట్, నోటరీ నాగుల నరేందర్‌ను న్యాయ సలహాదారుగా నియమిం చారు. అలాగే కటకోజుల కిరణ్‌ను కరీంనగర్ పట్టణ ఇన్‌చార్జిగా, మాణిక్యం శ్రీకాంత్‌ను కరీంనగర్ పట్టణ కార్యదర్శిగా, వికాస్‌ను జిల్లా నిర్వహణ కార్య దర్శిగా, ముదారి ప్రదీప్, రాజేందర్‌లను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. నూతనంగా నియమితులైన పదాధికారులను కరీంనగర్ డివిజన్ అధికారి శ్రీనివాస్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గడప సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి కొత్తకొండ సంపత్‌కుమార్, సీనియర్ ఉపాధ్యక్షులు మోసం అంజయ్య, మడిపల్లి కాళీచరణ్ గౌడ్, సీనియర్ సంయుక్త కార్యదర్శి జి. మురళి, నిర్వహణ కార్యదర్శి రామకృష్ణ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# సోషల్ మీడియా అప్రమత్తతే మీకు భద్రత

**సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలి**

**నర్సింగ్ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం**

**డీఎస్పీ ఎం వెంకటరమణ**








**జగిత్యాల ప్రతినిధి, (సింగిడి):** అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ మహిళా నర్సింగ్ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైమ్ డీఎస్పీ ఎం వెంకటరమణ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా విద్యార్థినులు సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న వివిధ రకాల మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్టాకింగ్, సైబర్ బుల్లీయింగ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా లేదా మెసేజింగ్ యాప్‌ల ద్వారా అసభ్యకర సందేశాలు పంపడం, వేధించడం, బెదిరించడం వంటి చర్యలు సైబర్ నేరాల పరిధిలోకి వస్తాయని వివరించారు. ఫేక్ సోషల్ మీడియా ప్రొఫైల్‌ల ద్వారా డబ్బులు అడగడం, వ్యక్తిగత వివరాలు సేకరించడం వంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. తెలియని వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని సూచించారు. విదేశాల్లో ఉద్యోగం, గిఫ్ట్ పంపిస్తున్నామని చెప్పి డబ్బులు అడిగే మోసాలకు గురికాకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఫిషింగ్ లింకులు పంపించి డేటా దొంగిలించడం, ఓటీపీలు తీసుకోవడం వంటి మోసాలపై కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా ఖాతాలకు బలమైన పాస్‌వర్డ్‌లు ఉపయోగించడం, ప్రైవసీ సెట్టింగ్స్ సరిచేసుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకపోవడం వంటి భద్రతా చర్యలను పాటించాలని తెలిపారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని, అలాగే https://cybercrime.gov.in వెబ్‌సైట్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే సమాచారం అందిస్తే మోసపోయిన డబ్బులు తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, సైబర్ క్రైమ్ ఎస్.ఐలు కృష్ణ, దినేష్, టౌన్ ఎస్.ఐ సుప్రియా, కళాశాల సిబ్బంది మరియు సుమారు 250 మంది నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు.

## హాస్టల్లో విషాదానికి కారణం ఏ వంటకం ..?

**హాస్టల్ లోని మటనా,తల్లిదండ్రుల వంటకమా?**

**24 మంది విద్యార్థినులకు అస్వస్థత**

**13 మందిని ఆస్పత్రికి తరలింపు**

**మణుగూరు బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఘటన**



**కొత్తగూడెం, (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో బీసీ బాలికల గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ అనుమానంతో 24 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. వారిలో 13 మందిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆదివారం తల్లిదండ్రులు హాస్టల్‌కు వచ్చి చికెన్ బిర్యానీ, ఫిష్ ఫ్రై, ఇతర ఆహార పదార్థాలు తీసుకురావడంతో వాటి వల్లే సమస్య వచ్చిందని కొందరు చెబుతుండగా, పాఠశాలలో వండిన మటన్ చెడిపోయి ఉండటమే కారణమన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కొందరు విద్యార్థినులకు కడుపునొప్పి, వాంతులు రావడంతో సోమవారం ఉదయం పరిస్థితి విషమించిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

**కారణంపై అనుమానాలు....**
మటన్ వండేటప్పుడు వాసన వచ్చినా పట్టించుకోకుండా వండారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అస్వస్థతకు గురైన విద్యార్థినుల్లో కొందరి తల్లిదండ్రులు హాస్టల్‌కు రాకపోవడంతో ఈ ఘటనపై మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆస్పత్రిలో పరామర్శ....**
అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

**ప్రిన్సిపాల్ గైర్హాజరు పై విమర్శలు...**
ఘటన సమయంలో సెలవులో ఉన్న ప్రిన్సిపాల్ ఆలస్యంగా పాఠశాలకు రావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. గురుకులాల నిర్వహణ, ఆహార నాణ్యతపై అధికారులు దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## పోలయ్య కవి కూకట్లపల్లికి ఘన సన్మానం






**హైదరాబాద్, (సింగిడి):** శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం సాయంత్రం శంకరం ఫౌండేషన్ భారత సాహిత్య అనువాద ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళారత్న డాక్టర్ బిక్కికృష్ణ అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలు జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం కవిసమ్మేళనం సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డా. రాధా కుసుమ సమన్వయ కర్తగా ఏర్పాటు చేసిన కవిసమ్మేళనంలో హైదరాబాద్ నివాసి ప్రముఖ కవి రచయిత నటుడు పోలయ్య కవి కూకట్లపల్లి పాల్గొని "ఓ నవభారత నారీమణి నీకు వందనం..
"అభివందనం" శీర్షికన"
"నిన్న నీవు ఒక ఆడపిల్లవు...
"నేడు అగ్గి పుల్లవు...
"నిన్న నీవు కమ్మని కలవు
"నేడు అందమైన అలవు...
"నిన్న నీవు పెరట్లో తులసి మొక్కవు



"నేడు గర్భం దాల్చిన గంధపు చెక్కవు...
"నిన్న గుట్టుగా కాపురం చేసే గృహిణివి
"నేడు సామ్రాజ్యాన్నేలే బిజినెస్ మాగ్నెట్ వి...
"నిన్న నీవు అబలవు
"నేడు అగ్నిశిఖవు ఆదిపరాశక్తివి...
"ఓ మహిళా మణిదీపమా..!
"నీకిదే నా వందనం అభివందనం" అంటూ స్త్రీ ఔన్నత్యాన్ని చాటే చక్కని కవితను గానం చేసిన పోలయ్య కవి కూకట్లపల్లిని శంకరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యలపర్తి ధనలక్ష్మీ గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లేశ్వరి ఘనంగా సన్మానించారు ఈ సభలో జస్టిస్ బి. చంద్రకుమార్ రచించిన నాలుగు పుస్తకాలను జస్టిస్. టి. రజని ఆవిష్కరించారు.
డా. కోగంటిఉషారాణి... అలేఖ్య... డా. రాధాకుసుమ పుస్తక సమీక్ష చేశారు ఈ సభలో ఆత్మీయ అతిథులుగా.... డా. జల్దీ విద్యాధర్... డా. రఘు అరికపూడి మరియు డా. విజయలక్ష్మి పండిట్.. గజల్ క్వీన్ వాసిరెడ్డి మల్లేశ్వరి యమునా పాఠక్ తదితర మహిళామూర్తులు హాజరై స్త్రీ సాధికారత పై చక్కని ఉపన్యాసాలు ఇచ్చారు. తదనంతరం అతిథులకు వివిధ సాహిత్య సేవ కళా రంగాలలో విశిష్ట సేవలనందించిన కళాకారులను మహిళా మణులను కీర్తిస్తూ కమ్మగా కవితాగానం చేసిన కవులను కవయిత్రులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శంకరం ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు యలపర్తి ధనలక్ష్మీ డా. బిక్కి కృష్ణ ఘనంగా సన్మానించారు.

## సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రాం ప్రారంభం

**హైదరాబాద్,(సింగిడి):** తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ శాఖ యువతను అత్యవసర సేవలు చేరుకునే ముందు ప్రథమ స్పందనకారులుగా తయారు చేయడానికి 'సివిల్ డిఫెన్స్ వాలంటీర్ ట్రైనింగ్ ప్రోగ్రామ' అనే కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ శిక్షణ కార్యక్రమం 09నుండి 15-2026 వరకు మొత్తం ఏడు రోజుల పాటు నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమాన్ని సోమవారం నాడు హైదరాబాద్‌లోని పీజీ కాలేజ్, సైఫాబాద్‌ల్గో ÷ర్ సర్వీసెస్ డైరెక్టర్ జి. వి. నారాయణ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ శిక్షణ కార్యక్రమం అన్ని శాఖలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అత్యవసర పరిస్థితులు, ముఖ్యంగా ఎయిర్ రైడ్స్, కెమికల్ దాడులు, న్యూక్లియర్ ప్రమాదాలు మరియు ఇతర విపత్తుల సమయంలో శిక్షణ పొందిన వాలంటీర్లు ప్రభుత్వ శాఖలకు సహకరించగలరని చెప్పారు. ఈ శిక్షణలో వాలంటీర్లకు రక్షణ చర్యలు, అగ్ని మాపక చర్యలు, ఫస్ట్ ఎయిడ్ చికిత్స, గుంపు నియంత్రణ మరియు సహాయక సామగ్రి పంపిణీ వంటి అం శాలలో శిక్షణ ఇవ్వబడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో వాలంటీర్లు పోలీస్, ÷ర్ సర్వీసెస్, ఎన్‌డీఆరఎఫ్ మరియు ఇతర శాఖలతో సమన్వయం చేసుకుని పనిచేస్తారు. అలాగే ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ మరియు సివిల్ డిఫెన్స్ డైరెక్టర్ జనరల్ విక్రమ్ సింగ్ మాన్, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులకు సూచించారు. శిక్షణ పొందిన వాలంటీర్లతో బలమైన కమ్యూనిటీ ఏర్పడడం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆరఎఫఓ ఎమ్‌జడ్-1 బి. సుధాకర్ రావు, ప్రిన్సిపల్ డి. కరుణ సాగర్, వైస్ ప్రిన్సిపల్ ఈ. రామా,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గర్భిణిలకు పౌష్టికాహారం అందజేత..



**మహిళలకు ఘనంగా సన్మానం**
**-బాల్యతండా సర్పంచ్ జరుపుల కాలు నాయక్**

**డోర్నకల్ /మరిపెడ, (సింగిడి):** అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీ స్త్రీలకు పిల్లలకు పోషకా పదార్థాలుఅందు తాయని, అంగన్వాడి కేంద్రాల సేవలను మహిళలు ఉపయోగిం చుకోవాలని బాల్యతండా గ్రామ సర్పంచ్ జరుపుల కాలు నాయక్ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ను సర్పంచ్ కాలు నాయక్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగాగ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గర్భిణి మహిళలకు,పిల్లలకు పోషక పదార్థాలు అందించారు. అనం తరం మహిళలను శాలువాలతో సత్కరించి అభినం దించారు. నేటి సమాజంలో పురు షులతో సమానంగా మహిళలు పోటీపడి ప్రభుత్వ కార్యక్రమా లలో పాల్గొని ముందుకు సాగడం అభినందనీయమ న్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోతువిజయ, పంచాయతీ కార్యదర్శి ఆశ్ర, అంగన్వాడి టీచర్లు, హెల్త్ అసిస్టెంట్లుపద్మావతి, సుజాత,వార్డు సభ్యులు బుజ్జి,రామ్ కోటి,భారతి, శ్రీను,గ్రామనాయకులు బానోత్ హరి నాయక్,బానోత్ పాప, జరుపుల లాలు,బానోత్ వీరన్న, బానోత్‌రమేష్, బానోత్ హుస్సేన్,గ్రామ ప్రజలు ఇంకా తదితరులు ఉన్నారు.



### చమురు ధరలతో
# మార్కెట్ల కుదేలు

**రూపాయి విలువ పడడంతె దేశీయ మార్కెట్లపై ప్రభావం**

**న్యూఢిల్లీ, (సింగిడి):** పశ్చిమాసియాలోని ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు భగ్గుమంటున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర వంద డాలర్లు దాటింది. ప్రపంచంలోనే మూడో అతి పెద్ద చమురు దిగుమతిదారు అయిన భారత్‌పై తీవ్ర ప్రభావం పడుతుందనే అంచనాలు మదుపర్లను కలవరపెడుతున్నాయి. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిలో ఉండడం, డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి భారీగా పతనమవడం దేశీయ సూచీలపై నెగిటివ్ ప్రభావం చూపిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ భారీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (78,918)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 2000 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పతనమైంది. మరో ఆరు వందల పాయింట్లు కిందకు వెళ్లింది. చాలా రోజుల తర్వాత సెన్సెక్స్ 70,000 పాయింట్ల దిగువకు పడిపోయింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2037 పాయింట్ల నష్టంతో 76,881 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా భారీగా నష్టపోయింది. 2.5 శాతానికి పైగా పడిపోయింది. ప్రస్తుతం 624 పాయింట్ల నష్టంతో 23,826 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో ఎమ్‌సీఎక్స్ ఇండియా, కోల్ ఇండియా మొదలైన షేర్లు మాత్రమే స్వల్ప లాభాల్లో ఉన్నాయి . ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, యూనో మిండా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్బీఐ, హిందుస్థాన్ పెట్రో మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1587 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2280 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.32గా ఉంది.

### ఆర్థిక సంక్షభంతో
# తగ్గుతున్న పసిడి ధరలు

**-బంగారం, వెండిపై స్వల్పంగా తగ్గుదల**

**న్యూఢిల్లీ, (సింగిడి):** గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు సోమవారం మరింత కిందకు వచ్చాయి. అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్నప్పటికీ బంగారం, వెండి ధరలు మాత్రం పడిపోతుండడం నిపుణులకు ఆశ్చర్యం కలిగిస్తోంది. సోమవారం వెండి కేజీకి రూ. 5 వేల మేర తగ్గింది. మరోవైపు బంగారం ధర కూడా భారీగా తగ్గింది. సోమవారంఉదయం 10:30 గంటల సమయంలో హైదారాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ. 1,61,680కు చేరుకుంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే దాదాపు రూ. 1960 మేర తగ్గుదల నమోదు చేసింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,48,200 దగ్గర ఉంది. ముందటి రోజు ధరతో పోల్చుకుంటే రూ. 1800 మేర తగ్గింది. మరోవైపు వెండి కూడా భారీ తగ్గుదల నమోదు చేసింది. బుధవారం కిలోకు రూ. 5 వేల మేర తగ్గింది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర ప్రస్తుతం రూ. 2.80 లక్షలుగా ఉంది. హైదరాబాద్‌లో కిలో వెండి ధర ప్రస్తుతం రూ. 2.90 లక్షలుగా ఉంది. గమనిక: పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు ఎప్పటికప్పుడు మారుతుంటాయి. కాబట్టి వీటిని కొనుగోలు చేసే సమయంలో మళ్లీ ధరలు తెలుసుకోవాలని సూచన.

### వివదాలకు నేను దూరం
# పార్టీ ప్రయోజనాలే ముఖ్యం

**మీడియాతో వేం నరేందర్ రెడ్డి**

**హైదరాబాద్, (సింగిడి):** తాను వివాదాలకు దూరమని రాజ్యసభకు కొత్తగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ అసెంబ్లీ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి వేం నరేందర్ రెడ్డి రాజ్యసభకు ఎన్నికైనట్లు ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. అనంతరం అసెంబ్లీలోని మీడియా పాయింట్ వద్ద వేం నరేందర్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. పార్టీ ప్రయోజనాలే తన ప్రయోజనాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి తన వంతుగా చేయగలిగింది చేస్తానని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌తో తనకు స్నేహం ఉందని చెప్పారు. అయితే సోషల్ మీడియాలో ఏం జరుగుతుందో తనకు తెలియదన్నారు. తనకు కొత్త విషయాలు నేర్చుకోవడమంటే ఇష్టమని పేర్కొన్నారు. ఇన్ని రోజులు తన పని.. పద్ధతి ఒకలా ఉండేదని.. ఇకపై మరోలా ఉంటుందన్నారు. రాజ్యసభకు అవకాశం కల్పించిన పెద్దలకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభకు ఎన్నికైనట్లుగా తాను ధృవీకరణ పత్రాన్ని తీసుకున్నానని చెప్పారు. 2004 నుంచి 2009 వరకు తాను ఎమ్మెల్యేగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. ఇప్పటి నుంచి పార్లమెంట్ వేదికగా పని చేయబోతున్నానని తెలిపారు. తెలంగాణ సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభలో పోరాడతానని వేం నరేందర్ రెడ్డి వెల్లడించారు.

# ఎసిబి వలలో చిక్కిన పోలీసులు

**లక్షలంచం తీసుకుంటుండగా పట్టివేత**

**హైదరాబాద్, (సింగిడి):** సైబర్ క్రైం కేసులో అరెస్టు చేయకుండా ఉండడానికి ఫిర్యాదుదారుడు నుంచి లంచం తీసుకుంటూ ఇద్దరు ఆరఎస్సైలు ఏసీబీకి చిక్కారు. మల్కాగిజిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఎల్‌బీ నగర్ సైబర్‌క్రైం పోలీసు స్టేషన్‌కు చెందిన ఇద్దరు ఎస్సైలు ప్రమోద్ గౌడ్ , జటావత్ బాబు నాయక్ సోమవారం రూ. లక్ష లంచం తీసుకుంటుండంగా పట్టుబడ్డారు. ఎల్‌బీ నగర్ చౌరస్తాలో ఎస్సై జటావత్ బాబు ఈ డబ్బును తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ గంగసాని శ్రీధర్ ఆధ్వర్యంలో దాడుల నిర్వహించి పట్టుకున్నారు. లక్ష రూపాయల నగదును పట్టుకుని ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పరిచారు. బాధ్యత గల ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా విధుల ఉల్లంఘలకు పాల్పడి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని ఏసీబీ శాఖ సూచించింది. సోషల్ మీడియా నంబర్ 9440446106 అనే వాట్సప్ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించింది.

## వివేకా హత్య కేసులో విచారణ

**సిబిఐ ఫైల్స్ ఇండెక్స్ కోరిన నిందితులు**

**కడప, (సింగిడి):** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. నిందితులు సీబీఐకోసం కాకుండా, ముందుగా సిట్ దర్యాప్తు చేసిన వివరాలను అందజేయాలని న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ ఇచ్చిన 13 లక్షల ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి ఇవ్వాలని నిందితులు కోర్టును కోరారు. సీబీఐ అందజేసిన 13 లక్షల డిజిటల్ ఫైల్స్‌లో కొన్ని ఓపెన్ అవ్వలేదని కోర్టుకు నిందితుల న్యాయవాదులు తెలిపారు. అందువల్ల సీబీఐ ఇచ్చిన ఫైల్స్‌ను ఇండెక్స్ రూపంలో పొందుపరిచి అందించాలని కోరారు. నిందితుల న్యాయవాదుల అభ్యర్థనలను న్యాయస్థానం పరిశీలించింది. ఓపెన్ కాని ఫైల్స్‌ను మంగళవారం కోర్టు సమక్షంలో ఓపెన్ చేయడానికి సీబీఐను ఆదేశించింది. ఈ కారణంగా, కేసులో తదుపరి విచారణను న్యాయస్థానం నేటికి వాయిదా వేసింది.

# పోలవరం జిల్లాలో పులిసంచారం

**20 రోజులుగా స్థానికుల ఆందోళన**

**పోలవరం, (సింగిడి):** పోలవరం జిల్లాలో గత 20 రోజులుగా పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. ఈ పులి మొదట్లో పోలవరం జిల్లాలోని అడవి ప్రాంతాల్లో, రంపచోడవరం, అడ్డతీగల మండలాల పరిసరాల్లో కనిపించింది. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు తూర్పు గోదావరి జిల్లాలోకి వెళ్లి, ఏలేశ్వరం మండలం పరింతడక, మర్రివీడు ప్రాంతాల్లో పశువులపై దాడులు చేసింది. అక్కడ గేదెలు, దూడలను దాడి చేసి చంపేసింది. దీంతో అటవీ అధికారులు అప్రమత్తమై, పులిని బంధించేందుకు విస్తృతంగా చర్యలు చేపట్టారు. అయితే, పులి మళ్లీ తప్పించుకుని పోలవరం జిల్లాలోనికి తిరిగి ప్రవేశించింది. ప్రస్తుతం రాజవొమ్మంగి రేంజ్ పరిధిలోని సర్రంపేట అడవి ప్రాంతంలో సంచరిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో అటవీ శాఖ అధికారులు సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతాలకు వెళ్లవద్దని, ఒంటరిగా తిరగవద్దని సూచించారు. పశువులను అడవి ప్రదేశాలకు తీసుకెళ్లి మేపవద్దని, రాత్రి వేళల్లో బయటకు రావద్దని, పశువులను సురక్షితంగా ఉంచాలని కోరారు. పులిని సురక్షితంగా బంధించేందుకు పెద్ద ఎత్తున గాలింపు, ఆపరేషన్ చర్యలు కొనసాగుతున్నాయి. ఇటీవల వీరభద్రపురం, కొనలోవ, గొండోలు, గవరయ్యపేట, కొట్టంపాలెం వంటి గ్రామాల పరిసరాల్లో పులి జాడలు, పాదముద్రలను అటవీశాఖ అధికారులు గుర్తించిన విషయం తెలిసిందే. యేలేరు రిజర్వాయర్ పరివాహక ప్రాంతం నుంచి రాజవొమ్మంగి అటవీ ప్రాంతంలోకి పులి ప్రవేశించినట్లు ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

### విద్యుత్ షాక్‌తో
# ఇద్దరు వ్యక్తుల బలి

**మంచిర్యాల, (సింగిడి):** మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం మేదరిపేటలో విషాదం నెలకొంది. ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోల్ బంక్ నుంచి ఎత్తైన ఇనుప స్టాండ్ ను తీసుకెళ్లే క్రమంలో మెయిన్ లైన్ విద్యుత్ తీగలు స్టాండ్ కు తగలడంతో ఇద్దరు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. మృతులు మాదాపూర్‌కు చెందిన చల్ల లక్ష్మీనారాయణ ( 45 ), వెల్గనూర్‌కు చెందిన చందనగిరి నాగరాజు (40) గా గుర్తించారు. ఇరువురు స్థానికంగా కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. ఇద్దరి మృతితో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బంకు నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, నష్ట పరిహారం అందించాలని కోరుతూ మృతుల కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సై తహసీనుద్దీన్ ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వీడ్కోలు

**హైదరాబాద్, (సింగిడి):** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాను అందజేసి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

### గిరిజన ఉత్పత్తులకు
# మద్దతు ధరలు

**కేంద్రంతో గిరిజన కార్పోరేషన్ ఒప్పందం**

**న్యూఢిల్లీ, (సింగిడి):** తెలంగాణ రాష్ట్రంలోని గిరిజన రైతులు సేకరించిన మైనర్ ఫారెస్ట్ ప్రొడ్యూస్ కి కనీస మద్దతు ధర అందించడానికి భారత ప్రభుత్వం, తెలంగాణ గిరిజన్ కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్-చైర్మన్ /మేనేజింగ్ డైరెక్టర్ సబ్యసాచి ఘోష్, న్యూఢిల్లీలోని ట్రైఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. రాజమురుగన్, ఎంఓయూపై సంతకం చేశారు. నిర్దేశిరచిన మార్గదర్శకాల ప్రకారం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర స్థాయిలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుంది, గిరిజన సంక్షేమ శాఖ కింద ఉన్న తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ రాష్ట్ర స్థాయిలో అమలు సంస్థగా పనిచేస్తుంది. అవగాహన ఒప్పందంపై సంతకం చేయడంతో, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఒక కార్యక్రమం నెరవేరింది. ప్రధానంగా చిన్న అటవీ ఉత్పత్తుల సేకరణపై ఆధారపడిన గిరిజన రైతులు కనీస మద్దతు ధర ఏర్పాటు ద్వారా గణనీయంగా ప్రయోజనం పొందుతారు. ఈరాష్ట్రంలోని ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీల అధికార పరిధిలో అవసరమైన గోడౌన్లు మరియు హాత్ బజార్ల నిర్మాణానికి మద్దతు ఇస్తుంది .

## మద్యం కేసులో ఇడి దూకుడు

**-నిందితులకు నోటీసులు జారీ**

**అమరావతి, (సింగిడి):** ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ దూకుడు పెంచింది. మద్యం కుంభకోణంలో నిందితులుగా ఉన్న ధనుంజయరెడ్డి, వెంకటేష్ నాయుడు, చాణక్యలకు ఈడీ నోటీసులు జారీ చేసింది. బ్యాంక్ స్టేట్‌మెంట్లు, పాన్ కార్డులు, కుటుంబ సభ్యుల ఆస్తుల వివరాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్లను తీసుకురావాలని నోటీసుల్లో స్పష్టంగా పేర్కొంది. విచారణకు హాజరుకావాలని ఈడీ ఆదేశించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ మద్యం స్కామ్‌లో వేల కోట్ల రూపాయల కమిషన్లు, మనీలాండరింగ్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రూ. 441 కోట్లకు పైగా ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సీఐడీ సిట్ ఇచ్చిన రిపోర్టుల ఆధారంగా కీలక నిందితులకు సంబంధించిన ఆస్తులను భారీ ఎత్తున జప్తు చేసింది. ప్రధాన నిందితులుగా ఉన్న రాజ్ కసిరెడ్డి, చాణక్య, వాసుదేవరెడ్డికి చెందిన రూ. 441 కోట్ల ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది.

### కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ
# ఏర్పాటు చేయాల్సిందే

**-దక్షిణమధ్యరైల్వే జిఎంకు బిఆర్ఎస్ వినతి**

**హైదరాబాద్, (సింగిడి):** బీఆరఎస్ నాయకులు, మాజీ ఎంపీ బొయినపల్లి వినోద్‌కుమార్ , మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్‌బాబు సోమవారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ తో సోమవారం భేటీ అయ్యారు. కాజీపేట రైల్వే డివిజన్ తో పాటు స్థానికులే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ కాజీపేటకు కోచ్ ఫ్యాక్టరీ కావాలని 40 ఏళ్ల నుంచి డిమాండ్ ఉందని, అయితే కేంద్రం పదేళ్ల క్రితం వ్యాగన్ ఫ్యాక్టరీ కోసం ప్రకటన చేసిందని తెలిపారు. స్థానిక నాయకులు ఈ ప్రాంత రైతులతో మాట్లాడి తక్కువ ధరతో భూమి ఇవ్వడానికి ఒప్పుకున్నారని వివరించారు. అయితే ఫ్యాక్టరీలో స్థానికులకు కాకుండా ప్రైవేట్ వారిచే పనులు చేస్తున్నట్టు జీఎం పేర్కొన్నారన్నారు.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం
23-7-2026

# అక్షరాల ఒడిలో.. ఆత్మీయత ముడిలో
# కలెక్టర్ 'అమ్మ'గా!

సింగిడి స్పెషల్ స్టోరీ..

**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** అధికారం అంటే కేవలం ఏసీ గదుల్లో కూర్చొని ఫైళ్లపై సంతకాలు చేయడం మాత్రమే కాదు... ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకోవడం, భవిష్యత్తు తరాలకు మార్గదర్శకంగా నిలవడం అని నిరూపించారు కలెక్టర్ సిహెచ్ ప్రియాంక. సాధారణంగా ఐఏఎస్ అధికారుల పర్యటనలు అంటే గంభీర వాతావరణం, అధికారుల హడావుడి కనిపిస్తుంది. కానీ, ఇక్కడ మాత్రం పూర్తిగా భిన్నమైన, అత్యంత మానవీయమైన దృశ్యం ఆవిష్కృతమైంది.



**పలక పట్టిన చిన్నారి.. అక్షరం దిద్దించిన కలెక్టర్**

నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామములోని అంగన్వాడి కేంద్రంలో పూర్వ ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని స్థానిక ప్రాథమిక పాఠశాలలో చేరిన (అంగన్‌వాడీ) చిన్నారులకు, ప్రభుత్వ పాఠశాల పర్యటన సందర్భంగా కలెక్టర్ నేరుగా చిన్నారుల మధ్యకు వెళ్లారు. అక్కడ పలక చేతపట్టుకుని కూర్చున్న ఒక చిన్నారిని చూసి, ఆమెలోని అధికార హోదా కరిగిపోయింది. ఒక తల్లిగా మారి ఆ చిన్నారి పక్కనే నేలపై కూర్చున్నారు. ఆ చిన్నారి చేతిని తన చేతిలోకి తీసుకుని, బలపంతో పలకపై అక్షరాలు దిద్దిస్తున్న ఆ దృశ్యం చూసే ప్రతి ఒక్కరి కళ్లల్లో ఆనందాన్ని నింపింది. కలెక్టర్ ప్రియాంక ఎంతో ఓపికగా, చిరునవ్వుతో ఆ చిన్నారికి ఒడిలో ఉన్నంత ఆత్మీయతను పంచుతూ "ఓనమాలు" నేర్పిస్తుంటే, చుట్టూ ఉన్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆ క్షణాన్ని ఆశ్చర్యంతో, సంతోషంతో వీక్షించారు. ఈ స్టోరీ ఇచ్చే గొప్ప సందేశం నమ్మకం పెంచే అడుగు ప్రభుత్వ విద్యా వ్యవస్థలపై, అంగన్‌వాడీ కేంద్రాలపై సామాన్యులకు నమ్మకం కలిగించేలా ఈ చిత్రం ఉందన్నది నిజం. ఉన్నతాధికారులే స్వయంగా పిల్లల చెంతకు చేరినప్పుడు ఆ వ్యవస్థపై గౌరవం మరింత పెరుగుతుంది.

**స్ఫూర్తిదాయక పునాది**

కలెక్టర్ చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేసుకున్న ఆ చిన్నారి పెద్దయ్యాక, తన జీవితంలో మొదటి అక్షరాన్ని ఒక ఐఏఎస్ అధికారి దిద్దించారని తెలుసుకున్నప్పుడు ఆ బిడ్డ పొందే స్ఫూర్తి, గర్వం మాటల్లో చెప్పలేనివి. అది ఆ చిన్నారిని ఉన్నత శిఖరాలకు చేర్చేలా ప్రేరేపిస్తుంది.

**అహం లేని అధికారం**

ఎంతటి ఉన్నత పదవిలో ఉన్నా, సమాజంలోని చివరి వ్యక్తికి, చిన్నారికి కనెక్ట్ అవ్వడమే నిజమైన నాయకత్వ లక్షణం అని కలెక్టర్ సిహెచ్ ప్రియాంక నిరూపించారు. చదివే రేపటి భవిష్యత్తుకు పునాది. ఆ పునాదిని ఇంతటి ప్రేమతో ఆత్మీయతతో వేసిన కలెక్టర్ ప్రియాంక చొరవ నిజంగా అభినందనీయం కేవలం ఒక విధి నిర్వహణ కాదు సమాజానికి ఒక దిక్సూచి.

## ఇందిరమ్మ ఇళ్లకు కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ భూమి పూజ

**కామారెడ్డిబ్యూరో, (సింగిడి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గురువారం గర్గుల్ గ్రామంలో భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న లబ్ధిదారులు రావుల పెద్ద ఎల్లమ్మ, భిక్షపతి, దానబోయిన జ్యోతికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కలెక్టర్ శంకుస్థాపన చేశారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడి ప్రభుత్వం కల్పిస్తున్న గృహ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యతతో ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసి లబ్ధిదారులు త్వరగా గృహ ప్రవేశం చేసుకునేలా అధికారులు అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ... తమకు జిల్లాలో మొదటిసారిగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఎన్నో సంవత్సరాలుగా పూరి గుడిసెల్లో నివసిస్తున్న తమకు సొంత ఇంటి కల నెరవేరిందని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లా పరిపాలనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, డిఎల్ పీ ఓ శ్రీనివాస్, సర్పంచ్ దివ్య, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం

**బిక్కనూరు,(సింగిడి)::** పేదలకు సొంతింటి కలను సాకారం చేసే రాష్ట్ర ప్రభుత్వ ప్రతి ష్ఠాత్మక ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా బిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లిలో గురువారం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి లబ్ధిదారులకు నూతన వస్త్రాలను కానుకగా అందజేసి, వారి నూతన గృహ జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చేపూరి రాణి రాజు, ఉపసర్పంచ్ గొల్లపల్లి వినోద్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మద్ది సూర్యకాంత్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ రమేష్ రెడ్డి, టెంపుల్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణారెడ్డి, శశికుమార్, పనాసా రాజు, భవాని ధర్మస్వామి, చంద్రకళ వీరేశం, కూతరు రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్యామ్, వీడీసీ కార్యదర్శి నాగర్తి భూమ్‌రెడ్డి, మహిళలు, ప్రజలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి



## రైతుల విశ్వాసాన్ని దెబ్బ తీసే విత్తన వ్యాపారులపై కఠిన చర్యలు

మండల వ్యవసాయ అధికారి మంజుమ్ ఖాన్,
వైరా ఎస్సై రామారావు



**వైరా,(సింగిడి):** రైతుల విశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహ రించే ఎరువులు, పురుగుమందులు, విత్తనాల వ్యాపారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వైరా మండల వ్యవసాయ శాఖ అధికారి మంజూం ఖాన్, వైరా ఎస్సై పుష్పాల రామారావు హెచ్చరిం చారు. నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టడానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం మండల పరిధిలోని తాటిపూడి గ్రామంలో విత్తన దుకాణాలు, గోదాములు, రవాణా కేంద్రాలపై ఆకస్మికంగా దాడులు చేపట్టారు. ఆయా దుకాణాలలో రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ తదితర అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువుల ధరలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేవా అనే విషయాలపై ఆరా తీశారు. విత్తన ప్యాకెట్లపై ఉన్న తయారీ, గడువు తేదీలు, కంపెనీ గుర్తింపు లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మి రైతులను మోసం చేసే వ్యాపారులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామన్నారు. రైతుల ప్రయోజనాల పరిరక్షణ లక్ష్యంగా తనిఖీలు చేస్తామని తెలిపారు. తనిఖీలలో వ్యవసాయ శాఖ ఏడిఏ కరుణశ్రీ పాల్గొన్నారు.

## కాకతీయ ఇంజనీరింగ్ విద్యార్థినిల స్నాతకోత్సవం




**నిజామాబాద్ ప్రతినిధి, (సింగిడి):** కాకతీయ ఇంజనీరింగ్ మహిళ కళాశాలలో 2022-2026 సంవత్సరాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థినిలకు శ్రీరామ గార్డెన్స్ లో గురువారం పట్ట భద్రుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ యునివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.యాదగిరి విచ్చేసి విద్యార్థినిలకు ఇంజనీరింగ్ పట్టాలను అందించారు. అనంతరం విద్యార్థినిలను అభినందిస్తూ, నేటి సమాజంలో విద్యార్థినిలు అన్ని రంగాల్లో ముందుండాలని, వాటికి తగినటువంటి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని, ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్లాలని, ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ప్రసంగించారు. అనంతరం కళాశాల డైరెక్టర్ చెరుకూరి రజనీకాంత్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో మా కళాశాల నుండి 232 మంది విద్యార్థినిలు ఇంజనీరింగ్ పట్టాలు పొందడం, చాలా మంది విద్యార్థినిలు సాఫ్ట్ వేర్ కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం కాకతీయ విద్యాసంస్థలకు ఎంతో గర్వ కారణమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. సెల్వ కుమార్ రాజా మాట్లాడుతూ మా కళాశాల నుండి పట్టాలు పొందిన విద్యార్థినిలు ఏ రంగంలో ఉన్నా కళాశాలకు, తల్లిదండ్రులకు, సమాజానికి గర్వ కారణంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టేట్ మేనేజర్ నాగేశ్వర్ రావు, వైస్ ప్రిన్సిపాల్ జి.సాయారెడ్డి, వివిధ శాఖల అధిపతులు, కళాశాల సిబ్బంది, విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మణుగూరులో కలెక్టర్ విస్తృత పర్యటన

ముంపు ప్రాంతాలను పరిశీలించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలు

**మణుగూరు (సింగిడి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం పట్టణంలో విస్తృతంగా పర్యటించి ముంపు ప్రాంతాలైన గాంధీనగర్, సుందరయ్య నగర్ ప్రాంతాలను పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సింగరేణి కాలరీస్ ఓపెన్ కాస్ట్ గనుల నుంచి వర్షాకాలం వరద నీరు వచ్చి ఈ గ్రామాలపై పడే ప్రమాదం ఉన్నట్లు ఆయన ముందుగానే గుర్తించారు. సింగరేణి అధికారుల సహాయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆదేశించారు. వరదలు వచ్చిన ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలతో పాటు, ముందస్తు చర్యలు చేపట్టాలని స్థానిక అధికారులను ఆయన ఆదేశించారు. ముఖ్యంగా పట్నంలో డ్రైనేజీలు కాలువలు పూడికను వెంటనే తీపించాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ ను ఆదేశించారు. వర్షాకాలంలో వరదలు వచ్చే సమయంలో ఇరిగేషన్ శాఖ తక్షణమే ముందస్తు చర్యలు చేపట్టాలని ఇరిగేషన్ డి రమేష్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట, స్థానిక తాసిల్దార్ అద్దంకి నరేష్, డి రమేష్, మున్సిపల్ కమిషనర్ ప్రసాదు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



## యూరియా బుకింగ్ యాప్‌ను ప్రారంభించిన కలెక్టర్ ఎమ్మెల్సీ

రైతులు యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకునే అవకాశం
కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి

**నాగర్ కర్నూల్,(సింగిడి):** నాగర్ కర్నూల్ జిల్లాలో రైతులకు యూరియా పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు, ఎరువుల కోసం పడే ఇబ్బందులను తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యూరియా బుకింగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిం దని, జిల్లాలోని 20 మండలాల్లో ఈ సేవలను నేటి నుండి ప్రారంభించగా, రైతులు ఇకపై నేరుగా తమ మొబైల్ ఫోన్ ద్వారా యూరియాను బుక్ చేసుకునే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో హాకా, ఆగ్రోస్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, క్రిమిసంహారక మందుల విక్రయ కేంద్రాల డీలర్లతో యూరియా పంపిణీ, యూరియా నిల్వలు, యాప్ ఆధారిత బుకింగ్ విధానం తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో శాసన మండలి సభ్యుడు కూచుకుళ్ల దామోదర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి చేతుల మీదుగా యూరియా బుకింగ్ యాప్‌ను అధికారికంగా ప్రారం భించారు. అనంతరం యాప్ పనితీరు, రైతులకు అందించే సేవలు, బుకింగ్ విధానం గురించి అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలనికోరారు. యూరియా బుకింగ్ ప్రక్రియను రైతులకు సులభంగా వివరించి, ప్రతి రైతు సాంకేతిక సేవలను వినియో గించుకునేలా సహకరించాలని ఆయన సూచించారు. యాప్ ప్రారంభ దశలో కొన్ని సాంకేతిక సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటిని అధిగమిస్తూ సేవలను విజయవంతంగా అమలు చేయాలని అధికారులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందుగానే యూరియా నిల్వలను సిద్ధం చేసిందని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ జరగడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 32 వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతుల అవసరాలకు అనుగుణంగా వాటిని సకాలంలో పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న రైతులకు ప్రాధాన్యతనిస్తూ, వారికి ఎరువులు సులభంగా అందే విధంగా వ్యవస్థను పటిష్టం చేయాలని సూచించారు. రైతులు యాప్‌ను సద్వినియోగం చేసుకొని ముందస్తుగా యూరియాను బుక్ చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా సహకార అధికారి రఘునాథ్ రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అశోక్, హర్షవర్ధన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు, హాకా, ఆగ్రోస్ ప్రతినిధులు, సహకార సంఘాల అధికారులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.



## విద్యారణ్య విద్యాలయ ప్రారంభం

నాణ్యమైన విద్యకు ఎమ్మెల్యే విజయుడు పిలుపు



**గద్వాల ప్రతినిధి(సింగిడి)::** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ పట్టణం భారత్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన 'విద్యారణ్య విద్యాలయ' ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అలంపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు విజయుడు ముఖ్య అతిథిగా హాజరై, మున్సిపాలిటీ చైర్మన్ సీఎం సురేష్ తో కలిసి రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. అనంతరం పాఠశాల తరగతి గదులను పరిశీలించిన ఎమ్మెల్యే, నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లను పెంపొందించేలా యాజమాన్యం కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మెరుగైన విద్యా బోధన అందిస్తామని పాఠశాల యాజమాన్యం ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అయిజ మున్సిపల్ చైర్మన్ సీఎం సురేష్, కౌన్సిలర్లు శివ, డాక్టర్ కృష్ణ, కో-ఆప్షన్ సభ్యులు నాగన్న గౌడ్, మౌల, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ పనులు
# వేగవంతం చేయాలి

పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

**కల్వకుర్తి,(సింగిడి):** తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో నిర్మాణంలో ఉన్న ప్రతిష్ఠాత్మక యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఈరోజు క్షుణ్ణంగా పరిశీలించారు. భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ మహత్తర లక్ష్యానికి ప్రతీకగా నిర్మితమవు తున్న ఈ విద్యా ప్రాంగణం పనుల పురోగతిని ఆయన స్వయంగా సైట్‌లో పర్యటించి సమీక్షించారు. సైట్ ఇంజనీర్లు, సంబంధిత శాఖల అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో కలిసి మొత్తం ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గారు పాఠశాల భవనాలు, అత్యాధునిక తరగతి గదులు, విద్యార్థుల హాస్టళ్లు, సైన్స్--కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్స్, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థలు వంటి అన్ని అంశా లను లే అవుట్ ప్రకారం సమగ్రంగా అంచనా వేశారు. ప్రతి పనికి సంబంధిం చిన సాంకేతిక వివరాలను తెలుసుకుంటూ నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాలు మరియు పనుల వేగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ ప్రాజెక్టు కేవలం ఒక పాఠశాల నిర్మాణం మాత్రమే కాదని, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర విద్యా యజ్ఞమని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి కలల ప్రాజెక్టుగా ఇది రూపుదిద్దుకుంటోం దని ఆయన తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని సూచించిన ఎమ్మెల్యే, నిర్ణీత గడువుకంటే ముందుగానే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, జాప్యం లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఖానాపూర్‌లో నిర్మితమవుతున్న ఈ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవిష్యత్తులో రాష్ట్రంలోనే ఆదర్శ విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు వేలాది మంది విద్యా ర్థుల జీవితాల్లో వెలుగులు నింపే జ్ఞాన మందిరంగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.




## వైభవంగా శ్రీ భ్రమరాంబికా మల్లికార్జునస్వామివారి కల్యాణం


**చింతపల్లి, (సింగిడి):** మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయి బాబా ఆలయ 29వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఉదయం 11.00 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి స్వరూపమైన వేప, రావి చెట్టు కు భక్త జన సందోహం మధ్య కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్ర హోమం, భూ వరాహ స్వామి హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శ్రీశైల క్షేత్రంలో ఉన్న శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మూర్తులను ఆ క్షేత్ర వేద పండితులు ఆలయానికి తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వార్ల కళ్యాణ మూర్తులతో పాటు శ్రీ షిరిడి సాయి బాబా విగ్రహాన్ని అత్యంత సుందరంగా అలంకరించిన పూల రథం పై భక్త జనం వెంట రాగా మహిళల కోలాట నృత్యాలు , భజనలతో ఎంతో ఘనంగా ఊరేగింపుగా కళ్యాణ మండపానికి తీసుకొని రావడం జరిగింది. ఈ సందర్భంగా స్వామి కళ్యాణ మండపాన్ని వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో ఎంతో సుందరంగా అలంకరించారు. స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని శ్రీశైలం క్షేత్ర వేద పండితులు ఎంతో వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న దాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో శ్రీశైలం క్షేత్ర ఆలయ బోర్డు సభ్యుడు కాశీనాథ్, స్థానిక ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరే కృష్ణయ్య, కమిటీ సభ్యులు కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీనివాస్, చండీయాగ నిర్వాహకుడు నవీన్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలి
# కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

పాలిటెక్నిక్ విద్యార్థులకు కలెక్టర్ దిశా నిర్దేశం





**గద్వాలబ్యూరో,(సింగిడి):** ప్రస్తుత పోటీ ప్రపంచంలో రాణించాలంటే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకెళ్లాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం గద్వాల మండలం గోనుపాడు గ్రామం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాలలోని పలు విభాగాలను పరిశీలించి, తర గతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు తీసుకున్న వివిధ కోర్సులు, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి అడిగారు. వివిధ ల్యాబ్ లను సందర్శించి విద్యార్థులకు అర్థమయ్యేలా శిక్షణ ఇవ్వాలని, అవసరమైన సెమినార్లు నిర్వహించి వివిధ అంశా లపై అవగాహన కల్పించాలని అక్కడి అధ్యాపకులకు సూచిం చారు. కలెక్టర్ మాట్లాడుతూ గద్వాలలోని పాలిటెక్నిక్ కళా శాలలో ఇప్పటికే ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూ టర్ సైన్స్ కోర్సులు ఉండగా ఈ సంవత్సరం నూతనంగా సైబర్ ఫిజికల్ సిస్టం సెక్యూరిటీ కోర్స్ ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పాలిసెట్ కౌన్సిలింగ్ సందర్భంగా ఇప్పటికే వివిధ కోర్సుల్లో చేరిన విద్యార్థులు కొత్త కోర్సులోకి మారేందుకు అవకాశం ఉందన్నారు. ఇటీవల పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు రాసిన విద్యార్థులకు కూడా ఈ కళాశాలలో చేరేందుకు స్పాట్ అడ్మిషన్స్ ద్వారా అవకాశం ఉంటుందన్నారు. వడ్డేపల్లి లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఎలక్ట్రికల్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్లు ఉంటాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడి కళాశాలలో చేరిన విద్యార్థులు గద్వాలలోని పలు వసతి గృహాల్లో ఉన్నందున వారు కళాశాలకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బంది లేకుండా బస్సులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలోని గద్వాల మండలానికి చెందిన కస్తూర్బా విద్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. కొత్త విద్యార్థుల అడ్మిషన్స్ గురించి అడిగి, నిబంధనల ప్రకారం విద్యార్థులను చేర్చుకోవాల న్నారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగు రోజులవుతున్న విద్యార్థులు పూర్తిస్థాయిలో విద్యాలయానికి రాకపోవడమేమిటిని ప్రశ్నించారు. పలు తరగతి గదులలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. పలువురు విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ పర్యటనలో డీఈవో విజయలక్ష్మి, సెక్టోరియల్ అధికారి జ్యోతి,పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్, కస్తూర్బా విద్యాలయ ప్రత్యేక అధికారిని గోపీలత, తదితరులున్నారు.

## ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలి

కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**కల్వకుర్తి,(సింగిడి):** కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్, వెల్దండ గ్రామాలలో జిల్లా కలెక్టర్ పర్యటించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న గృహాలను సందర్శించి లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ఇంటి నిర్మాణ పనుల స్థితిగతులు, ప్రభుత్వ సహాయం అందుతున్న తీరు, ఎదురవుతున్న సమస్యల గురించి ఆరా తీశారు. లబ్ధిదారు లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, నిర్మాణాలను నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని అమలు చేస్తున్న పథకాలను అర్హులందరికీ చేరవేయడం అధికారుల బాధ్యత అని తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో నిర్లక్ష్యానికి తావు లేకుండా క్షేత్రస్థాయిలో



అధికారులు పర్యటిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వెంటనే పరిష్కరిం చాలని సూచించారు. ముఖ్యంగా గృహ నిర్మాణ కార్యక్రమాలను వేగవంతం చేసి లబ్ధిదారులకు సకాలంలో గృహ సౌక ర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెల్దండ గ్రామానికి చెందిన ఉడుత సుమాతమ్మ భర్త ఉడుత జంగయ్య దివ్యాంగు డని, ఆయనకు సదరం ధ్రువీకరణ పత్రం మంజూరు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని సర్పంచ్ యాదమ్మ వెంకటయ్య గౌడ్ కలెక్టర్‌ను కోరారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అంశాలను పరిశీలించి, ప్రభుత్వ నిబంధన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తదనంతరం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీసీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడి వసతులు, పరిశుభ్రత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన నాణ్యత తదితర అంశాలపై సమగ్రంగా ఆరా తీశారు. వసతి గృహ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు కలె క్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని వారు కోరారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులు అవసరమైన ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థుల అవస రాలు, భద్రతను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో, కల్వకుర్తి ఆర్డీవో జనార్ధన్ రెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ కృష్ణ,వెల్దండ తహసీల్దార్ కార్తీక్ కుమార్, ఎంపీడీవో కృష్ణయ్య, ఎంఈవో చంద్రుడు నాయక్, వెల్దండ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, పెద్దపూర్ సర్పంచ్ కేశమల్ల అనూష, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల గ్రామపంచాయతీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి తెలుగు దినపత్రిక
సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
గురువారం 23-7-2026

## ఆగస్టు 3లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



**నాగర్ కర్నూల్, (సింగిడి):** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని బిజినపల్లి మండలం వట్టెం గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిని పరిశీలించిన ఆయన, అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులతో మాట్లాడి చేపడుతున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ. ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరికి ఈ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించాలని, ఆగస్టు 3వ తేదీలోగా ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించని వారి వివరాలు ఓటర్ల జాబితాలో నమోదు కాకపోవచ్చనే విషయాన్ని ప్రతి ఓటరికి స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క ఓటరు కూడా నమోదు ప్రక్రియకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లకు అవసరమైన సమాచారం అందిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు డిజిటలైజేషన్ ప్రక్రియలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదేవిధంగా, అనర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగకుండా చూడడంతో పాటు, ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటరు నమోదు (డూప్లికేట్ నమోదు) జరగకుండా అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితా పారదర్శకంగా, ఖచ్చితత్వంతో రూపొందేలా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ పలు సూచనలు చేశారు. జిల్లా కలెక్టర్ వెంట నాగర్‌కర్నూల్ ఆర్డీవో అర్చన, బిజినపల్లి తహసీల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో, బీఎల్‌వోలు, డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న అధికారులు తదితరులు ఉన్నారు.

### బ్యాంకుల వద్ద అమాయక ప్రజలను

## మోసం చేసే వారిపై అప్రమత్తత

బాన్సువాడ పోలీసుల ఆకస్మిక తనిఖీలు, అవగాహన కార్యక్రమం




**కామారెడ్డి రూరల్ (సింగిడి):** బాన్సువాడ టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ పోలీసు సిబ్బందితో కలిసి బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ బ్యాంకుల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల భద్రత దృష్ట్యా బ్యాంకు పరిసరాలను పరిశీలించారు. ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తుల వివరాలను అవసరమైన మేరకు పరిశీలించి, వారి రాకపోకల ఉద్దేశ్యాన్ని ఆరా తీశారు. అదేవిధంగా బ్యాంకుల బయట పార్కింగ్ చేసిన ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలను కూడా క్షుణ్ణంగా తనిఖీ చేసి, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం బ్యాంకుల వద్ద అమాయక ప్రజలను మాటల్లో పెట్టి మోసాలకు పాల్పడే వారిపై అప్రమత్తత పెంచడం. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చదువురాని లేదా అమాయక ఖాతాదారులను లక్ష్యంగా చేసుకుని నగదు ఉపసంహరణ సమయంలో సహాయం పేరుతో మోసాలకు పాల్పడే ఘటనలను నివారించేందుకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకులకు వచ్చిన ప్రజలకు నగదు డ్రా చేసిన తర్వాత అపరిచితుల సహాయం తీసుకోవద్దని, ఏటీఎం పిన్, ఓటీపీ, బ్యాంకు ఖాతా వివరాలు, డెబిట్, క్రెడిట్ కార్డు వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పవద్దని సూచించారు. తాము బ్యాంకు అధికారులు లేదా సైబర్ అధికారులు అని చెప్పి ఫోన్ చేసే వ్యక్తులను నమ్మవద్దని, అనుమానాస్పద కాల్స్ లేదా సందేశాలకు స్పందించవద్దని వివరించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని, సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజల భద్రత కోసం బ్యాంకుల్లో జరిగే చోరీలు, మోసాలు మరియు ఇతర నేరాలను అరికట్టేందుకు ఇటువంటి ఆకస్మిక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ తులా శ్రీధర్ తెలిపారు. బ్యాంకులకు వచ్చే ప్రజలు అప్రమత్తంగా ఉండి, ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వ్యాఖ్యలపై

## వినయ్ కుమార్ రెడ్డి మండిపాటు

హామీలు విస్మరించి ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారు



**ఆర్మూర్, (సింగిడి):** బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి ఎన్నికల హామీలను విస్మరించి, రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యే జీవన్ చేసిన వ్యాఖ్యలను నిరసనగా ఛలో అంకాపూర్ వెళ్లేందుకు సిద్ధమైన వినయ్ కుమార్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాకేష్ రెడ్డి వ్యక్తిగత విమర్శలు, అనుచిత వ్యాఖ్యలతో రాజకీయ సంస్కృతిని దిగజారుస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో రూపాయికే వైద్యం, ప్రతి గ్రామం లో పేదలకు పది ఉచిత ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా, ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై విమర్శలు చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ పలు కార్యక్రమాలు అమలు చేస్తుంటే, వాటిని జీర్ణించుకోలేకే బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, గ్రామాల్లో అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఇలాంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా సమస్యలపై కాకుండా రాజకీయ లబ్ధి కోసం అంకాపూర్ వైపు తరలించారని ఆరోపించారు. దీనివల్ల వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## నాగర్ కర్నూల్ జిల్లా బీజేవైఎం అధ్యక్షుడిగా నరేష్ చారి



**నాగర్ కర్నూల్ (సింగిడి):** నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షునిగా రాష్ట్ర నాయకత్వం దన్నోజు నరేష్ చారి ని నియమించడం జరిగింది. గత 16 సంవత్సరాలుగా ఏబీవీపీ నాయకునిగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తగా బీజేపీ యువ నాయకుడిగా పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తూ యువకులకు ఆదర్శంగా నిలవడమే కాక పార్టీ కార్యక్రమాల్లో తన దైన ముద్ర వేసుకున్నారు. సామాన్య కార్యకర్తగా మొదలైన తన ప్రయాణం అంచెలంచెలుగా ఎదిగి భారతీయ జనతా యువమోర్చా కార్యదర్శిగా రెండు పర్యాయాలు సోషల్ మీడియా కన్వీనర్ గా నేడు యువ మోర్చా అధ్యక్షునిగా ఎన్నిక కావడం జరిగింది. గతంలో అనేక సేవా కార్యక్రమాలు చేసినప్పటికీ కరోనా కష్టకాల సమయంలో పేదలకు చేసిన సహాయ సహకారాలు విద్యార్థులకు ఆర్థిక సహాయం చేసినవారు తన వంతు సహాయ సహకారాలు అందించడం లాంటి కార్యక్రమాలు చేసి భారతీయ జనతా పార్టీ జెండాను అన్ని గ్రామాలకు చేరవేయాలనే దృఢ సంకల్పాన్ని గుర్తించిన బీజేపీ రాష్ట్ర నాయకత్వం నాగర్ కర్నూల్ జిల్లా భారతీయ జనతా యువమోర్చా అధ్యక్షునిగా నియమించింది ఈ సందర్భంగా నరేష్ చారి మాట్లాడుతూ.. పార్టీ తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీని నా వంతు కృషిగా ముందుకు తీసుకెళ్లి విద్యార్థుల పక్షాన ప్రజలపక్షాన అండగా ఉంటూ బిజెపి యువమోర్చా ను జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తా నని పూర్తి సమయాన్ని ప్రజలకు కేటాయిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ జిల్లాలో తిరుగులేని శక్తిగా బిజెపిని నిలబెట్టడమే తన లక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ అధికారంలో గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రభుత్వ ప్రజలకు యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చేంతవరకు కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గత పది సంవత్సరాలుగా బి ఆర్ఎస్ చేసిన అవినీతిని ప్రజలకు ఎండగడుతున్నామని అన్నారు. నాకు ఈ బాధ్యత రావడానికి సహకరించిన బిజెపి జిల్లా రాష్ట్ర నాయకులకు అందరికీ పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## 22న గద్వాలలో జాబ్ మేళా

**గద్వాల బ్యూరో, (సింగిడి):** నిరుద్యోగ యువతకు గద్వాల, జడ్చర్ల, మహబూబ్ నగర్, హైదరాబాద్ లోని పలు కంపెనీల్లో ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఈ నెల 22న ఉదయం 11:00 గంటలకు జిల్లా కేంద్రంలోని తమ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ప్రశాంతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 18 నుండి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, బీటెక్, తదితర విద్యార్హతలు ఉన్న నిరుద్యోగులకు అవసరమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఫ్యూచర్ అగ్రోటెక్ లిమిటెడ్, పివిఆర్కె, ఆర్ సెటి గద్వాల, జెడిపి సేల్స్, ప్రైమ్ బిజినెస్ సంస్థల ప్రతినిధులు నిరుద్యోగులను ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంటారన్నారు. జిల్లాలోని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# సమయపాలన పాటించని అధికారులు...!

### సర్ సర్వేపై చిత్త శుద్ధి లేని అధికారులు

కార్యాలయం ముందు పడి కాపులు కాస్తున్న ప్రజలు.. సిబ్బంది లేక వేలవేల పోతున్న రెవెన్యూ కార్యాలయం...



**ఆర్మూర్, (సింగిడి):** బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన ఏర్గట్ల గ్రామంలో గల రెవెన్యూ కార్యాలయం లో ఏ ఒక్క అధికారి గాని సిబ్బంది గాని సమయపాలన పాటించకపోవడం, కార్యాలయానికి వచ్చే ప్రజలు సైతం అధికారుల తీరు పట్ల ఆగ్రహాలు వ్యక్తం చేస్తున్నారు. 11 గంటలు దాటిన ఉదయం వేళ రెవెన్యూ కార్యాలయం తెరిచి ఉన్నప్పటికీ ఏ ఒక్క అధికారి గాని సిబ్బంది గాని లేకపోవడంతో, కార్యాలయానికి వచ్చే ప్రజలు తమ విద్యార్థులకు సర్టిఫికెట్ లు, ఇతరాత్ర పనుల నిమిత్తం వచ్చే ప్రజలు చేసేదేమీ లేక తిరుగు ముఖం పడుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ ఏ ఒక్క అధికారి లేరు అని అడిగితే సర్ సర్వే అని చెప్పడం అధికారులకు పరిపాటిగా మారిందని స్థానికులు రెవెన్యూ అధికారుల పేర్లు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు కార్యాలయానికి వచ్చిన ప్రజలు అధికారుల కోసం పాడి కాపులు కాస్తూ వేచి చూస్తున్నారు. ఇసుక మొరం మట్టి అనే వాటి పైనే అధికారులకు దృష్టి ఉండడంతో ఇతరత్రా పనులపై చిత్తశుద్ధి లేదని స్థానికులు వాపోతున్నారు. సమయపాలన పాటించని, మరోపక్క సర్ సర్వే కొనసాగుతున్న చిత్తశుద్ధి లేని అధికారులపై, ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి ప్రజలకు అందుబాటులో ఉండేలా, అప్పటికే రైతులు సైతం పట్టా పాస్ బుక్ ల కోసం విచ్చేసి తిరుగు ముఖం పట్టారు. ప్రస్తుతం విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు అందించేలా చర్యలు చేపట్టి ఆదుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, రైతులు, స్థానికులు కోరుతున్నారు.



# పత్రికా విలేకరులపై దాడి అత్యంత బాధాకరం

బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి



**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయం తెలుసుకొని ఫోటోలు తీసుకునేందుకు అక్కడికి వెళ్లిన ఓ పత్రిక విలేకరి డి. రాము, జిల్లా ఫోటోగ్రాఫర్ తాహేర్ పై ఇసుక మాఫియా దాడికి పాల్పడడం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎస్. రాజేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛ అత్యంత విలువైన హక్కు అని తెలిపారు. సమాజానికి నిజమైన సమాచారాన్ని అందించేందుకు విధులు నిర్వహిస్తున్న పత్రికా విలేకరులపై జరిగిన దాడి అత్యంత బాధాకరమన్నారు. విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై భౌతిక దాడులు, బెదిరింపులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను కోరుతున్నామన్నారు. పత్రికా స్వేచ్ఛను పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జర్నలిస్టులపై దాడులను ఏ పరిస్థితుల్లోనూ సహించబోమని, బాధ్యులపై నిష్పాక్షిక విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## మీ సేవ కేంద్రం మంజూరుకు కృషి చేయాలి.

## రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని కలిసిన కాంగ్రెస్ నాయకులు.



**కామారెడ్డి రూరల్ (సింగిడి):** బీబీపేట్ మండలంలోని మాందాపూర్ గ్రామంలో మీ సేవ కేంద్రం మంజూరు కృషి చేయాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ కి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్, గ్రామ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రొడ్డ రాజు తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, రైతులు, మహిళలు ఆయా సర్టిఫికెట్లు నమోదుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు రాష్ట్ర ప్రభుత్వం యూరియాను యాప్ ద్వారా అందిస్తుందని గ్రామంలో స్మార్ట్ ఫోన్ లేని రైతులు యూరియా నమోదుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వివరించామన్నారు అనంతరం వార్డ్ సభ్యులు శివనూరి నర్సింలు, రొడ్డ లావణ్య బాబు లతో కలిసి గ్రామంలో పలు వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీలకు నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశామన్నారు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తక్షణమే స్పందించి మీ సేవా కేంద్రం ఏర్పాటుకు ఆయా అధికారులతో మాట్లాడి గ్రామంలో మీ సేవ కేంద్రం ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు. త్వరలోనే సీసీ రోడ్లు డ్రైనేజీలకు కూడా నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెసు నాయకులు శ్యామ్ లాల్, శివ కుమార్, సామేల్ పాల్గొన్నారు

# సర్ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలి

ఓటర్ల ఎన్యూమరేషన్‌పై కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ స్పష్టత



**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ పరిధిలోని పలు మండలాల్లో కొనసాగుతున్న సర్ నమోదు ప్రక్రియను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సోమవారం రోజున సుడిగాలి పర్యటన జరిపి పరిశీలించారు. మోర్తాడ్, భీంగల్ కమ్మర్ పల్లి మండల కేంద్రాల్లో సర్ నమోదు సరళిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఆయన, అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటర్ల ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. 100 శాతం ఎన్యూమరేషన్ లక్ష్యం అనంతరం కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో పర్యటించి, ఇంకా మిగిలిపోయిన ఓటర్ల నమోదు ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును, దివంగత నేత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 18 ఏళ్ల నిండిన యువకులకు ఓటు హక్కు కల్పించిన ఆశయాలకు అనుకూలంగా మిగిలిపోయిన అర్హులైన ఓటర్ల ఎన్యూమరేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, (బూత్ లెవల్ ఏజెంట్లు) (బూత్ లెవల్ ఆఫీసర్లు) దిశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలో వంద శాతం ఓటర్ల ఎన్యూమరేషన్ పూర్తయ్యేంత వరకు ఎవరూ విశ్రమించవద్దని, ప్రతీ ఒక్క అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 56 ఏళ్ల పాత పంచాయతీ భవనం శిథిలావస్థలోకి..!

డిస్మాంటిల్ చేయాలని పంచాయతీరాజ్ ఏఈ ఆదేశాలు

డీపీఓకు వినతిపత్రం అందజేసిన నెల్లిపాక బంజర సర్పంచ్ ముండ్రు రామకృష్ణ



**అశ్వాపురం, (సింగిడి):** అశ్వాపురం మండలం నెల్లిపాక బంజర గ్రామపంచాయతీకి అత్యవసరంగా నూతన గ్రామపంచాయతీ భవనాన్ని మంజూరు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ముండ్రు రామకృష్ణ సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీఓ)కు వినతిపత్రం సమర్పించారు. సర్పంచ్ ముండ్రు రామకృష్ణ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామపంచాయతీ కార్యాలయంగా ఉపయోగిస్తున్న భవనం 1970 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం శాఖ మంత్రిగా ఉన్న జలగం వెంగళరావు ప్రారంభించిన భవన మని తెలిపారు. ఆనాటి నిర్మాణ విధానంలో డంగ్ సున్నంతో నిర్మించబడిన ఈ భవనం కాలక్రమేణా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రస్తుతం భవనం గోడలు పగుళ్లు ఏర్పడి, పైకప్పు బలహీనపడటంతో ఎప్పుడైనా ప్రమాదం సంభవించే పరిస్థితి నెలకొందని తెలిపారు. భవనం శిథిలావస్థలో ఉండటంతో ప్రజాప్రతినిధులు, సిబ్బంది, గ్రామస్తుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) భవనాన్ని పరిశీలించి, అది వినియోగానికి అనుకూలంగా లేదని నిర్ధారించి, డిస్మాంటిల్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే పాత భవనం స్థానంలో






కొత్త భవనం లేకపోవడంతో గ్రామపంచాయతీ పరిపాలన తీవ్ర ఇబ్బందులకు గురవుతోందన్నారు. గ్రామసభలు, పాలకవర్గ సమావేశాలు నిర్వహించడానికి తగిన స్థలం లేకపోవడంతో పాటు, పంచాయతీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ధ్రువపత్రాల జారీ, పన్నుల వసూళ్లు, ప్రజల సమస్యల పరిష్కారం వంటి నిత్య పరిపాలనా కార్యక్రమాలు కూడా ఇబ్బందికరంగా మారాయని వివరించారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన పాలన అందించాలంటే అన్ని వసతులతో కూడిన ఆధునిక గ్రామపంచాయతీ భవనం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. నూతన భవనం నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని డీపీఓను కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా పంచాయతీ అధికారిణి సమస్యను సానుకూలంగా పరిశీలిస్తామని, సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిబంధనల మేరకు అవసరమైన చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామాభివృద్ధికి గ్రామపంచాయతీ కార్యాలయం కేంద్రబిందువుగా ఉండే నేపథ్యంలో, దాదాపు ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన పాత భవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని నెల్లిపాక బంజర గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అనుమతులు లేని ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

### ఎస్ఐ కురుమూర్తి

**కల్వకుర్తి (సింగిడి)::** అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ నీ పట్టుకున్నట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు. మండలంలోని తోటపల్లి గ్రామంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ నీ తోటపల్లి గ్రామ శివారులో పట్టుకొని ట్రాక్టర్ యజమాని , డ్రైవర్ పై కేసు నమోదు చేసి ట్రాక్టర్ నీ పోలీసు స్టేషన్ కి తరలించినట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.



### ఎల్లారెడ్డిలో హెచ్‌డీఎఫ్‌సీ


## బ్యాంక్ గోల్డ్ లోన్ సేవలు

ప్రారంభించిన మున్సిపల్ చైర్మెన్



**కామారెడ్డి ప్రతినిధి, (సింగిడి):** ఎల్లారెడ్డి పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో గోల్డ్ లోన్ విభాగాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు తక్కువ వడ్డీతో వేగవంతమైన బ్యాంకింగ్ సేవలు అందించడం అభినందనీయమన్నారు. బ్యాంకు మేనేజర్ ఆశోక్ మాట్లాడుతూ, కేవలం 5 నిమిషాల్లోనే బంగారంపై రుణాలు మంజూరు చేసే గోల్డ్ లోన్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 వ వార్డ్ ఇండిపెండెంట్ కౌన్సిలర్ సిద్ది శ్రీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు విద్యాసాగర్, కో – ఆప్షన్ సభ్యుడు పప్పు వెంకటేశం, బ్యాంకు సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ కోతలపై ఆర్డీఓకు అధికార కాంగ్రెస్ పార్టీ నేత వినతి



**కామారెడ్డిప్రతినిధి, (సింగిడి):** గత వారంరోజులుగా ఎల్లారెడ్డి మండల కేంద్రంలో కొనసాగుతున్న తరచూ... విద్యుత్ కోతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని కోరుతూ... కాంగ్రెస్ నేత, ఎల్లారెడ్డి మాజీ జడ్పీటీసి షేక్ గయాజుద్దీన్ సోమవారం ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రభాకర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, నిరంతర విద్యుత్ అంతరాయాల వల్ల విద్యార్థులు, వృద్ధులు, వ్యాపారులు, చిన్నారులు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇటీవల విద్యుత్ కోతల వల్ల ఏర్పడిన ఉక్కపోత కారణంగా ఎల్లారెడ్డిలో ఒక క్యాన్సర్ రోగి మృతి చెందారన్నారు. ప్రజల ప్రాణ భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసి, ఎల్లారెడ్డి మండల కేంద్రం లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా తక్షణ చర్యలు తీసుకోవాలని, అనవసర విద్యుత్ కోతలను నివారించాలని ఆయన ఆర్డీఓ ను కోరినట్లు చెప్పారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీఓ సమస్యను పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం..

## జ్వర బాధితులకు వైద్య సేవలు



**బిక్కనూరు, (సింగిడి)::** బిక్కనూర్ మండల కేంద్రంలోని కొత్తపేట హనుమాన్ మందిరం సమీపంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ హేమీమా ఆదేశాల మేరకు జ్వర లక్షణాలతో బాధపడుతున్న వారిని పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం శ్యామల మాట్లాడుతూ, వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు శ్యామల, వనజ, సంతోషి, సుకన్య పాల్గొని ప్రజలకు ఆరోగ్య అవగాహన కల్పించారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ విక్టర్.



**కామారెడ్డి ప్రతినిధి, (సింగిడి):** ప్రతి సోమ వారం నిర్వహించే ప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ విక్టర్. ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన 121 దరఖాస్తులను స్వీకరించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులను అదనపు కలెక్టర్ స్వయంగా వారి సమస్య లను తెలుసుకున్నారు. అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, వాటిని ప్రాధాన్యతతో పరిశీలించి నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ పాండు, జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణ

## వేగవంతం చేయాలి

డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్



**భిక్కనూర్, (సింగిడి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు నమోదు అయ్యేలా గ్రామ పాలన అధికారులు కృషి చేయాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. సోమవారం భిక్కనూర్ తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ పాలన అధికారులతో నిర్వహించిన సమావేశంలో గ్రామాల వారీగా ఓటరు జాబితా సవరణ పురోగతిని సమీక్షించారు. ఇంటింటికి పంపిణీ చేసిన దరఖాస్తు ఫారాలను సకాలంలో సేకరించి, గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, రెవెన్యూ సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో గ్రామ పాలన అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


'గాడ్జిల్లా గర్ల్'
# కన్నుమూత..
## 18 ఏళ్లకే ముగిసిన ప్రయాణం



హాలీవుడ్ ప్రముఖ చిత్రం 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్'లో నటించి ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న యువ నటి కేలీ హాటిల్ (18) రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది. అమెరికాలోని మేరీల్యాండ్‌లో మంగళవారం వేకువజామున జరిగిన కారు ప్రమాదంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంతర్జాతీయ మీడియా సమాచారం ప్రకారం.. కారు అతివేగంగా నడపడమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాద సమయంలో కారు నడుపుతున్న 19 ఏళ్ల యువకుడు గాయాలతో ఆస్పత్రిలో చేరగా, కారులో ఉన్న మరో ప్రయాణికుడు సురక్షితంగా బయటపడ్డాడు. కేలీ మరణవార్తను ఆమె తండ్రి జాషువా హాటిల్ ఫేస్‌బుక్‌లో అమెరికన్ సైన్ లాంగ్వేజ ద్వారా ధృవీకరించారు.

**స్ఫూర్తిదాయక ప్రయాణం..**

జార్జియాలో జన్మించిన కేలీ పుట్టుకతోనే బధిరురాలు (చెవిటి). ఆమె తండ్రి వైపు నాలుగు తరాలుగా ఈ సమస్య ఉన్న కుటుంబ నేపథ్యం నుంచి వచ్చింది. తన లోపాన్ని జయించి హాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆమె, 2021లో వచ్చిన 'గాడ్జిల్లా వర్సెస్ కాంగ్', 2024 లో వచ్చిన 'గాడ్జిల్లా ఇ కాంగ్: ది న్యూ ఎంపైర్' చిత్రాల్లో 'జియా' అనే అనాథ పాత్రలో నటించి మెప్పించింది. సినిమాలో కాంగ్‌తో సైన్ లాంగ్వేజ్ ద్వారా ఆమె పలికించిన భావోద్వేగాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ పాత్రకు గానూ ఆమె ఉత్తమ యువ నటిగా 'సాటర్న్ అవార్డు'కు కూడా నామినేట్ అయింది. చిన్న వయసులోనే అద్భుతమైన ప్రతిభ కనబరిచిన కేలీ హఠాన్మరణం సినీ అభిమానులకు తీరని లోటు. ఆమె మృతి పట్ల ప్రముఖ నిర్మాణ సంస్థ వార్నర్ బ్రదర్స్‌తో పాటు, ఆమె విద్యాభ్యాసం చేసిన టెక్సాస్ స్కూల్ ఫర్ ది డెఫ్ తీవ్ర విచారం వ్యక్తం చేశాయి.



# 'ఎపిక్' తేదీ ఫిక్స్!

టాలీవుడ్ యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న సినిమా 'ఎపిక్'. 'బేబీ' సూపర్ హిట్ సక్సెస్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తోన్న ఈ మూవీపై అభిమానుల్లో సూపర్ హైప్ ఉంది. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, శ్రీకర స్టూడియోస్, ఫార్చ్యూర్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్‌పై నాగవంశీ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. హిషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. ప్రేమ, సంబంధాలు, యువత ఆలోచనా విధానం వంటి అంశాలను కొత్త కోణంలో చూపించనున్న ఈ మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ సెప్టెంబర్ 3న రాబోతున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. కానీ ఇప్పటి వరకు దీనిపై అఫీషియల్ ప్రకటన రాలేదు. అయితే.. తాజాగా ఈ సినిమా రిలీజ్‌పై మరోసారి అప్డేట్ వచ్చింది. ఎపిక్ చిత్రాన్ని సెప్టెంబర్ 11న థియేటర్లలోకి తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తున్నారట మేకర్స్. దాదాపు ఇదే డేట్ కన్ఫర్మ్ చెయ్యగా.. దీనిపై త్వరలోనే అఫీషియల్ అనౌన్స్‌మెంట్ రావాల్సి వచ్చింది.



singidinews@gmail.com

Vaishnavi Chaitanya


# ఇంటర్‌లోనే లవ్‌లో పడ్డ రాజమౌళి

స్టార్ డైరెక్టర్‌గా ఉన్నత శిఖరాలకి ఎదిగిన రాజమౌళి కూడా ఒకప్పుడు సాధారణ విద్యార్థే. అయితే ఆయన గతంలో చెప్పిన తన తొలి ప్రేమ జ్ఞాపకాలు మరోసారి సోషల్



మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఒక పాత ఇంటర్వ్యూలో రాజమౌళి తన ఇంటర్ రోజుల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న సమయంలో తన క్లాస్‌లో ఉన్న ఓ అమ్మాయిని ఎంతో ఇష్టపడినట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆమెపై ఉన్న అభిమానాన్ని లేదా ప్రేమను నేరుగా చెప్పే ధైర్యం మాత్రం తనకు ఎప్పుడూ రాలేదని చెప్పారు.తనకు ఆ అమ్మాయి అంటే ఇష్టమని క్లాస్‌లోని దాదాపు అందరికీ తెలుసని, స్నేహితులు కూడా ఆ విషయంపై తనను ఆటపట్టించేవారని గుర్తుచేసుకున్నారు. అయినప్పటికీ ఏడాది మొత్తం గడిచిపోయే వరకు ఆమెతో మాట్లాడే అవకాశం రాలేదని తెలిపారు.చివరికి విద్యా సంవత్సరం ముగిసే సమయానికి ఒక్కసారి ధైర్యం చేసి ఆమెతో మాట్లాడానని చెప్పారు. తన ముందు కూర్చున్న ఆ అమ్మాయిని పేరు పెట్టి పిలుస్తూ 'ట్యూషన్ ఫీజు కట్టావా?' అని మాత్రమే అడిగానని తెలిపారు. ఆమె ఒక్కసారిగా వెనక్కి తిరిగి తన వైపు చూసిన ఆ క్షణం ఇప్పటికీ తన మదిలో నిలిచిపోయిందని, ఆ ఒక్క చూపు కోసం చాలా రోజులుగా ఎదురుచూశానని రాజమౌళి భావోద్వేగంగా చెప్పుకొచ్చారు.ఆ సంఘటన జరిగినప్పుడు రాజమౌళి ఏలూరులో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారని తెలుస్తోంది. అనంతరం కొంతకాలం చదువుకు విరామం ఇచ్చిన ఆయన, తర్వాత ఇంటర్ రెండో సంవత్సరం పూర్తి చేశారు. ఆ తర్వాత సినీ రంగంలో అడుగుపెట్టి రచయితగా, దర్శకుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించారు. సినీ పరిశ్రమలో స్థిరపడిన తర్వాత తమ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న కుటుంబానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రమను ప్రేమ వివాహం చేసుకున్నారు. అప్పటి నుంచి రమ ఆయన వ్యక్తిగత జీవితంలోనే కాకుండా వృత్తిపరమైన ప్రయాణంలోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తున్నారు.

ఆలయ ఉత్సవాల్లో
# విజయ్.. త్రిషలతో బ్యానర్
## ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు



కోలీవుడ్ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, స్టార్ హీరోయిన్ త్రిష పేర్లు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో తరచూ చర్చకు వస్తున్నాయి. వీరిద్దరి గురించి పలు రకాల ప్రచారాలు జరుగుతున్నప్పటికీ, వాటిపై అధికారికంగా ఎలాంటి స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో తమిళనాడులో జరిగిన ఓ ఆలయ ఉత్సవంలో విజయ్, త్రిష చిత్రాలతో ఏర్పాటు చేసిన బ్యానర్ ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. తమిళనాడులోని సేలం జిల్లా ఆత్తూర్‌లో జరుగుతున్న మారియమ్మన్ ఆలయ ఆషాఢ ఉత్సవాల సందర్భంగా కొందరు యువకులు ప్రత్యేక బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. ఆ బ్యానర్‌లో విజయ్‌ను పది తలల రావణాసురుడి రూపంలో, త్రిషను అమ్మవారి రూపంలో చిత్రీకరించారు. ఈ డిజైన్ స్థానికంగా మాత్రమే కాకుండా సోషల్ మీడియాలో కూడా వేగంగా వైరల్ అయింది. బ్యానర్ బయటకు రావడంతో నెటిజన్లు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పవిత్రమైన ఆలయ ఉత్సవాల్లో సినీ ప్రముఖుల చిత్రాలను ఈ విధంగా ఉపయోగించడం సరికాదని పలువురు విమర్శించారు. ముఖ్యంగా దేవతా రూపాలతో నటీనటులను పోల్చి చూపడంపై ఆగ్రహం వ్యక్తమైంది. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో అధికారులు వెంటనే స్పందించారు. వివాదాస్పద బ్యానర్‌ను తొలగించడంతో పాటు, దానిని ఏర్పాటు చేసిన ఇద్దరు యువకులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఘటనపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

రంభ ఊర్వశి మేనక'..
# కొత్త సాంగ్ రిలీజ్..

అల్లరి నరేశ్ ప్రధానపాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రంభ ఊర్వశీ మేనక' చంద్రమోహన్ చింతడ దర్శకత్వంలో రానున్న ఈ సినిమాలో సురభి కథానాయికగా కనిపించనున్నారు. సెప్టెంబర్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సినిమాలోని 'నా కంటి మీద కునుకే'అంటూ సాగే పాటను విడుదల చేశారు. భాస్కరభట్ల రవికుమార్ లిరిక్స్ అందించిన ఈ పాటను ధనుంజయ్ ఆలపించారు.



Actress Surabhi

సినిమా సింగిడి
Cinma Singidi

గురువారం
23-7-2026

Printed,published & Owned by P. Sunitha Reddy on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Dussa Shivaprasad, PRGI.NO. TGTEL/26/A4370. Cell 8179799090